ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

కడప

: fb.com/vaartha Digital


Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

30-9-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 240 పేజీలు: 10+4 వెల: 6.50

ఢాకాలో 80 వేల ముస్లిం ఓట్లు తొలగింపు

మెలోనీ ఆత్మకథకు ప్రధాని మోడీ ముందుమాట

5లో



## ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి

### లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి చేరుతున్న నీరు

### బాధితులు పునరావాస కేంద్రాలకు తరలింపు

### ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: మంత్రి అనగాని

**విజయవాడ,సెప్టెంబరు29,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ఉధృతంగా ఉంది. ఇప్పటికే రెండో ప్రమాద హెచ్చరికను జలవనరుల శాఖ అధికారులు జారీచేసారు. నదీ పరివాహక ఆవాశిత ప్రాంతాల్లో ఇళ్లల్లోకి వరద నీరు చేరటంతో నిర్వాసితులను పునరావాస కేంద్రాలకు తరలించారు, వరద నీటి ఉధృతితో భయాందోళనలో నది పరివాహ ప్రాంతవాసులు ఉన్నారు. ప్రకాశం బ్యారేజ్ ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 6.81 లక్షల క్యూసెక్కులుగా ఉంది, 69 గేట్లను పూర్తిస్థాయిలో ఎత్తి వరద నీరు అధికారులు విడుదల చేస్తున్నారు. టూరిజం సిబ్బంది విజయవాడ బెర్న్‌పార్క్ వద్ద అప్రమత్తమైయ్యారు. పర్యాటకశాఖ బోట్లు తాళ్లతో కట్టేశారు. నదీపరివాహక ప్రాంతాల్లో ప్రజ >>2

# ఇంటింటికి జిఎస్టీ ఫలాలు



సోమవారం జిఎస్టీపై కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో సిఎం చంద్రబాబు

### రాష్ట్రమంతా జిఎస్టీ 2.0 సంస్కరణలపై విస్తృత ప్రచారం

### అక్టోబరు 19 వరకు వేర్వేరు థీమ్స్‌తో ప్రజల్లోకి

### జిల్లా కేంద్రాల్లో దీపావళి సంబరాలు

### జిఎస్టీ ఉత్సవ్‌పై కేబినెట్ సబ్‌కమిటీ భేటీలో సిఎం చంద్రబాబు

**విజయవాడ సెప్టెంబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** సూపర్ జిఎస్టీసూపర్ సేవింగ్స్ పేరిట రాష్ట్ర ప్రభుత్వం జిఎస్టీ ప్రయోజనాలను రాష్ట్రంలోని ఇంటింటికీ తీసుకెళ్లేలా కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీతో సిఎం చంద్రబాబు నాయుడు సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిఎస్టీ 2.0 సంస్కరణల ప్రయోజనాలను ప్రజలు, వినియోగదారుల్లోకి తీసుకెళ్లేలా విస్తృత ప్రచారం చేసేందుకుగాను రాష్ట్ర వ్యాప్తంగా 65 వేల సమావేశాలు, కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించారు. వచ్చే నెల 19వ తేదీ వరకు వేర్వేరు థీమ్‌లతో ఈ ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కేబినెట్ కమిటీకి సిఎం చంద్రబాబు దిశా నిర్దేశంచేశారు. దీనిపై అధికారులు మాట్లాడుతూ...ఇప్పటికే ఇంటింటికీ జిఎస్టీ ఫలాల్తు థీమ్‌తో నిత్యవసరాలు, ఔషధాలు, స్టేషనరీ, వస్త్రాలు, క్రీడా వస్తువులు, రవాణా, మహిళలు, చిన్నారులకు సంబంధించిన వస్తులపై పన్నులు తగ్గిన అంశాన్ని విస్తృతంగా ప్రచారం నిర్వహించామని, క్షేత్రస్థాయిలో వీటిపై అవగాహన కల్పించామన్నారు. అన్ని వర్గాలకు జిఎస్టీ తగ్గింపు ప్రయోజనాలు తెలిసేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు చేపట్టింది. సెప్టెంబరు 30 నుంచి అక్టోబరు 19వ తేదీ వరకు వ్యవసాయం, ఎంఎస్ఎంఇలు, చేనేతఉత్పత్తులు, ఆక్వా, విద్యారంగం, బీమా, ఎలక్ట్రానిక్స్, ఈ కామర్స్, భవన నిర్మాణ రంగం, టూరిజం, ఆతిథ్య రంగం, రవాణా, లాజిస్టిక్స్, క్రీడా పరికరాలు, పునరుత్పాదక విద్యుత్, ఆటో మొబైల్స్, తదితర అంశాలపై రంగాల వారీగా ఆయా శాఖలు ప్రచారం చేపట్టాలని సిఎం సూచించారు.

రైతులకు అవగాహన కల్పించేలా ట్రాక్టర్ ర్యాలీలు, యంత్రాల ప్రదర్శన చేపట్టాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఆప్కో, లేపాక్షి, ఒక జిల్లాఒక ఉత్పత్తి పేరిట మేళాలు, ఎంఎస్ఎంఇ యూనిట్లలో తయారయ్యే ఉత్పత్తులు, దానికి సంబంధించిన పన్నుల తగ్గింపుపై ప్రచారం నిర్వహించేలా చూడాలన్నారు. సెలూన్లు, యోగా సెంటర్లు, జిమ్‌లలో జీఎస్టీల తగ్గింపు వల్ల ధరలు ఎంత వ్యత్యాసం వచ్చిందో అవగాహన కల్పించాలని సిఎం ఆదేశించారు.

జిఎస్టీ తగ్గింపుతో స్టేషనరీ ఉత్పత్తులపైనా ధరలు గణనీయంగా తగ్గిన అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సమావేశంలో నిర్ణయించారు. వీటిపై అవగాహన కల్పించేలా విద్యార్థులకు వ్యాస రచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించాలని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రంలోని 7వేల ఉన్నత పాఠశాలలు, 4 వేల జూనియర్ కాలేజీల్లో ఈ ప్రచారం నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. అలాగే జీవిత బీమా, ఆరోగ్య బీమాలకు సంబంధించి జీరో జిఎస్టీ విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులకు సంబంధించి ధరలపై అవగాహన కల్పించేందుకు ఉత్పత్తిదారులు, డీలర్లతో జిల్లా, నియోజకవర్గ, మండలాల వారీగా 850కి పైగా చోట్ల కార్యక్రమాలు చేపట్టాలని ఈ భేటీలో నిర్ణయించారు. ఇకామర్స్ రంగానికి సంబం >>2



## భారతీయ సినిమాలపై 100% సుంకాలు

### ట్రంప్ పేల్చిన మరో బాంబు

**వాషింగ్టన్, సెప్టెంబరు 29:** భారత్‌పైనే కాకుండా తనకు వ్యతిరేక వైఖరితో ఉన్న దేశాలపై సుంకాలను బాదిపారేస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌మరో సంచలన నిర్ణయం ప్రకటించారు. తన సొంత సోషల్‌మీడియా సంస్థ ట్రూత్‌లో సోమవారం ఆయన మరో సంచలన పోస్టుచేసారు. ఇకనుంచి విదేశాల్లో తీసే సినిమాలు అమెరికాలో ప్రదర్శిస్తే 100 శాతం సుంకాలు విధిస్తామని ప్రకటించారు. ఇప్పటికే భారత ఎగుమతులపై 50శాతం సుంకాలు విధించిన ట్రంప్ ప్రకటించిన ఈ తాజా నిర్ణయంతో భారతీయ చిత్రాలపై భారీ ప్రభావం పడనున్నది. అమెరికా వెలుపల నిర్మించే సినిమాలపై సుంకాలు అమలు చేయనున్నట్లు హెచ్చరించారు. వందశాతం సుంకాలను విధించనున్నట్లు ప్రకటించారు. విదేశీ సినిమాలపై వందశాతం సుంకాలు అమలుకానున్నాయి. 'మా సినిమా నిర్మాణ వ్యాపారాన్ని అమెరికా నుంచి ఇతర దేశాలను ఓ శిశువునుంచి మిఠాయిని తొలగించినట్లుగా దొంగిలించా >>2

## టివికె జిల్లాప్రధానకార్యదర్శి మథియజగన్ అరెస్టు

**చెన్నై, సెప్టెంబరు 29:** టివికెచీఫ్ విజయన్ కరూర్ రాలీ దుర్ఘటనకు సంబంధించి విజయ్‌పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మథియజగన్‌ను కరూర్ పోలీసులు అరెస్టుచేసారు. పోలీసులు ఆయనపై హత్యాయత్నం, ఉద్దేశపూర్వక నేరపూరిత చర్యలకు యత్నం, ప్రజాభద్రతకు భంగం కలిగించడం వంటి అభియోగాలకింద కేసు నమోదు చేసారు. అలాగే టివికె ప్రధాన కార్యదర్శు బుస్సీ ఆనంద్, జాయింట్ జనరల్ సెక్రటరీ నిర్మల్ సేకర్‌లపైనా కేసులునమోదయ్యాయి. ఒక పోలీస్ అదికారి ఫిర్యాదుమేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసారు. విజయ్ వైఖరివల్లనే 41 మంది చనిపోయేందుకు కారణం అయిందని, విజయ్ ఉద్దేశ్యపూర్వకంగానే ఆయన రాకను ఆలశ్యంచేసారని, కనీసం నాలుగుగంటలపాటు జాప్యంచేసారని, ఈలోపు అక్కడ రద్దీపెరిగిపోయిందని, దీనితో అసహనం పెరిగి కట్టడిచేయడమే కష్టం అయిందని పోలీస్ అధికారి ఫిర్యాదుమేరకు ఎఫ్ఐఆర్ రిజిస్టరుచేసారు.

## మంత్రి లోకేష్‌కు తిలక్ వర్మ ప్రత్యేక బహుమతి



**విజయవాడ,సెప్టెంబరు 29,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆసియా కప్ ఫైనల్ హీరో, భారత క్రికెటర్ తిలక్ వర్మ మంత్రి నారా లోకేశ్‌కు ప్రత్యేక బహుమతి ఇవ్వనున్నారు. పాకిస్థాన్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తాను ఉపయోగించిన క్యాప్‌ను మంత్రి లోకేశ్‌కు ప్రేమతో ఇస్తున్నట్లు తిలక్‌వర్మ పేర్కొన్నారు. ఈ మేరకు తిలక్ వర్మ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. తిలక్ వర్మ బహుమతికి మంత్రి లోకేశ్ ముగ్ధుడయ్యారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం 'ఎక్స్'లో లోకేశ్ పోస్టు చేశారు. తమ్ముడు తిలక్ వర్మ బహుమతి నాకెంతో ప్రత్యేకమైందని స్వదేశానికి వచ్చాక అతడి చేతుల మీదుగానే క్యాప్ తీసుకుంటానని పేర్కొన్నారు. క్యాప్‌పై తిలక్ వర్మ సంతకం చేస్తున్న వీడియోను మంత్రి లోకేశ్ షేర్ చేశారు. ఆసియా కప్ ఫైనల్‌లో తిలక్ వర్మ 69 పరుగులతో నాటౌట్‌గా నిలిచి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించారు. ఇక భారత్ ఛాంపియన్స్‌గా నిలవడంలో తెలుగు కుర్రాడు తిలక్ వర్మ కీలక పాత్ర పోషించాడు. లక్ష్య ఛేదనలో మూడ వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయిన జట్టును తిలక్ తన వీరోచిత ఇన్నింగ్స్‌తో విరుచుకుపడ్డాడు. తిలక్ ఆట తీరుతో మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. ఆసియా కప ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను చిత్తు చేసి టైటిల్‌ను సొంతం చేసుకుంది భారత్. తిలక్ వర్మ (69 రన్స్ చేస్తే >>2



సోమవారం దుర్గమ్మతల్లికి సతీసమేతంగా పట్టు వస్త్రాలు తీసుకుని వెళ్తున్న సిఎం చంద్రబాబు

## దుర్గమ్మకు పట్టు వస్త్రాలు

### సతీ సమేతంగా అమ్మవారిని దర్శించి సమర్పించిన సిఎం చంద్రబాబు

### ముఖ్యమంత్రికి వేదాశీర్వచనం అందించిన ఆలయ అర్చకులు

**విజయవాడ,సెప్టెంబరు 29,ప్రభాతవార్త ప్రతినిధి:** ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ దర్శనార్థం సాధారణ భక్తులకు ప్రాధాన్యం ఇస్తున్నామని సిఎం నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. భక్తుల కోసం నిర్మిస్తున్న అన్న ప్రసాద భవనం మరో ఆరు నెలల్లో పూర్తవుతుందని చెప్పారు. సోమవారం ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వర స్వామివారి దేవాల >>2

## ఎంపి మిథున్ రెడ్డికి బెయిలు

### లిక్కర్ కుంభకోణం కేసు



**విజయవాడ, సెప్టెంబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** లిక్కరు కుంభకోణం కేసులో ఎంపి మిథున్ రెడ్డికి బెయిల్ మంజూరయ్యింది. ఈ మేరకు మద్యం అక్రమ కేసుకు సంబంధించి మిథున్‌రెడ్డికి సోమవారం ఎసిబి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. మిథున్‌రెడ్డి మద్యం కుంభకోసం కేసులో కీలక నిందితునిగా ఉన్నారు. ఈ కేసులో ఆయనను సిట్ అరెస్ట్ చేయడంతో రాజమండ్రి సెంట్రల్ జైలులో దాదాపు 70 రోజులుగా ఆయన రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల సందర్భంగా విజయవాడ ఎసిబి కోర్టు ఓటు వేసేందుకు మిథున్‌రెడ్డికి తాత్కాలిక బెయిల్ ఇచ్చినప్పటికి తరువాత తిరిగి రిమాండ్‌కు పంపింది. ఇటీవల మిథున్‌రెడ్డి సిట్ రెండు రోజులు కస్టడీకి తీసుకుని విచారించింది. నేడు ఆయనకు ఎసిబి కోర్టు బెయిల్ ఇచ్చింది.



సోమవారం మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న హైదరాబాద్ సిపి ఆనంద్, చిత్రంలో నాగార్జున, చిరంజీవి, వెంకటేష్

## భారీ సినీ పైరసీ గుట్టురట్టు

### 500 సినిమాలు అక్రమంగా రికార్డు చేసిన ముఠా

### డిజిటల్ శాటిలైట్లు హ్యాక్‌చేసి పైరసీ తయారీ

### హైదరాబాద్ సిటీ కొత్వాల్ ఆనంద్ వెల్లడి

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** దేశంలోనే అతిపెద్ద సినిమా పైరసీ ముఠాను హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. ఈ స ందర్భంగా ముఠాకు చెందిన ఐదుగురిని అరెస్టు చేయగా వీరి వద్ద నుంచి సినిమా పైరసీకి వాడిన పలురకాల ఉపకరణాలను, సెల్‌ఫోన్లను జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను సిటీ పోలీసు కమిషనర్ సి.వి ఆనంద్ సోమవారం మీడియాకు వెల్లడించారు. ఈ ఏడాది జూన్ ఐదవ తేదీన తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, యాంటీ వీడియో పైరసీ సెల్ తరపున అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేయగా ఈ మఠా గుట్టు రట్టయ్యిందని ఆయన తెలిపారు. ఈ ఏడాది మే తొమ్మిదవ తేదీన విడుదలైన సింగిల్, హిట్ థర్డ్ కేస్ సినిమాలు పైరసీకి గురైనట్లు ఆ ఫిర్యాదులో వుందని, ఈ రెండు సినిమాలు మొదటి రోజునే పైరసీకి గురైనట్లు తమ విచారణలో తేలిందని ఆయన తెలిపారు. దీనిపై మరింత లోతుగా విచారణ చేస్తే థియేటర్లలోనే పైరసీ జరిగిందని నిర్ధారణ అయిందని ఆనంద్ తెలిపారు.) ఈ ఘటనపై నాలుగు నెలల పాటు విచారణ సాగించగా బిహార్‌లోని గుల్జార్‌బాగ్‌కు చెందిన అశ్విని కుమార్ (21), తమిళనాడులోని కరూర్ జిల్లా వెలుస్వామిపురం నివాసి సిరిల్ ఇన్ఫంట్ రాజ్ అమలదాస్ (32), ఇదే రాష్ట్రంలోని ఈరోడ్‌కు చెందిన సుధాకరన్ (31), వన స్థలిపురంలోని జాన కిరణ్ కుమార్ (29), గోవాకు చెందిన అర్సలాన్ అహ్మద్ (23)లు సూత్రధారులుగా తేలింది. ఈ ఐదుగురు మరికొందరితో క లిసి కొత్తగా విడుదలైన సినిమాలను మొదటి రోజునే థియేటర్లకు వెళ్లి >>2

## నేడు ఢిల్లీకి సిఎం, మంత్రి లోకేష్

### సిఐఐ సదస్సుకు హాజరు

**విజయవాడ,సెప్టెంబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** సిఎం నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌లు దేశ రాజధాని న్యూఢిల్లీ పర్యటన ఖరారైంది. మంగళవారం ఉదయం వీరిద్దరూ న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. సిఐఐ సదస్సులో సిఎం చంద్రబాబు నాయుడు పాల్గొనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోడీతో సిఎం చంద్రబాబు సమావేశమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తోనూ ఆయన భేటీ కానున్నారు. అక్టోబరు 16వ తేదీన కర్నూలులో జిఎస్టీ 2.0 కార్యక్రమాన్ని ఎపి ప్రభుత్వం నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమానికి ప్రధాని మోడీని సిఎం చంద్రబాబు అధికారికంగా ఆహ్వానించనున్నారు. మరోవైపు లోకేష్ సైతం న్యూఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమవుతారని తెలుస్తోంది. అక్టోబరు 16వ తేదీన కర్నూలు, >>2

## తపాలా శాఖలో రిజిస్టర్ పోస్టుకు స్వస్తి

భారతీయ डाक India Post

### స్పీడ్ పోస్టు సేవల్లో మార్పులు

**విజయవాడ,సెప్టెంబరు29,ప్రభాతవార్తప్రతినిధి :** బ్రిటిష్ కాలం నుంచి అమల్లో ఉన్న రిజిస్టర్ పోస్టు విధానాన్ని తపాలా శాఖ స్పీడ్ పోస్టులో విలీనం చేసింది. వాల్యూయాడెడ్ సర్వీసుగా స్పీడ్ పోస్టు కిందే ఇది అందుబాటులో ఉంటుంది. అలాగే దేశవ్యాప్తంగా ఏకీకృత టారిఫ్‌ను రూపొందించింది. ఒటిపి ఆధారిత డెలివరీ అనే కొత్త సర్వీసును తీసుకొచ్చింది. అక్టోబరు ఒకటో తేదీ నుంచి దేశవ్యాప్తంగా ఇవి అమల్లోకి రానున్నాయి. రిజిస్టర్ పోస్టులో ఎవరి పేరుతో అయితే మనం పంపామో వారికే పోస్టుమన్ ఉత్తరాన్ని ఇచ్చి సంతకం తీసుకుంటారు. ఈ సేవ కోసం నిర్దేశిత టారిఫ్‌కు అదనంగా ఒక్కో ఆర్టికల్‌కు జీఎస్టీ కాకుండా రూ.5 చెల్లించాలి. స్పీడ్ పోస్టుకు సంబంధించి ఒటిపి ఆధారిత డెలివరీ అనే కొత్త సర్వీసు అందుబాటులోకి రానుంది. ఇందులో ఉత్తరం డెలివరీ సమయంలో చిరునామాదారు ఫోన్‌కు ఒటిపి వస్తుంది. ఆ ఒటిపిని ధ్రువీకరించుకున్నాకే పోస్టుమన్ ఉత్తరాన్ని అందజేస్తారు. ఇందుకోసం నిర్దేశిత టారిఫ్ మీద జిఎస్టీ కాకుండా అదనంగా రూ.5 వసూలు చేస్తారు.

**విద్యార్థులకు స్పీడ్ పోస్టు ధరను పది శాతం తగ్గించింది**

కొత్తగా బల్క్ సేవల్ని వినియోగించుకొనే సంస్థలకు 5శాతం ప్రత్యేకతగ్గింపును ప్రవేశపెట్టింది. తపాలా శాఖ కొద్దిరోజుల కిందటే కొత్త ఫీచర్లను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. గ్రామీణ ప్రాంతాల నుంచి మొదలు నగరాల వరకూ అన్ని పోస్టాఫీసుల్లోను కూడా ఎపిటి పేరుతో కొత్త టెక్నాలజీ అమలులోకి వచ్చింది. సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్‌పోస్టల్ టెక్నాలజీ సహకారంతో ఏపీటీని అభివృద్ధి రూపొందించారు. దీనినే 'పోస్టల్ 2.0' గా పిలుస్తున్నారు. దేశవ్యాప్తంగా ఈ విధానం జులై >>2

# రాష్ట్రానికి పెట్టుబడుల వరద



దక్షిణ కోరియాకు చెందిన కంపెనీల ప్రతినిధులు ఎపి మంత్రులు

### 156 ప్రాజెక్టుల ద్వారా 10 లక్షల కోట్లు

### 8 లక్షల కొత్త ఉద్యోగాల సృష్టి

### నాలుగు కొత్త గ్రీన్‌ఫీల్డ్ పోర్టులతో యేడాదికి అదనంగా 353 మి.మె.ట కార్గో రవాణా

**విజయవాడ,సెప్టెంబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** దక్షిణ కొరియా రాజధాని సీయోల్‌లో నిర్వహించిన ఈ సదస్సులో పాల్గొన్న మంత్రి పి. నారాయణ, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఇడిబి అధికారులు, దక్షిణ కొరియాకు చెందిన ప్రముఖ కంపెనీల ప్రతినిధులు, పెట్టుబడిదారులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ గత ఏడాది కాలంలో, ఆంధ్ర ప్రదేశ్ 156 ప్రాజెక్టుల ద్వారా 10 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను సాధించడంతో పాటు దాదాపు 8 లక్షల కొత్త ఉద్యోగాలను సృష్టించిందిఇది కేవలం ఒక నెంబర్‌మాత్రమే కాదు, ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారులు ఒక గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్‌పై ఉంచిన విశ్వాసానికి ఇది ప్రతీక. 1,053 కి.మీ తీరప్రాంతంతో, నేడు ఆంధ్రప్రదేశ్ భారతదేశానికి తూర్పు తీర ముఖద్వారంగా పనిచేస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న 4కొత్త గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం, కాకినాడ ఏడాదికి అదనంగా 353 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గో సామర్థ్యాన్ని జోడించగలవు. రాబోయే కాలంలో రాష్ట్రంలో కార్గో సామర్థ్యాన్ని సంవత్సరానికి 700 మిలియన్ మెట్రిక్ టన్నులకు పైగా విస్తరించనున్నాము. ఏవియేషన్ రంగంలో ఆంధ్రప్రదేశ్‌లో 3 అంతర్జాతీయ విమానాశ్రయాలుసహా ప్రస్తుతం 9 విమానాశ్రయాలు అభివృద్ధి దశలోఉన్నాయి. భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం 2026 నాటికి గ్లోబల్ కనెక్టివిటీకి ప్రధాన కేంద్రంగా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ 20 గిగా వాట్ల స్థాపిత సామర్థంతో అంతరాయం లేని విద్యుత్ సరఫరాకు హామీ ఇస్తుంది. అందులో 39 పునరుత్పాదక శక్తి..సంవత్సరానికి 300 రోజులు వేడి వాతావరణం కారణంగా రాష్ట్రంలో 2047 నాటికి 160 గిగా వాట్ల పునరుత్పాదక శక్తిని సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. గ్రీన్ హైడ్రోజన్ >>2



# శ్వేత సౌధం స్వర్ణమయం

## డొనాల్డ్ ట్రంప్ విడియో వైరల్

**వాషింగ్టన్, సెప్టెంబరు 29:** అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌ను 24 క్యారెట్ల బంగారు తాపడాలతో అలంకరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా శ్వేతసౌధంలోని ఓవల్ ఆఫీస్, కేబినెట్ రూమ్‌లో భారీగా స్వర్ణ అలంకరణలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు అందమైన భవనంగా పేరుపొందిన శ్వేతసౌధం ఇకపై అత్యుత్తమమైన భవనంగా ఇక్కడికి వచ్చిన విదేశీనేతలను విస్తుపోయేలా చేస్తుందని తెలిపారు. కార్యాలయంలో అలంకరిస్తున్న మేలిమి అలంకరణల నాణ్యత, సౌందర్యంచూసి ఏ విదేశీ నాయకుడైనా ఆశ్చర్యపోతారన్నారు. శ్వేతసౌధంలో ఏర్పాటు చేయనున్న స్వర్ణ అలంకరణలకు సంబంధించిన విడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. విడియోలో బంగారు పూతతో ఉన్న డజన్ల కొద్దీ డిజైన్లు కనిపిస్తున్నాయి. వైట్‌హౌస్‌లో స్వర్ణతాపడాలు చేయించడానికి ఉపయోగించిన బంగారం ఖర్చును ట్రంప్‌నే స్వయంగా భరించినట్లు వైట్‌హౌస్ ప్రతినిధి ఇటీవల పేర్కొన్నారు. అయితే ఎంత మొత్తంలో బంగారాన్ని వినియోగిస్తున్నారనే విషయాన్ని వెల్లడించలేదు. ఇప్పటికే ఓవల్ ఆఫీస్‌లో పలుచోట్ల స్వర్ణ తాపడాలు ఉన్నాయి. మిగిలిన చోట్ల కూడా బంగారంతో అలంకరించాలనే తన కోరికను ట్రంప్ పలుమార్లు బయటపెట్టారు.

# ఇంటింటికి జిఎస్టీ ఫలాలు

>> థింది గిగ్ వర్కర్లతో ద్విచక్ర ర్యాలీలు, స్వదేశీ ఉత్పత్తులపై ఎగ్జిబిషన్లు నిర్వహించనున్నారు. భవన నిర్మాణ రంగం, ఆతిథ్య రంగం, రవాణా, లాజిస్టిక్స్ పైనా జిల్లా, నియోజకవర్గాల్లో ఎగ్జిబిషన్లు, ర్యాలీలు చేపట్టేలా ప్రణాళిక చేయనున్నారు. ఆటవస్తువులు, క్రీడా పరికరాలు, పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి, ఆటో మొబైల్స్ ధరలకు సంబంధించి ప్రజల్లో అవగాహన కల్పించేలా 200పైగా కార్యక్రమాలు చేపట్టనున్నారు.జీఎస్టీ 2.0 వల్ల కలుగుతున్న లబ్దిపై ప్రజలకు వివరించేలా వినూత్న రీతిలో కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనుంది.
అక్టోబర్ 18వ తేదీతో శ్వేత స్థాయిలో ప్రచారాన్ని ముగించి 19వ తేదీన జిల్లా కేంద్రాల్లో షాపింగ్ ఫెస్టివల్, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. అదే రోజున జిల్లా కేంద్రాల్లో దీపావళి సంబరాలు జరపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. వచ్చే 19వ తేదీ వరకు రేడియో, టివి, మీడియా, సోషల్ మీడియా, పత్రికా, సినిమా థియేటర్లు వంటి ప్రసార, ప్రచార మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహించాలని సిఎం సూచించారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల వద్ద కూడా జిఎస్టీ 2.0 ఫలాలు తెలిసేలా హోర్డింగులు ఏర్పాటు చేయాలని సిఎం ఆదేశించారు. ఈ సమావేశంలో సిఎస్ విజయానంద్, అధికారులు పాల్గొన్నారు.



సిఎం దంపతులకు అమ్మవారి ప్రసాదం అందజేస్తున్న ఆలయ అర్చకస్వాములు, కార్యదర్శి

# దుర్గమ్మకు పట్టు వస్త్రాలు

>> యంలో కొలువు తీరిన దుర్గమ్మకి సిఎం చంద్రబాబు నాయుడు, నారా భువనేశ్వరి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. నవరాత్రుల్లో భాగంగా విజయవాడ కనకదుర్గమ్మ సోమవారం సరస్వతి దేవి రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. అలాగే ఈ రోజు మూల నక్షత్రం. అంటే అమ్మవారి జన్మ నక్షత్రం. ఈ నేపథ్యంలో దుర్గమ్మకు సిఎం చంద్రబాబు నాయుడు దంపతులు ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ పట్టువస్త్రాలు సమర్పించేందుకు మధ్యాహ్నం 3.30 గంటలకు సిఎం చంద్రబాబు నాయుడు దంపతులు ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గమ్మ ఆలయానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా మేళ తాళాలు.. మంగళ వాయిద్యాలతో వారికి పూర్ణకుంభంతో వేద పండితులు, ఆలయ అధికారులు, మంత్రులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిఎం దంపతులు అమ్మవారి దర్శనం చేసుకున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం ఈ దంపతులకు వేద పండితులు వేద ఆశీర్వచనం ఇచ్చారు.
ఆ క్రమంలో అమ్మవారి లడ్డూ ప్రసాదంతోపాటు దుర్గమ్మ చిత్రపటాన్ని చంద్రబాబు దంపతులకు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అందజేశారు. సిఎం దంపతులకు స్వాగతం పలికిన వారిలో.. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, ఎంపీ కేశినేని చిన్నితోపాటు పలువురు మంత్రులు ఉన్నారు. అనంతరం దేవాలయం బయట సిఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ.. రూ.25 కోట్లతో 1,500 మంది భక్తులు భోజనం చేసే విధంగా అన్న ప్రసాద భవనం నిర్మిస్తున్నామన్నారు. రూ. 27 కోట్లతో 3 నెలల్లో ప్రసాదం తయారీ కేంద్ర పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు. అలాగే రూ.5.5 కోట్లతో ప్రధాన ఆలయం వద్ద పూజా మండపానికి సంబంధించిన నిర్మాణ పనులు చేపట్టామని సీఎం నారా చంద్రబాబు నాయుడు వివరించారు. ప్రభుత్వం తరఫున దుర్గమ్మ తల్లికి పట్టు వస్త్రాలు సమర్పించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. రాష్ట్ర ప్రజలకు సుఖసంతోషాలు అందించాలని అమ్మవారిని కోరుకున్నానని తెలిపారు. దుర్గమ్మ దయతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోందని.. దీంతో రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ జలకళతోఉన్నాయని సంతోషం వ్యక్తంచేశారు. ప్రజలంతా ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని.. రాష్ట్ర సంపద పెరగాలని ఆయన ఆకాంక్షించారు. నవరాత్రుల సందర్భంగా ఇప్పటి వరకూ 8 లక్షల మంది భక్తులు.. దుర్గమ్మ వారిని దర్శించుకున్నారని వివరించారు.

# రిజిస్టర్ పోస్టుకు స్వస్తి

>> 22వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. దీనివల్ల ప్రజలకు మెరుగైన సేవలు సులభంగా, వేగంగా అందనున్నాయి. గతంలో హెడ్ పోస్టాఫీసుల్లో మాత్రమే అమల్లో ఉన్న యూపీఐ చెల్లింపులు ఇప్పుడు ప్రతిచోటా అమల్లోకి వచ్చాయి. పోస్టల్ సేవింగ్స్ బ్యాంక్ సేవలు మినహా, మిగితా అన్ని ఇతర చెల్లింపులను యూపీఐ ద్వారా చేయవచ్చు. పార్సిళ్లు, రిజిస్టర్ పోస్టులు, డెలివరీ వంటివి కూడా 'ఏపీటీ'తో సులభతరం కానుంది. గతంలో లాగా మధ్యలో ఎటువంటి మరో మజిలీ లేకుండా ఈ విధానంలో బీట్‌ల వారీగా వాటి వివరాలు నేరుగా పోస్ట్‌మెన్ మొబైల్ నంబర్లకే వెళతాయి. కస్టమర్ల నుంచి డిజిటల్ సంతకం తీసుకుని డెలివరీ చేస్తారు. డెలివరీ సమాచారం ఎప్పటికప్పుడు అప్ డేట్ అవుతుంది. డాక్ సేవా యాప్ ద్వారా స్పీడ్ పోస్టు, పార్సిల్, రిజిస్టర్ పోస్టు, బల్క్ బుకింగ్‌లను మనం ఉన్నచోటు నుంచే యాప్ ద్వారా బుక్ చేసుకుని డబ్బు చెల్లించవచ్చు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య టైం స్లాట్ ఆధారంగా పోస్ట్‌మెన్ మన ఇంటి వద్దకే వచ్చి వాటిని తీసుకెళతారు.నామమాత్రపు రుసుము మాత్రమే మన వద్ద నుంచి వసూలు చేస్తారు. లేదంటే బుకింగ్, చెల్లింపులు యాప్‌లో పూర్తిచేసి సమీపంలోని పోస్టుఫీసులో ఉత్తరాలు ఇవ్వొచ్చు. దీనివల్ల సమయం కూడా ఆదా అవుతుంది. ఈ యాప్‌లో పోస్టల్ శాఖ సేవలన్నీ పొందవచ్చు. సేవల్లో ఏమైనా లోపాలు ఉంటే, దీని ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. వీటితో పాటు, చిరునామాలను కచ్చితంగా గుర్తించేందుకు త్వరలోనే డిజి పిన్ అందుబాటులోకి వస్తుందని ఆంధ్రప్రదేశ్ సర్కిల్ పోస్టల్ సర్వీసెస్ డైరెక్టర్ సంతోష్ నేత తెలియజేశారు.

# ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి

>>లను అప్రమత్తం చేస్తున్నారు. ఈ పరిణామాల నడుమ ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు వరద నీటి ఉధృతి క్రమేపీ పెరుగుతోంది. ఎగువ నుంచి వస్తున్న వరదతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. వరద ఉధృతికి ప్రకాశం బ్యారేజీ నిండుకుండను తలపిస్తోంది. జలాశయానికి 6 లక్షలకు పైగా క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తుండగా అంతే మొత్తాన్ని దిగువకు విడుదల చేస్తున్నారు. బ్యారేజ్ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతుండగా లంక గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. దీంతో బాపట్ల జిల్లా రేపల్లె మండలం వరద ప్రభావిత ప్రాంతం పెనుముడి పల్లెపాలెంలోకి వరద నీరు చేరుతోంది. ఇప్పటికే పలు ఇళ్లల్లోకి వరద నీరు చేరగా నిర్వాసితులను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. నిర్వాసితులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తున్నారు. వరద నీటి ఉధృతితో నది పరివాహ ప్రాంతవాసులు భయాందోళన చెందుతున్నారు. బాపట్ల జిల్లా కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలో కృష్ణానది మధ్యలో లంక గ్రామాలున్నాయి. ప్రకాశం బ్యారేజి నుంచి 3.5లక్షల క్యూసెక్కుల వరద దాటితే కృష్ణానదికి చినరేవుకి మధ్యనున్న లంక గ్రామాల ప్రజలు రాకపోకలు నిలిచిపోతాయి. కృష్ణా నదిలో సహజ సిద్ధంగా ఏర్పడిన నదీపాయ గాజుల్లంక వద్ద చీలి భట్టిప్రోలు మండలం ఓలేరు వద్ద తిరిగి కృష్ణానదిలో కలుస్తుంది. ఈ నదీపాయ దాటేందుకు గ్రామాల మధ్య దశాబ్దాల క్రితం తక్కువ ఎత్తులో నిర్మించిన చప్టాలు ఉన్నాయి. వరద పెరిగితే నీరు చప్టాల పైనుంచి ప్రవహిస్తుంది. కొల్లూరు మండలం దోనేపూడి, భట్టిప్రోలు మండలం పెసర్లంక, ఓలేరు, కోళ్లపాలెం సమీపంలో ఈ చప్టాలు ఉన్నాయి.ప్రకాశం బ్యారేజ్‌కి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో కృష్ణానది పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ సూచించారు. రేపల్లె, వేమూరు నియోజకవర్గ కరకట్టకు అనుకుని ఉన్న లంక గ్రామాల ప్రజలను అధికారులు నిరంతరం అప్రమత్తం చేయాలన్నారు. కృష్ణానది కరకట్టవెంబడి పరిస్థితిని అధికారులు ఎప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని దిశానిర్దేశం చేశారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని రెవిన్యూ అధికారులకు, పోలీసులకు ఆదేశించారు. కరకట్ట ప్రాంతంలో గండి పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచనలు చేశారు. కృష్ణానది పొంగిపొర్లుతున్న నేపథ్యంలో ప్రజలు నదిని గాని, కాలువలు గాని దాటే ప్రయత్నం చేయవద్దని, ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని తెలిపారు. ఎటువంటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు రాష్ట ప్రభుత్వం సిద్ధంగా ఉందని తేల్చిచెప్పారు. కృష్ణా నది వరద ఉధృతికి బాపట్ల జిల్లా పరిధిలోని లంక గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భట్టిప్రోలు మండలాల పరిధిలో వరదనీరు చప్టాలపై నుంచి పారుతున్నాయి. ఫలితంగా స్కూలుకి వెళ్లే పిల్లలు, పనులకు వెళ్లే కూలీలు ఇళ్లలోనే ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కృష్ణా నదికి వరద పోటెత్తడంతో పల్నాడు జిల్లాలోని కృష్ణా పరివాహక ప్రాంతాలు క్రమంగా ముంపు బారిన పడుతున్నాయి. రెండు రోజులుగా ఎగువ ప్రాంతాల్లో పడుతున్న వర్షాలకు తోడు సాగర్, పులిచింతల ప్రాజెక్టు నుంచి భారీగా వరద నీరు చేరికతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో అమరావతి మండలం పెద్ద మద్దూరులోని కొండవీటి వాగు తీవ్ర రూపందాల్చి రాకపోకలు నిలిచిపోయాయి. అమరావతి నుంచి విజయవాడ వెళ్లే ప్రధాన మార్గం ఇదే కావడంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వరద దెబ్బకు పెద్దమద్దూరు వాగు నీరు స్థానికంగా చేరి రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో పరిసర ప్రాంతవాసులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.విజయవాడ నుంచి అమరావతి వచ్చే బస్సులుపెద్దమద్దూరు వరకు వచ్చి వరద వల్ల వెనక్కి తిరిగి వెళ్లిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు అక్కడి నుంచి అమరావతి వెళ్లేందుకు ప్రయాణ సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు. కృష్ణా వరద ఉధృతికి దివిసీమ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కూరగాయ పంటలు, వాణిజ్య పంటలు, రొయ్యలు, చేపల చెరువులు సాగుచేస్తున్న తమను వరదనీరు ముంచేస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలలుగా కృష్ణానదిలో వరద ప్రవహిస్తున్నా రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తక్కువ స్థాయిలో వరద విడుదల చేశారు. గత వరదలతో తీవ్రంగా నష్టపోయిన తమకు ఈసారైనా పంట చేతికి వస్తుందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఊహించని విధంగా వరద ప్రవాహం రావటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరద ప్రభావానికి ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి, అవనిగడ్డ, నాగాయలంక,కోడూరు మండలాల్లో కృష్ణానది ఎడమ కరకట్ట కృష్ణానది మధ్య ఉన్న వేలాది ఎకరాల్లో సాగు చేసిన పంటలు వరద ముంపునకు గురవుతాయని రైతులు అందోళన చెందుతున్నారు. ఆక్వా రైతులైతే తీవ్రంగా నష్టపోతామని చెబుతున్నారు. మరోవైపు లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రదేశానికి చేరుకోవాలని అధికారులు కోరుతున్నారు.

# నేడు ఢిల్లీకి సిఎం, మంత్రి లోకేష్

>> నంద్యాల జిల్లాల్లో ప్రధాని మోడీ పర్యటించనున్నారు. జిఎస్టీ సంస్కరణలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కర్నూలు నగరంలో ప్రధాని రోడ్‌షో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో సిఎం చంద్రబాబు, డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ తోపాటు ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలూ పాల్గొంటారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, ఇప్పటికే పూర్తి చేసిన పలు పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ శ్రీశైలంలోని మల్లికార్జునస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. ఓర్వకల్లు సమీపంలోని ప్రధాని సభ ఏర్పాటుకు అనువైన స్థలం కోసం జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికే పరిశీలిస్తున్నారు. కాగా, ఓర్వకల్లు సమీపంలో 415 ఎకరాల విస్తీర్ణంలో జైరాజ్ ఇస్పాత్ ఉక్కు పరిశ్రమను ప్రధాని ప్రారంభించనున్నారని తెలుస్తోంది.

# న్యాయవిచారణ జరిపేంతవరకూ చర్చల్లేవ్

## లడఖ్ సంయుక్త అలయన్స్ స్పష్టీకరణ

**లేహ్, సెప్టెంబరు 29:** లడఖ్‌కు రాష్ట్రహోదా కల్పించాలని, రాజ్యాంగంలోని ఆరో షెడ్యూలులో చేర్చాలని డిమాండ్‌చేస్తున్న లడఖ్ వాసుల డిమాండ్‌పై కేంద్ర ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన చర్చలను లడఖ్ అపెక్స్ సొసైటీ వ్యతిరేకించింది. తమ నాయకుడు సోనమ్ వాంగ్‌ఛుక్‌పై ప్రజాభద్రతా చట్టం కింద కేసులు నమోదుచేయడం, అంతేకాకుండా దేశ విద్రోహి అని, జాతి వ్యతిరేకుడని ముద్రవేయడాన్ని లడఖ్ వాసులు జీర్ణించుకోలేకపోతున్నారు. అలాగే ఈనెల 24వ తేదీ జరిగిన పోలీస్ ఫైరింగ్‌లో అనేక మంది యువకులు తీవ్ర గాయాల పాలుకావడం, మరికొందరుచనిపోవడం వంటి సంఘటనలపై వారు తీవ్ర నిరసన వ్యక్తంచేస్తున్నారు. వచ్చేనెల ఆరవ తేదీ ఢిల్లీలో లేహ్‌నుంచి వచ్చే ప్రతినిదిబృందంతో కేంద్ర హోంశాఖ చర్చలు జరపాలనినిర్ణయించింది. అయితే ఈ అపెక్స్‌సొసైటీ మాత్రం యువ నిరసనకారులపై నిర్వహించిన దమనకాండపై సమగ్రదర్యాప్తుకోసం న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్‌చేస్తోంది. సిఆర్‌పిఎఫ్ దళాల దాడులు, 50 మందికిపైగా అరెస్టులు వారిపై అనరకమైన కేసులు వెంటనే ఉపసంహరించుకోవాలని అప్పటివరకూ ఎలాంటి చర్చలుండవని ఈ సంఘం ప్రకటించింది. కార్గిల్ డెమొక్రటిక్ అలయన్స్‌తో చర్చలు ఎప్పుడైనే సరే నిర్వహించేందుకు సిద్ధమేనని కేంద్రం ప్రకటించింది. లడక్ ఎపెక్స్‌బాడీ, కెడిఎ, హైపవర్డ్ కమిటీ వంటి వాటితో జరిపిన చర్చలు సత్ఫలితాలిచ్చాయని కేంద్రం ప్రకటించింది. లడక్‌లో ఎస్టీలకు రిజర్వేషన్ల పెంపు, మహిళలకు లడఖ్ అసెంబ్లీ, హిల్‌డెవలప్‌మెంట్ మండళ్లలో స్థానాలివ్వడం, స్థానిక భాషల సంరక్షణ వంటి వాటికి హామీ ఇవ్వాలని ఈ అలయన్స్ పట్టుబడుతోంది. లడఖ్ కేంద్ర పాలితప్రాంతంలో ఇప్పటికే 1800 ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియ ప్రారంభించామని కేంద్రం ప్రకటించింది. అయితే ఉద్యమకారుడుసోనమ్ వాంగ్‌ఛుక్‌కు పాక్‌తో సంబంధాలున్నాయని, బంగ్లాదేశ్‌తో కూడా సంబంధాలున్నాయని లడఖ్ పోలీస్ చీఫ్ ఎస్‌డిసింగ్‌జమ్‌వాల్ వెల్లడించారు. వాంగ్‌ఛుక్ అరెస్టుపై ఆయన భార్య గీతాంజలి జె ఆంగ్మో మాట్లాడుతూ నాలుగేళ్లనుంచే ఈకుట్రలు ప్రారంభం అయ్యాయని కేంద్రపాలితప్రాంతం అయిన లడఖ్‌కు అసెంబ్లీ హోదా ఇవ్వాలని, రాజ్యాంగంలోని ఆరో షెడ్యూలులో చేర్చాలన్న డిమాండ్‌తోనే ఆయనపై వేధింపులు పెరిగాయని ఆరోపించారు.

# భారీ సినీ పైరసీ గుట్టురట్టు

>>హై ఎండ్ కెమెరా సెల్‌ఫోన్ల ద్వారా రికార్డింగ్ చేస్తారని, ఆ తరువాత వీటిని ఇతర ప్రాంతాలలో వుండే తమ అనుచరులకు పంపి టెలిగ్రామ్ ఛానల్స్, టొరెంట్స్ ద్వారా నిమిషాల వ్యవధిలో పైరసీ సిడిల తయారు చేస్తున్నారని ఆయన వెల్లడించారు. హైఎండ్ కెమెరా సెల్‌ఫోన్లను తమ ప్యాంట్ జేబులో లేదా పాప్ కార్న్ ప్యాకెట్లలో వుంచి థియేటర్లలోకి తీసుకువెళతారని ఆనంద్ తెలిపారు. ఇందుకోసం అధునాతన యాప్‌ను నిందితులు వాడుతున్నారని ఆయన చెప్పారు. కాపీ రైట్ రక్షణ పొందిన సినిమాలను టొరెంట్లు, వెబ్ సైట్ల ద్వారా వీరు కాపీ చేయడంతో పాటు పంపిణీ చేస్తున్నారని ఆనంద్ తెలిపారు. ఇందుకోసం టొరెంట్ వెబ్‌సైట్లు, టెలిగ్రాం ఛా నెల్స్, అక్రమ స్ట్రీమింగ్ వేదికలను వాడుతున్నారని ఆయన తెలిపారు. దీని తరువాత ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ వెబ్‌సైట్ నిర్వాహకులు తమ వేదికలను వీటి ప్రచారానికి వాడుకునేం దుకు అవకాశం ఇస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కేసులో నిందితులు వ్యక్తిగత గుర్తింపును దాచడానికి వర్చువల్ మెషిన్లను ఉపయోగించి వైబ్‌సైట్‌లను నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కేసులో ఒక నిందితుడైన సిరిల్ రాజ్ ఒక సర్వర్ హోస్టింగ్ కంపెనీ నుంచి పారిస్ లోకేషన్ గల రెండు ప్రత్యేక వర్చువల్ యంత్రాలను కొనుగోలు చేసి పైరసి వాడాడని ఆనంద్ తెలి పారు. దీనిని అన్ని పైరసీ సిని మాలను నిలువ చేయడానికి వాడుతున్నాడని, ఇందుకోసం తమిల్ బ్లాస్టర్ వెబ్‌సైట్‌తో పాటు టెలిగ్రామ్ అప్లికేషన్, జి మెయిల్ ఖాతాలు, ప్రోటాన్ మెయిల్ ఖాతాలు, విఎం వేర్ అను యాప్‌ను వాడారని ఆయన తెలిపారు. దీంతో పాటు డిజిటల్ మీడియా కంపెనీల ప్రధాన సర్వర్లను హ్యాక్ చే యడం ద్వారా స్టూడియో కాపీల నుంచి హెచ్‌డి సినిమాలను అక్రమంగా చలామణి చేస్తున్నారని ఆయన వెల్లడించారు. వీటిని కూడా బెట్టింగ్ యా ప్, ఆన్‌లైన్ గేమింగ్ నిర్వాహకులతో కలిసి అమ్ముకున్నారని ఆయన చెప్పారు. తమ నేరకలాపాలు బయటకు తెలియకుం డా వుండేందుకు నేరగాళ్లు వేరు వేరు యూజర్ ఐడిలతో వేరు వేరు టెలిగ్రామ్ ఛానెళ్లకు ఉపయోగించారని, ఇక పైరసీ సిడిలకు సంబంధించిన చెల్లింపులన్నీ క్రిప్టో కరెన్సీ ద్వారా జరిగాయని ఆనంద్ తెలిపారు. ఇందుకోసం క్రిప్టో ప్లాట్ పాంలను వాడారని ఆయన వెల్లడించారు. ఈ కేసులో అశ్విని కుమార్ కీలక నిందితు డు కాగా ఇతను సినిమాలు థియేటర్లలో విడుదల కాకముందే హెచ్‌డి క్వాలిటీలో లీక్ చేయడంలో సిద్ధహస్తుడని తేలిందని ఆయన తెలిపారు. ఇత ను అనేక సంస్థల డిజిటల్ మిడియా కంపెనీల ప్రధాన సర్వర్లను హ్యాక్ చేసి హెచ్‌డి సినిమాలను కాపీచేసి ఇతర టెలిగ్రామ్ వినియోగదారులకు పం పేవాడని ఆనంద్ చెప్పారు. ఈ క్రమంలో పైరసీ సినిమా గ్రూపులకు సంబంధించిన హెచ్‌డి మూవీస్ ఫిల్మీజ్‌యాప్, వరల్డ్ 4 ఫ్రీ అనే చట్ట వ్యతిరే కమైన సంస్థల్లో చేరాడని ఆయన తెలిపారు. మిగతా నలుగురు నిందితులు ఇతని సహచరులేనని ఆయన తెలిపారు. తమతో పాటు పైరసీలకు పాల్పడే ఇతర ఆపరేటర్లతో కలిపి వ్యాపారం పెంచుకుంటున్నారని ఆయన తెలిపారు. సినిమాలను థియేటర్లో రికార్డు చేయడానికి ఒక్కో దానికి 150 రూపాయలను ఏజెంట్లకు ఇస్తుంటారని ఆనంద్ తెలిపారు. ఈ ముఠా 2020 నుంచి సుమారు 500 సినిమాలను పైరసీ చేసినట్లు తేలిందని ఆయన తెలిపారు. దీనివల్ల ప్రధాన నిందితుడు రెండు కోట్ల రూపాయలను సంపాదించాడని కమిషనర్ తెలిపారు. దక్షిణాది భాషలతో పాటు తెలుగులో ఈ ముఠా 300కు పైగా సినిమాలను పైరసీ చేసినట్లు నిర్ధారణ అయ్యిందని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లోనే వంద సినిమాలను ఈ ముఠా పై రసీ చేసినట్లు కమిషనర్ తెలిపారు. ఈ ముఠా నుంచి సినిమాలను పైరసీ చేసేందుకు వాడిప హై ఎండ్ సెల్‌ఫోన్లతో పాటు డిస్క్‌లు, లాప్‌టాప్‌లు, పెన్ డ్రైవ్‌లు, మెమరీ కార్డులు ఇంకొన్ని ఉపకరణాలను జప్తు చేసినట్లు ఆయన తెలిపారు. కాగా సినిమాల పైరసీ వల్ల నిర్మాతల కష్టం వృధా అవుతుందని, దీనివల్ల మొత్తం చిత్రసీమ నష్ట పోతోందని ఆనంద్ తెలిపారు. 2023లో దేశ వ్యాప్తంగా చిత్ర పరిశ్రమ 22,400 కోట్ల రూపాయలను పైరసీ వల్ల నష్ట పోయిందని, ఇది చాలా తీవ్రమైన విషయమని ఆయన అన్నారు. 2024 లో తెలుగు సినీ పరిశ్రమ 3700 కోట్ల రూపాయలను నష్ట పోయిందని, వీటన్నింటిని దృష్టిలో వుంచుకుని పైరసీపై ఫిర్యాదు అందిన వెంటనే రంగంలో దిగి భిన్న కోణాల్లో విచారించి పెద్ద ముఠాను పట్టుకున్నామని ఆయన తెలిపారు.

# శ్రీశైలం డ్యాంకు 6లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

## 10గేట్లు 23అడుగులు ఎత్తి సాగర్‌కు నీటివిడుదల

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణానదీ పోటెత్తుతున్నది. దీంతో కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. శ్రీశైలం డ్యాం నిండుకుండలా మారింది. సోమవారం సాయంత్రం 6గంటల సమాచారంమేరకు డ్యాం నీటిమట్టం 885 అడుగులకు గాను 883.20 అడుగులకు చేరింది. డ్యాం సామర్థ్యం 215.8070టీఎంసీలకు 205.6627టీఎంసీలకు చేరింది. జలాశయానికి జూరాల స్పిల్‌వే ద్వారా 560183క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 35,380క్యూసెక్కులు, హంద్రీ నుంచి 4,800క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. శ్రీశైలం జలాశయంలోని ఎడమ, కుడి విద్యుదుత్పత్తి కేంద్రాలకు 64,441 క్యూసెక్కులు విడుదల చేశారు. డ్యాం 10గేట్లు 23 అడుగులు ఎత్తి 5,22,040 క్యూసెక్కుల వరద దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం నుంచి మొత్తంగా 6,00363క్యూసెక్కుల వరద నాగార్జున సాగర్‌కు విడుదల అవుతున్నది.

## వారం - వర్జ్యం

30-09-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
అష్టమి సా.6.02
మూల ఉ.6.17
వర్జ్యం : సా.4.36-6.19
దు.ఉ.8.22-9.10, 2)రా.10.47-11.35
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** దూరప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. భూ వివాదాలు తీరుతాయి

**వృషభం:** రాజకీయ, కళా రంగాల వారికి యోగదాయకం. కాంట్రాక్టులు లాభిస్తాయి.

**మిథునం:** గతం కన్నా వృద్ధి బాగుంటుంది. అనేకాంశాలు అనుకూలంగా ఉంటాయి.

**కర్కాటకం :** ఆరోగ్యం వాహనాల విషయంలో నిర్లక్ష్యం తగదు. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**సింహం:** ఇంటాబయటా సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. వ్యాపారాలలో లాభాలు.

**కన్య :** కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుకుంటారు. భూ వివాదాలకు దూరంగా ఉండండి

**తుల :** అమ్మకాలు కొనుగోలు సంబంధించిన వ్యవహారాలు స్తబ్దతగా ఉంటాయి.

**వృశ్చికం:** జీవిత భాగస్వామితో సంయమనం పాటించి సానుకూల ఫలితాలు సాధిస్తారు.

**ధనుస్సు:** సంతాన పురోభివృద్ధి బాగుంటుంది. వృత్తి, వ్యాపారాలలో లాభాలు పొందుతారు.

**మకరం:** ఆర్థికంగా కొంత వెనుకబాటు కనబడిన కనీస అవసరాలకు లోటు ఉండదు.

**కుంభం:** మిత్రలతోటి చర్చించి కొన్ని నిర్ణయాలు తీసుకుంటారు. ఉద్యోగులకు అనుకూలం.

**మీనం :** వివాదాస్పదమైన అంశాలను వదిలివేయడం మంచిదని గ్రహించండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రాష్ట్రానికి పెట్టుబడుల వరద

>> వ్యాలీని స్థాపించడానికి, క్లీన్ ఎనర్జీ ఎగుమతుల్లో గ్లోబల్ లీడర్‌గా ఎదగడానికి కృషి చేస్తున్నాము. ఎపి టెక్నాలజీలో ముందంజలో ఉంది. భారతదేశంలో అత్యంత శక్తివంతమైన కంప్యూటర్ అయిన ఐబిఎం యొక్క 133 కుబిట్ క్వాంటం సిస్టం2ను ఇక్కడ ఏర్పాటు చేయనున్నాం..సింగిల్ విండో క్లియరెన్స్ విధానం ద్వారా త్వరితగతిన అనుమతులు ఇస్తూ.. డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా పెట్టుబడిదారులు పారదర్శకంగా, సమర్థవంతంగా ఫ్యూచర్ రెడీ బిజినెస్ ఎన్విరాన్మెంట్ అందించే ప్రయత్నం చేస్తున్నాం.. ఆర్స్ లోర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ వంటి గ్లోబల్ స్థాయి లీడర్లు ఆంధ్రప్రదేశ్ ను ఇప్పటికే తమ పెట్టుబడులకు గమ్యస్థానంగా ఎంపిక చేసుకున్నారు.

# లోకేష్‌కు తిలక్ వర్మ ప్రత్యేక బహుమతి

>> అందులో 53 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) కీలక సమయంలో అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. శివమ్ దూబె (33:22 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించడంతో పాకిస్థాన్‌పై భారత్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 147 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. అష్రాఫ్ వేసిన 1.1వ బంతికి ఓపెనర్ అభిషేక్ శర్మ (5) భారీ షాట్‌కు ప్రయత్నించి ఔట్ అయ్యాడు. ఆ తర్వాత వరుస ఓవర్లలోనే కెప్టెన్ సూర్యకుమార్ (1), శుభ్‌మన్ గిల్ (12) పెవిలియన్ చేరడంతో టీమ్ ఇండియా కష్టాల్లో చిక్కుకుంది. అనంతరం వచ్చిన సంజూ శాంసన్‌తో (24) కలిసి తిలక్ వర్మ ఇన్నింగ్స్ చక్కబెట్టాడు. ఆ తర్వాత శాంసన్ ఔట్ అయినా శివమ్ దూబేతో కలిసి విజయానికి చేరువ చేశారు. దాయాదిపై గెలిచి ఆసియా కప్ అందుకోవడంతో దేశవ్యాప్తంగా అభిమానులు సంబరాలు చేసు కున్నారు.

# జోగి రమేష్ అనుచరుడు కోటేశ్వరరావు అరెస్టు

## మైలవరం పోలీస్ స్టేషన్ ముందు బైటాయించిన మాజీ మంత్రి జోగి రమేష్

**విజయవాడ,సెప్టెంబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ జోగి రమేష్ అనుచరుడు కోటేశ్వరరావును పలు అభియోగాలపై మైలవరం పోలీసులు అరెస్టు చేసారు.అతన్ని విడుదల చేయాలని మాజీ మంత్రి జోగి రమేష్ పోలీసులను డిమాండ్ చేసారు.అయితే పోలీసులు కోటేశ్వరరావు ఆయా కేసులో చట్టపరిధిలో కేసులు నమోదు చేసినందున విడుదల చేయడం సాధ్యంకాదని చెప్పడంతో ఆగ్రహించిన జోగి రమేష్,ఆయన వెంట వచ్చిన వైకాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులకు,స్థానిక శాసనసభ్యునికి, ప్రభుత్వానికి వ్యతిరేకం వారు నినాదాలు చేసారు.వారిని పోలీసులు అక్కడి నుంచి ప్రయత్నించడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.ఉద్రిక్తత నెలకొంది,చివరికి పోలీసులు రమేష్‌కు నచ్చచెప్పి పంపించినట్లు సమాచారం!

# భారతీయ సినిమాలపై 100% సుంకాలు

>> యని ఆయనఆరోపించారు. బలహీనమైన, అసమర్థ గవర్నర్‌తో ఉన్న కాలిఫోర్నియా ముఖ్యంగా తీవ్రంగా దెబ్బతింది అంటూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్‌లో పోస్ట్ పెట్టారు. ఈ దీర్ఘకాల, ఎప్పటికీ అంతం కాని సమస్యను పరిష్కరించడానికి తాను అమెరికా వెలుపల నిర్మించే అన్ని సినిమాలపై 100శాతం సుంకం విధించనున్నట్లు పేర్కొన్నారు. విదేశీ సినిమాలతో అమెరికన్ సినిమా పరిశ్రమకు 'జాతీయ ముప్పు'గా ట్రంప్ భావిస్తూ ట్రంప్ ఇలాంటి ప్రకటన చేశారు. ఇదిలా ఉండగా.. గతంలోట్రంప్ అమెరికాలో షూటింగ్ జరుపుకోని సినిమాలపై ఏకంగా వందశాతం సుంకాలు విధించనున్నట్లు గతంలో ప్రకటించారు. పలువురు నిర్మాతలతో హాలీవుడ్ నష్టపోతుందన్న ట్రంప్ విదేశాల్లో చిత్రీకరణ జరిపి అమెరికాలో రిలీజ్ అయ్యే చిత్రాలపై వెంటనే 100 శాతం సుంకాలను విధించాలని యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ అంటే వాణిజ్యమంత్రికి ఆదేశాలు జారీ చేశారు. అమెరికా చలన చిత్ర పరిశ్రమను పునరుద్ధించడంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ సమయంలో ట్రంప్‌ప్రకటించారు. చాలాదేశాలు అమెరికన్ స్టూడియోలు, చిత్రనిర్మాతలను ఆకర్షించేందుకు ప్రోత్సాహకాలను అందిస్తున్నాయి. ఇది అమెరికా ఆర్థిక, జాతీయ భద్రతకు ముప్పు కలిగించడమేనని ట్రంప్ అన్నారు. అమెరికన్ సినిమా ఇండస్ట్రీ చాలా వేగంగా తగ్గుతోందని మళ్లీ అమెరికా గడ్డపై సినిమాల షూటింగ్ జరగాల్సిన రోజులు రావాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే, ఇటీవల కాలంలో సినిమా, టెలివిజన్ నిర్మాణం హాలీవుడ్ నుంచి యూకే, ఆస్ట్రేలియా, న్యూజి లాండ్ వంటి దేశాలకు తరలిపోతున్నాయి. ఆదేశాలు పన్ను ప్రోత్సాహకాలు ఇస్తున్నాయి. దాంతో ఆ దేశాలకు సినిమా రంగం తరలిపోతున్నది. షూటింగ్ ఖర్చు కూడా తగ్గుతున్నది. కొన్ని సినిమాలు ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో జరుగుతుంటాయి. సినిమా ప్రపంచాన్ని మరోసారి తెరపైకి తెచ్చినట్రంప్ సుంకాలతో ఖజానా నింపుకునే యత్నంలో భాగంగానే కొత్త ప్రకటన చేసినట్లు వాణిజ్యరంగ నిపుణులు చెపుతున్నారు. ప్రపంచంలో రెండో అతిపెద్ద చిత్ర మార్కెట్ చైనాకు ఉంది. ఇదిలా ఉండగా అమెరికాలో భారతీయ సినిమాలు పెద్ద సంఖ్యలో విడుదలవుతుంటాయి. తెలుగు సినిమాలు సైతం విడుదలయ్యే విషయం తెలిసిందే.
ట్రంప్ నిర్ణయంతో తెలుగు సినిమా ఇండస్ట్రీపై సైతం ప్రభావం పడే అవకాశం ఉంది. అక్కడ సినిమా విడుదల చేయాలంటే ఇకపై వందశాతం పన్ను చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవలే ట్రంప్ భారత ఫార్మా ఉత్పత్తులపై అక్టోబర్ ఒకటి నుంచి వందశాతం శాతం సుంకాలు విధిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. అమెరికాలో తయారయ్యే ఫార్మా ఉత్పత్తులకు మాత్రం సుంకాలు ఉండబోవని స్పష్టం చేశారు. అయితే, ప్రతి సంవత్సరం భారత్ నుంచి అమెరికాకు 10 బిలియన్ డాలర్ల విలువైన ఫార్మా ఉత్పత్తులు ఎగుమతి జరుగుతాయి. ఫార్మాతో భారీ ట్రక్కులు, కిచెన్ క్యాబినెట్, బాత్రూమ్ వానిటీలతో పాటు పలు వస్తువులపై 50శాతం సుంకాలు విధిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే.

# తిరుమల సమాచారం



## విజయవంతంగా ముగింపునకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు

### రేపు 'చక్రస్నాన మహోత్సవం'

**తిరుమల,సెప్టెంబరు 29ప్రభాతవార్తప్రతినిధి:** సప్తగిరుల్లో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామికి భక్తుల మధ్య అంగరంగవైభవంగా జరుగుతున్న తొమ్మిదిరోజుల సాలకట్ల బ్రహ్మోత్సవ వైభవం గురువారం ఉదయంతో ముగింపుకు చేరుకో నుంది. బ్రహ్మోత్సవాల్లో చివరివాహనంగా అశ్వ వాహనంకాగా, చివరిఘట్టంగా చక్రస్నాన మహోత్సవం నిర్వహించడం పరిపాటి. చక్రత్తా ళ్వార్‌కు జరిగే ఈ పవిత్ర కార్యక్రమం ఆల యానికి పక్కనేవున్న శ్రీవరాహస్వామి ఆల యంకు ఆనుకుని ఉన్న స్వామిపుష్కరిణిలో జరు గుతుంది. గురువారం ఉదయం 6గంటల నుండి 9గంటలు మధ్య ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. యజ్ఞాంతంలో ఆచరించబడే అవభృథ స్నానమే చక్రస్నానమహోత్సవం. తొమ్మిది రోజులు ఒక యజ్ఞంగా బ్రహ్మోత్సవాలు జరుగు తాయి. పుష్కరిణిలో చక్రత్తాళ్వార్‌కు చక్రస్నానం ముందు శ్రీమలయప్పస్వామివారికి ఉభయదేవేరులకు తిరుమంజనం నిర్వహిస్తారు. పాలు, పెరుగు, నెయ్యి,తేనె కొబ్బరిబొండం ఇత్యాది పవిత్రసుగంధ ద్రవ్యాలతో ఈ అభిషేకం చేస్తారు. ధూపదీపాల తో స్వామివారి ప్రసన్నవదనుడౌతాడు. చక్రస్నా నసమయంలో భక్తులు,అర్చకులు, అధికా రులు అందరూ పవిత్ర పుణ్యస్నానం చేస్తారు. ఇప్పటికే టిటిడి అధికారులు,పోలీసు యంత్రాంగం పుష్కరిణి వద్ద గట్టి ఏర్పాట్లు చేసింది.

## 'బంగారురథం'పై మలయప్ప ఉత్సవర్లు

**తిరుమల,సెప్టెంబరు 29ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల లో ఆరవరోజు సోమవారం సాయంత్రం శ్రీదేవిభూదేవిసమేతుడై మలయప్ప బంగారు రథంపై భక్తులకు దర్శనమిచ్చాడు. సంధ్యా సమయంలో చల్లటిగాలులు వీస్తుండగా స్వర్ణర థోత్సం ఒక విశిష్టమైన వాహనం. స్వర్ణమ యమైన రథం ఆలయం వద్ద నుండిబయలు దేరుతుంది. సాయంత్రం 4గంటలకు శ్రీదేవిభూదేవిమలయప్ప స్వామివారిని అర్చకులు విశేషాభరణాలతో అలంకరించారు. విశేషించి దాసభక్తుల నృత్యాలు ఆకర్షణీయంగా కనువిం దుచేశాయి. ఈ స్వర్ణ రథోత్సవంలో కల్యాణకట్ట మిరాశీదారులు సమర్పించిన ఒక సువర్ణఛత్రాన్ని తొలుత రథంపై అలంకరించారు. భగవంతుడు శైల్య,సుగ్రీవ, మేఘ,పుష్ప, పలహాకా అనే నాలుగు గుర్రాలు పూన్చిన రథమెక్కి విహ రించాడు. దారుకుడు ఆయన సారధి. ఈ రథంమీద పయనిస్తూన్న శ్రీవారిని దర్శించిన భక్తులు గోవిందనామంతో పునీతులయ్యారు.



స్వర్ణరథాన్ని మహిళా భక్తులు లాగారు. మోక్షం సిద్దిస్తుందని భక్తుల విశ్వాసం. స్వర్ణరథోత్సవంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీ యర్‌స్వామి, టిటిడి ఈఓ అనిల్‌కుమార్ సిం ఘాల్ దంపతులు, జెఈఓ వీరబ్రహ్మం దంప తులు, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం,సిపి ఆర్ఓ డాక్టర్ తలారి రవి, మహిళా ఉద్యోగులు, శ్రీవారిసేవకులు, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

## కోదండరామునిగా కోనేటిరాయుడు

### హనుమంత వాహనంపై మలయప్ప



**తిరుమల,సెప్టెంబరు 29 ప్రభాతవార్తప్రతినిధి:** ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడిగా,త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడు, కలియుగంలో శ్రీవేంకటేశ్వర స్వామిగా భక్తులను రక్షిస్తున్న స్వామివారు సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో సోమవారం ఉదయం హనుమంతవాహనంపై అభయమిచ్చాడు. శేషాచలదీశుడు రాముడు అలంకారంలో కను విందుచేయడం విశేషం. శ్రీరాముడికి హనుమం తుడు అత్యంత విశ్వాసపాత్రుడు. ప్రియదాస భక్తుడైన ఆంజనేయుడిపై వేంకటాద్రిరాముడుగా మలయప్ప ఊరేగి భక్తులకు దర్శనమిచ్చాడు. ఉదయం నిత్యకైంకర్యాలు పూర్తిచేసుకున్న తరువాత ఆలయంనుండి మలయప్పస్వామిని వాహనమండపం వద్దకు వేంచేపుచేశారు. ఇక్కడ వేదమంత్రోచ్చరణల నడుమ స్వామివారిని హనుమంతవాహనంపై అధిరోహింపజేశారు. కర్పూరహారతులిచ్చి ఉదయం 8గంటలకు వాహనం ఆలయమాఢవీధుల్లో ప్రదక్షణగా బయలుదేరింది. స్వామివారి వాహనంముందు భక్తులు ఆదవమొక్కుల వాడా గోవిందా శ్రీనివాసా గోవిందా అంటూ నామస్మరణలతో తన్మయత్వం పొందారు. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, సుప్రీంకోర్టు మాజీ సిజెఐ జస్టీస్ ఎన్‌వి రమణ దంపతులు, టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, నరేశ్, శాంతారాం, పనబాకలక్ష్మి,టిటిడి ఈఓ అనిల్‌కు మార్‌సింఘాల్ దంపతులు, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం ,సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, అర్చకులు,వేదపండితులు పాల్గొన్నారు.

## గజవాహనంపై గరుడాచలపతి

**తిరుమల,సెప్టెంబరు 29 ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠంలో శ్రీనివాసప్రభువుకు జరు గుతున్న సాలకట్ల బ్రహ్మోత్సవాలలో ఆరవ రోజు సోమవారం రాత్రి గజవాహనంపై గరు డాచలపతి భక్తులకు దర్శనమిచ్చాడు. సాయంత్రం ఆలయంనుండి మలయప్పస్వా మిని వాహనమండపం వద్దకు వేంచేపుచేశారు. ఇక్కడ వేదమంత్రోచ్చరణల నడుమ స్వామి వారిని గజవాహనంపై అధిరోహింపజేశారు. కర్పూరహారతులిచ్చి రాత్రి వాహనం ఆలయ మాఢవీధుల్లో ప్రదక్షణగా బయలుదేరింది. గజ వాహనంపై శ్రీనివాసప్రభువు కనువిందు చేశాడు. రాజుల పట్టాభిషేకసమయంలో గజాధి ష్టితులను చేసి ఊరేగిస్తారు. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్ దంపతులు, జెఈఓ వీరబ్రహ్మం దంపతులు, ఆలయ



డిప్యూటీ ఈఓ లోకనాథం ,సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.



## కొల్హాపూర్ మహాలక్ష్మికి టిటిడి పట్టువస్త్రాలు

**తిరుమల,సెప్టెంబరు 29ప్రభాతవార్తప్రతినిధి:** దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొల్హాపూర్ శ్రీమహాలక్ష్మిఅమ్మకి సోమవారం మధ్యాహ్నం టిటిడి తరపున ఛైర్మన్ బిఆర్‌నాయుడు దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. బోర్డుసభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి,సౌరబ్ హెచ్ బోర ,శాంతారామ్‌తో కలసి ఆయన అమ్మవారి ఆలయం చేరుకున్నారు. ఆలయ అర్చకులు స్వాగతం పలికి పట్టువస్త్రాలు స్వీకరించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# చక్కటి సౌకర్యాల పర్యవేక్షణతో గరుడసేవ ప్రశాంతం

### అశేషసంఖ్యలో భక్తులకు సంతోష దర్శనం




**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** దసరా సెలవులు, పెరటాసిమాసం రెండవశనివారం తరువాత ఆదివారం రాత్రి ఏడుకొండల్లో జరిగిన గరుడవాహనసేవ విజయవంతంగా తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించింది. నెలరోజుల పక్కా ప్రణాళికలు, కార్యాచరణతో టిటిడి ఉద్యోగులు, తిరుపతి జిల్లా పోలీసుయం త్రాంగం, టిటిడి నిఘాభద్రత విభాగం సమన్వయంతో పనిచేయడంతో 3లక్షలమంది భక్తులకు గరుడవాహన వీక్షణం ప్రశాంతంగా చేయించారు. సాధారణంగా ఏడుకొండలపై 70వేలమంది భక్తులు పెరిగితేనే అటు స్వామివారి దర్శనం ఇటు వసతి సదుపాయం గగనంగా మారుతుంది. టిటిడి అధికారులు తలలుపట్టుకునే పరిస్థితి ఎదురవుతుంది. అలాంటిది ఒక్కసారిగా 3.50లక్షలమంది భక్తులు కిటకిటలాడినా చిన్నపాటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా నిర్వహించడం టిటిడి పనితీరు అభినందనీయం. ఆలయ మాఢవీధు ల్లోని గ్యాలరీల్లో ఎనిమిదినుండి పన్నెండుగంటల పాటు నిరీక్షించినా,ప్రతి భక్తునికి శ్రీవారిసేవ కులు, పోలీసులు, టిటిడి నిఘాభద్రత సిబ్బంది, ఉద్యోగులు చక్కటి సేవలందించి 14రకాల అన్నప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ,కాఫీ అందించి భక్తుల మన్ననలు అందుకున్నారు. సాధారణరోజుల్లో రోజుకు 90వేల మంది నుంచి లక్షమంది వరకు భక్తులు వస్తున్న తిరుమలకొండపై 4లక్షలమందికి సేవలుచేయడం టిటిడికి పెద్ద సమస్యకాదు, అయితే ఆదివారం, దసరా సెలవులు ,ఆపై గరుడసేవకు విచ్చేసిన అశేషభక్తులకు నిరంతరాయంగా సకల సదుపాయాలు కల్పించడం వెనుక టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, బోర్డు సభ్యులు, టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్, తిరుపతి కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, తిరుపతిజిల్లా ఎస్పీ సుబ్బరా యుడు, సివిఎస్ఓ మురళీకృష్ణ, తమతమ సిబ్బందితో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ స్వయంగా గ్యాలరీలు, మాఢవీధులు పర్యవేక్షించారు. గరుడవాహనసేవను విజయవంతం చేసి భక్తులకు సకల సేవలందించిన టిటిడి అధికా రులు,సిబ్బంది, పోలీసు,స్కౌట్స్ గైడ్స్, శ్రీవారిసేవకుల సమిష్టి పనితీరును టిటిడి ఈఓ సింఘాల్, తిరుపతి జిల్లా ఎస్‌పి సుబ్బరాయుడు పత్యేకంగా అభినందించారు.ఆదివారం మధ్యాహ్ననికే 3లక్షలమంది భారీసంఖ్యలో భక్తులు తిరుమలకొండపైకి తరలిరావడం, మాఢవీధు ల్లోని గ్యాలరీల్లో దాదాపు 2.50లక్షలమంది భక్తులు వుండటం, వెలుపల మరో 50వేలు, కొండపై మరో20వేల వరకు పలుచోట్ల వేచివున్న భక్తులకు సకల సౌకర్యాలు, సేవలందిం చారు. కాగా సిఎం చంద్రబాబు టిటిడి అధికారుల పనితీరు,సేవలపై అభినందనలు తెలిపారు.

## దుర్గమ్మను దర్శించుకొన్న కర్ణాటక డి.సిఎం శివకుమార్

### స్వాగతం పలికిన హోమ్ మంత్రి అనిత, ఎంపి కేశినేని శివనాథ్

**విజయవాడ,సెప్టెంబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** బెజవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన కనకదుర్గ మ్మను కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకు మార్ సోమవారం ఉదయం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన ద్వారం వద్దకు విచ్చేసిన డీకే శివకుమార్ కుటుంబానికి ఆలయ అధికారులు, వేదపండితులు, రాజకీయ ప్రము ఖులు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హోమ్ మంత్రి వంగల పూడి అనితతో కలిసి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ఆయనను ఆహ్వానించి, ఆలయ ప్రవేశ ద్వారం వరకు తీసుకు వెళ్లారు. ప్రత్యేక క్యూలైన్ ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన శివకుమార్ దంపతులు, కుటుంబ సభ్యులు అమ్మవారిని శ్రద్ధాభక్తులతో దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆలయ వేదపండితులు మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీర్వచనాలు అందించారు. అమ్మవారి శేషవస్త్రాలు, చిత్రపటం, ప్రసాదాలను ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్, హోమ్ మంత్రి అనితలు డీకే శివకుమార్‌కు దసరా శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా డీకే శివకుమార్ మాట్లాడుతూ "విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం ఎంతో పవిత్రమైనది. అమ్మవారిని దర్శించుకోవడం మా కుటుంబానికి ఒక విశేషమైన అనుభూతి. అమ్మవారి ఆశీస్సులతో రెండు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని, సమాజం శాంతి, అభివృద్ధితో ముందుకు సాగాలని కోరుకుంటున్నాను" అని తెలిపారు. అలాగే ఈ పుణ్యక్షేత్రంలో దసరా ఉత్సవాలు ఎంతో అద్భుతంగా జరుగుతున్నాయని, దసరా ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు, విఐపిలకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా ఏపీ ప్రభుత్వం పకడ్బందీగా ఏర్పాట్లు చేసిందని డీకే శివకుమార్ కొనియాడారు.



బెజవాడ కనకదుర్గమ్మ దర్శించుకునేందుకు వచ్చిన కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు స్వాగతం పలికిన హోమ్ మంత్రి అనిత,ఎంపీ కేశినేని శివనాథ్

## పోలీసుల సిబ్బందికి గ్రూప్ ఇన్సూరెన్స్



పోలీసుల బీమా నిమిత్తం రూ. 7,68,50,000 ప్రీమియం చెక్కును న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ అధికారులకు అందిస్తున్న డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

**విజయవాడ,సెప్టెంబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పోలీసు సిబ్బందికి గ్రూప్ పర్సనల్ యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ పాలసీ పునరుద్ధరణలో భాగంగా రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్, బెంగళూరుతో సోమవారం డిజీపీ కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం పోలీస్ కానిస్టేబుల్ నుండి డీజీపీ స్థాయి వరకు ప్రమాదవశాత్తూ మరణించిన వారికి వారి ర్యాంక్ ఆధారంగా రూ. 20 లక్షల నుండి రూ.45 లక్షల వరకు, హోంగార్డులకు రూ. 10 లక్షల రూపాయల వరకు ప్రమాద భీమా కల్పించడం జరుగుతుంది. అందుకు గాను రూ. 7,68,50,000 ప్రీమియం చెక్కును డీజీపీ హరీష్ కుమార్ గుప్తా న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్, బెంగుళూరు వారికి అందజేశారు. ఈ నగదురహిత పాలసీ నేటి నుండి అందుబాటులోకి రానుంది. సంవత్సర కాలం పాటు ఉంటుంది. పోలీసు శాఖ కొరకు నిర్విరామంగా సేవలు అందిస్తూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన సిబ్బంది కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకుంటామని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్ రవిప్రకాష్ సెక్రెటరీ భద్రత హరికుమార్, రాజన్, న్యూ ఇండియా అస్యూరెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## హిందూ మనోభావాలకు విఘాతం కలిగించే విధంగా మాట్లాడుతున్న షర్మిల

### ఎపి బిజెపి అధ్యక్షుడు పివిఎన్ మాధవ్

**విజయవాడ,సెప్టెంబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ కాంగ్రెస్ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల రెడ్డి హిందూ మనోభావాలకు విఘాతం కలిగించే విధంగా మాట్లాడారని ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆరోపించారు. టీటీడీ నిధులతో సుమారు 5 వేల దేవాలయాలు నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటన చేశారని గుర్తు చేశారు. దేవాలయాల నిర్మాణాలు ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండా అని షర్మిల వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. దేవాలయాలపై పరిజ్ఞానం లేకుండా, అవివేకంగా షర్మిల మాట్లాడారని విమర్శించారు. ఆమెకు దేవాలయాల వ్యవస్థపై ఎటువంటి అవగాహన, ఆలోచన లేదని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారంమీడియాతో మాట్లాడారు.వైఎస్ షర్మిల జీవితంలో ఎప్పుడైనా దేవాలయాలను సందర్శించారా అని మాధవ్ ప్రశ్నించారు. మత ప్రచారాలు స్వయంగా భర్తతో కలిసి చేశారని ఆరోపించారు. మత మార్పిడి చేయాలని పెద్ద ప్రయత్నం చేశారని కీలక వ్యాఖ్యలు చేశారు. టీటీడీపై షర్మిల



చేసిన వ్యాఖ్యలపై సోనియాగాంధీ, రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. దివంగత మాజీ సీఎం రాజశేఖర్ రెడ్డి గతంలో ఏడుకొండలు మూడు కొండలుగా మార్చాలని జీవో ఇచ్చారని గుర్తు చేశారు. తిరుమల తిరుపతి నిధు లు ఎలాంటి దుర్వినియోగం అవ్వడం లేదని స్పష్టం చేశారు. నిధులను ఆలయాల నిర్మాణాలు, ధార్మికసంస్థల నిర్మాణం, ధూప దీప నైవేద్యం కోసం ఉపయోగించుకుంటున్నారని మాధవ్ వెల్లడించారు.

## గోవాలో పిఆర్‌సిఐ గ్లోబల్ కాన్‌క్లేవ్

### పాల్గొన్న గోవా గవర్నర్, సిఎం ప్రమోద్ సావంత్

**హైదరాబాద్,సెప్టెంబర్ 29 ,ప్రభాత వార్త :** గోవా, పంజిమ్‌లో పబ్లిక్ రిలేషన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా 19వ గ్లోబల్ కాన్‌క్లేవ్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు,గోవా సీఎం డాక్టర్ ప్రమోద్ సావంత్ విచ్చేశారు.జాతీయ స్థాయిలో ఉత్తమ పరిపాలన, అవార్డును హైదరాబాద్‌పిఆర్‌సిఐ(పబ్లిక్ రిలేషన్స్ ఆఫ్ ఇండియా) చాప్టర్ దక్కించుకుంది. జాతీయ స్థాయిలో మోస్టు వ్యాల్యుబుల్ లీడర్ అవార్డును ప్రకాశ్‌జైన్ అందుకున్నారు.

## రెండునెలల్లో అందుబాటులోకి టెర్మినల్ భవనం

### దేశంలోని ప్రధాన విమానాశ్రయాల్లో ఉడాన్ యాత్రికేఫేలు : కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

**గన్నవరం, సెప్టెంబరు 29, ప్రభాతవార్త :** విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం లో నిర్మిస్తున్న టెర్మినల్ భవన నిర్మాణం మరో రెండు నెలల్లో పూర్తిచేసుకుని ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుందని కేంద్రపౌరవిమానయాన మంత్రి కె.రామ్మో హన్‌నాయుడు తెలిపారు. విమానప్రయాణి కులకు తక్కువ ధరకు నాణ్యమైన ఆహారం అందించే ఉడాన్ యాత్రికేఫేను సోమవారం ఉదయం విజయవాడ(గన్నవరం) విమానాశ్రయంలో మంత్రి ప్రారంభించి మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా నిర్మాణం జరుగుతున్న టెర్మినల్ భవనం నిర్మాణ పనులను వేగవతం చేసామని మరో రెండునెలల్లో పనులన్ని పూర్తవుతాయన్న నమ్మకాన్ని వ్యక్తంచేసారు. పది సంవత్సరాల క్రితం దేశంలో 74 విమానాశ్రయాలు ఉండగా దేశంలోని నగరాలకు ఎయిర్ కనెక్టివిటి పెంచాలని కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయంవల్ల ప్రస్తుతం విమానాశ్రయాలు సంఖ్య 160కి చేరిందన్నారు. విమాన యానాన్ని సామాన్య ప్రజల ప్రయాణ సాధనంగా మార్చేందుకు కేంద్రం పలు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వివరించారు. ఉడాన్ యాత్రికేఫేలను దేశంలోని ప్రధాన విమానాశ్రయాలన్నిటిలోనూ ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు చెప్పారు. యంపి కేశినేని చిన్ని మాట్లాడుతూ విజయవాడ విమానాశ్రయం నుండి త్వరలో వారణాసి, అహ్మదాబాద్, కొచ్చిన్, పూణే తదితర నగరాలకు విమానసర్వీసులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఏఐ సభ్యులు డాక్టర్ హెచ్.శ్రీనివాస్, డాక్టర్ శరద్‌కుమార్ పాల్గొన్నారు.



యాత్రికేఫ్‌ను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, యంపి కేశినేని చిన్ని

## టీమ్ ఇండియాకు సిఎం చంద్రబాబు అభినందనలు

**విజయవాడ,సెప్టెంబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** టీమ్ ఇండియా ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్ లో పాకిస్తాన్ పై సాధించిన విజయం అద్భుతమైద ఎపీ ముఖ్యమంత్రి చంద్రబాబు'ఎక్స్‌వేదిక' ట్వీట్ చేసారు. టీమ్ ఇండియాకు చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు.టీం వర్క్‌తో, అంకితభావంతో స్ఫూర్తినిచ్చేలా ఆడిన టీమిండియా ఆసియా కప్ చేజిక్కించుకుందన్నారు.దేశం గర్వించదగ్గ క్షణాలని అన్నారు. ఇండియన్ క్రికెట్ చరిత్రలో ఈ గెలుపు ఓ అద్భుతమైన ఘట్టంగా సీఎం చంద్రబాబు అభివర్ణించారు.

## షాట్ పుట్‌లో స్వర్ణం సాధించిన రూబేష్ బాబు

**విజయవాడ,సెప్టెంబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల అరుంధతి కాలనీకి చెందిన పత్తిపాటి రూబేష్ బాబు ఈ నెల 27 నుండి 28 వరకు గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో విభాగంలో ఆంధ్ర ప్రదేశ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అట్లాంటిక్ ఛాంపియన్ షిప్ 2025 420 అండర్ జరిగిన షాట్ పుట్ 20 గేమ్స్ రాష్ట్ర స్థాయి విభాగంలో మొదటి స్థానం సంపాదించడమే కాక గోల్డ్ మెడల్ కూడా వశం చేసుకున్నారు.గతంలో కూడా 419 అండర్ 19 మరియు గోల్డ్ మెడల్ మరియు అండర్ 20 గోల్డ్ మెడల్ విజయం 2021 సంవత్సరం నుండి 2025 వరకు రాష్ట్రస్థాయిలో అన్ని గోల్డ్ మెడల్స్ ను సాధించడం జరిగినది. పత్తిపాటి రూబేష్ బాబు తల్లి వ్యవసాయ కూలి కాగా తండ్రి పత్తిపాటి దాసు ఆర్డబ్ల్యూఎస్ పంపింగ్ స్కీం నందు దినసరి కూలిగా పనిచేయుచున్నారు. షాట్ పుట్ నందు గోల్డ్ మెడల్ సాధించిన ప్రత్తిపాటి రూబేష్ బాబును అరుంధతి కాలనీవాసులు పలువురు అభినందించారు. ఇలాంటిక్రీడాకారులకు ప్రభుత్వం చేయూతను ఇస్తే ఇంకా క్రీడలలో రాణిస్తారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.





## వడ్డీ వ్యాపారుల నుండి రైతులకు విముక్తి

### మనీ లెండింగ్ యాక్ట్ తెచ్చిన తెలంగాణ సర్కార్

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** తెలంగాణలో వడ్డీ వ్యాపారుల వేధింపుల నుంచి రైతులను రక్షించేందుకు రాష్ట్ర సర్కార్ మనీ లెండింగ్యాక్ట్ తీసుకొచ్చింది. రాష్ట్రంలో ఈ యాక్ట 1349ను కఠినంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేసింది. పంట పెట్టుబడుల కోసం తప్పని సరి పరిస్థితుల్లో అన్నదాతతలు వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు రుణాలు తీసుకుంటారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. వడ్డీ వ్యాపారులు వేస్తున్న అధిక వడ్డీభారంతో రైతుల అప్పులు పెరిగిపోతున్నాయని, దీంతో అసలు, వడ్డీ కలిపి చెల్లించలేక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని గతంలో రాష్ట్ర రైతు కమిషన్ ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. దీంతో వాటిని తీర్చలేని అప్పుల ఊబిలో కూరుకుపోతున్న రైతులు గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు తెలిపింది. రైతు కమిషన్ నివేదికలోని పలు అంశాలను పరిగణనలోనికి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం మనీలెండింగ్ యాక్ట్ అమలు కఠినంగా చేయాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలిచ్చింది.

## అశ్వారావుపేట్‌లో కొత్తగా పామాయిల్ ఫ్యాక్టరీకి కృషి

### ఆయిల్ ఫెడ్ ఛైర్మన్ రాఘవరెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఆయిల్ పామ్ తోటల విస్తీర్ణం పెరుగుతున్న నేపథ్యంలో, అందుకు అనుగుణంగా గెలల దిగుబడిని దృష్టిలో ఉంచుకొని అశ్వారావుపేట లో కొత్తగా ఫ్యాక్టరీ నిర్మాణానికి కృషి చేస్తానని తెలంగాణ కోపరేటివ్ ఆయిల్ సీడ్ గ్రోయర్స్ ఫెడరేషన్ (టిజి ఆయిల్ ఫెడ్) ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి తెలిపారు. పామాయిల్ సాగు విస్తరణలో భాగంగా వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తున్న నేపథ్యంలో ఆయన ఖమ్మం జిల్లా దమ్మపేట మండలం అప్పారావుపేట, అశ్వారావుపేట మండలం నారం వారి గూడెం ఆయిల్ పామ్ నర్సరీని, ఫ్యాక్టరీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా అప్పారావుపేట ఫ్యాక్టరీని పరిశీలించి ఉద్యోగులు, సిబ్బందితో రివ్యూ చేశారు. అనంతరం అశ్వారావుపేట ఫ్యాక్టరీలో గెలల క్రషింగ్ పవర్ ప్లాంట్ ను తనిఖీ చేసి వాటి పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఖమ్మం జిల్లా కల్లూరుగూడెంలో కొత్తగా పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం జరుగుతోందన్నారు. ఇది జూన్ నాటికి సిద్ధం చేస్తామని చెప్పారు. అలాగే సిద్దిపేట ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి కాగా ట్రైన్ రన్ నిర్వహించి గెలల క్రషింగ్ ను చేపడుతున్నట్లు తెలిపారు. త్వరలో ఈ ఫ్యాక్టరీ సీఎం ప్రారంభిస్తామని వెల్లడించారు.

## తెలంగాణలో 47 మంది వ్యవసాయ విస్తరణాధికారులకు పదోన్నతులు

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పనిచేస్తున్న వ్యవసాయ విస్తరణాధికారులకు ఎట్టకేలకు పదోన్నతులు లభించాయి. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 47 మంది వ్యవసాయ విస్తరాణాధికారులకు తెలంగాణ ప్రభుత్వం ప్రమోషన్లను కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. మల్టీ జోన్1 పరిధిలో పనిచేస్తున్న 29 మంది వ్యవసాయ విస్తరణాధికారులు, మల్టీ జోన్2 పరిధిలో పనిచేస్తున్న 18 మంది వ్యవసాయ విస్తరణాధికారులకు పదోన్నతి కల్పించారు. ఏడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యపై ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయించింది.

## నేడు మరో రూ.4 వేల కోట్ల రుణం

### ఎఫ్ఆర్‌బిఎం పరిమితిని పెంచాలని కోరిన తెలంగాణ సర్కార్

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** తెలంగాణ సర్కార్ వచ్చే వారం మరో రూ.4 వేల కోట్లు రుణం సేకరించనుంది. ఈమేరకు దీనికి సంబంధించి ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను ఆర్థిక శాఖ రిజర్వ్ బ్యాంక్ ఇండెంట్ పెట్టింది.

**WARORA-KURNOOL TRANSMISSION LIMITED**
Warangal New S/s, Zaffergadh Mandal, Jangaon, Telangana- 506 252.
(Tel: +911204247182), CIN: U40300GJ2015PLC156122

**NOTICE FOR EXTENSION**

Warora-Kurnool Transmission Limited invites bids against enquiry no. **MDF/OPGW/25-26/0925** for the following package: **"Appointment of an agent to monetize dark fiber in the Optical Ground Wire infrastructure under a unified initiative"**
The due date for submission has been extended from 30.09.2025, 11.00 Hrs. to 15.10.2025, 11.00 Hrs. Bidders are advised to visit the Tenders section of www.zrc-in.com regularly for updates, addenda, or corrigenda. No separate notification shall be issued in this regard. The bid documents will be made available to interested bidders via e-mail- tenders@zrc-in.com.

అభ్యుదయాన్ని సాధించాలి అంటే చరిత్రను పునరావృతం చేయడం కాదు. కొత్త చరిత్రను సృష్టించాలి.

- మహాత్మా గాంధీ


# చేతికందినా నోటికందలేదు!

జి.ఎస్.టి 2.0తో అద్భుతాలు సృష్టించాల నుకున్న కేంద్ర ప్రభుత్వ వ్యూహానికి ఆదిలోనే హంసపాదు పడింది. కేవలం 5 శాతం, 18 శాతంగా రెండేరెండు శ్లాబ్‌లలో జనరల్ సేల్స్‌టాక్స్ పద్ధతి నిజంగానే అటు వ్యాపారస్తులకు కానీ వినియో గదారులకు వీలైన సహేతుక విధానం. గతంలో ఎన్నోరకాల పన్నులతో సుంకాలతో విసిగి వేసారిన వినిమయదారులు ఈసారి జిఎస్‌టి నూతన విధానంతో కాస్త తేలికపడ్డారనే చెప్పాలి. దీపావళి నుంచి జిఎస్‌టి శ్లాబులతో వస్తున్నట్లు ప్రకటించి ఆఘమేఘాల మీద అమల్లోకి తెచ్చేసరికి, దానిని పర్యవేక్షించే యంత్రాంగం సిద్ధంగా లేకపోవడంతో జిఎస్‌టి సౌకర్యాలు ప్రజలకు పూర్తిస్థాయి లో అందుబాటులోకి రాలేదు. ప్రభుత్వ ప్రయత్నాల లోపం వలన కేంద్రం ఆశించిన మేరకు జిఎస్‌టి 2.0 అక్కరకు రాలేదనే చెప్పాలి. చాలా నిత్యావసర వస్తువుల దుకాణాల్లో పాత సరుకుల చెలామణీ కాకుండా కొత్త సరుకులు తెప్పించుకోలేం కదా. పాత సరుకులకు పాత పన్నులు చెల్లించే తెచ్చాం కనుక పాత రేట్లకే ఇవ్వగల మని తగ్గింపులేమీ ఉండవని 'నో' చెప్పేస్తున్నారు. హతాశులై తిరిగిరావడం వినియోగదారుల వంతయ్యింది. తదుపరితరం వస్తుసేవల పన్నుల సంస్కరణలతో ఇప్ప టికిప్పుడు వినియోగదారులకు చౌకధరలకు సరకులు అందుతాయని, దాంతో వారు సంతుష్టులౌతారని ప్రధాని మోడీ అంచనా. కానీ క్షేత్రీయంగా చూస్తే అలాంటి ఆచూకీ ఏదీ కనబడడం లేదు. వాహనాలు, బైకులకు అయితే అవి లెక్కించుకునేందుకు అతి తేలికే కనుక వాటి మీద గతంలో వాహనం ఒక్కింటి అదనంగా చెల్లించిన జిఎస్‌టి భాగాన్ని తిరిగి డీలర్లకు జమ చేసే ఆలోచనా విధానంపై ఒప్పందం ఉన్నందున వాహనాలు, బైకుల మీద పెద్ద మొత్తంలోనే రాయితీ లభించింది. తక్కువ ధరకే వాహనాలు లభిస్తున్నాయి. తాజాగా ఈ కామర్స్ షాపుల్లో జిఎస్టీ తగ్గించి విక్రయాలు చేస్తున్నందున 25శాతం అమ్మకాలు పెరిగాయి. తక్కువ ధరకే వాహనాలు లభిస్తున్నాయి. కిరాణా సరుకుల విషయంలో ఎలాంటి 'చౌక' పాలు కనపడలేదు. దాంతో ప్రజలు జిఎస్టీ తగ్గింపు సౌకర్యం అందిపుచ్చుకోలేకపోయారు. జిఎస్‌టి పొదుపు ఉత్సవాలు సంతోష సంబరాలు పేరిట తగ్గింపుల నజ రానా కేవలం కార్లకే పరిమితమయ్యాయి. కిరాణా తది తర షాపులపై రూ.12లక్షల దాకా వచ్చే ఆదాయంపై పన్నులు మినహాయించినందున జిఎస్‌టికి సంస్కరణలు ప్రతి దుకాణాదారునికి లాభించాయని ప్రధాని మోడీ స్పష్టించారు. 2017లో ప్రారంభించిన జిఎస్‌టి సంస్కరణలతో ఒకే దేశం, ఒకే పన్ను పేరిట పన్నులను పునర్వి భజన చేశామని చెప్పారు. గతంలో రకరకాల పన్నులు సుంకాల వల్ల వ్యాపారులకు వినియోగదారులకు పన్నుల భారం పడేది. ఈ రీత్యా ప్రస్తుతం 2శ్లాబులే ఉంచారు. పన్నుల విధానం మీద ఏర్పడుతున్న అవరోధాలను తొలగించుకున్నారు. పన్ను సంస్కరణలతో సూక్ష్మ, చిన్నమధ్య తరహా పరిశ్రమలు సైతం ప్రయోజనం పొందుతాయి. వస్తూత్పత్తి మనమే చేసుకుంటాం కనుక జిఎస్‌టి సంస్కరణలు బాగా వినియోగపడడంతో లబ్ధి చేకూరుతుంది. గతంలో 12 శాతం పన్నుశ్లాబ్‌లగా ఉన్న 99శాతం వస్తువులను 5 శాతం పన్ను శ్లాబులోకి మార్చినట్లు తెలిపారు. ఫలితంగా ఆయా వస్తువుల ధరలు గణనీయంగా తగ్గుతాయని ప్రధాని దేశ ప్రజలందరికీ నచ్చచెప్పారు. క్షేత్రస్థాయిలో జిఎస్టీ అమలు చూసినప్పుడు కొత్తస్టాకు, పాత స్టాకు, పాత ధర, కొత్త ధర, పాత పన్ను, కొత్త పన్నులు. అనే అంశాలు వినియోగదారుని గందరగోళపరిచాయి. జిఎస్టీ రెండో అంకంతో రెండే శ్లాబుల పన్నుల విధానం స్వాగతించదగినవే. అధిక పన్ను రేటు శ్లాబ్‌లోకి చాలా వస్తువులే వెళ్లాయి. ఇలా తగ్గిన పన్నుభారం వినిమయదారునికి ఉద్దీపనగానేభావించాలి. ఎన్నో ప్రధానమైన వినియోగ వస్తువులు తక్కువ పన్ను విధానంలోకి మారడం వలన ఆయా ప్రభుత్వాలకి రాబడి తగ్గిపోయింది. ఆ రాబడిలోటును కేంద్ర ప్రభుత్వమే భరించేందుకు సిద్ధమై నందున రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సంస్కరణలకు అంగీకరించాయి. పెట్రోలు, విద్యుత్ వంటివి జిఎస్టీ పరిధిలోకి రాలేదు. దీని వలన ఏ వర్గాల నుంచీ ఎలాంటి ఆందోళనలు లేకున్నాహడావుడిగా ప్రవేశపెట్టిన జిఎస్టీ విధానం ఇప్పుడిప్పుడే ప్రజలకుఅందుబాటులోకి వస్తోంది. చేనేతను జిఎస్‌టి తగ్గింపులోకి తీసుకురాకపోవడం వల్ల ఆయావర్గాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. ఇవన్నీ ఇలా ఉండగా అమలు చేస్తున్నట్లు ప్రకటించి, తక్షణ సౌకర్యం పొందగలరని ఆశపెట్టిన అంశాలకు సంబంధించి వినియోగదారులు అసంతృప్తిగా ఉన్నారు. వ్యాపారుల అధిక లాభాలను నియంత్రణ చేసే అధికార యంత్రాంగం కదలిరాకపోవడంతో పాత స్టాకున్నంత వరకు పాత ధరకేనన్న భావనతో వ్యాపారం సాగిస్తున్నారు. అమలులో కాస్త అటు ఇటూగా ఉన్నాసంక్షేమ బాటలకు అడుగులు పడడం మంచిదే. ఒకపక్క జిఎస్‌టి పొదుపు ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. ఈ సెప్టెంబరు 22 నుంచి కొన్ని వస్తువులకు మాత్రం 'ఆదా' ధరలకే లభిస్తున్నాయి. నిత్యావసర వస్తువులు సరుకుల ధరల విషయంలో వ్యాపారులెవరైనా అధికంగావసూలు చేస్తే తమకు ఫిర్యాదు చేయాలని అధికారులు హడావుడి చేయడమే తప్ప ప్రత్యేకించి చెక్ చేస్తున్న సందర్భాలేవీ కనపడటం లేదు. దీనికితోడు అక్టోబరు 16న ప్రధాని మోడీ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ముఖ్యనేతలు తెలుగు రాష్ట్రాలలో జిఎస్టీ సంస్కరణోద్యమాన్ని ముందుకు తీసు కెళ్లేందుకు ఆయా ప్రాంతాల్లో పర్యటించడడం ఉత్సాహం కలిగించే విషయం.



సువాసన వెదజల్లే అత్తరులు, తళతళ మెరిసే అలంకారాలు, సంపదలు వీటన్నిటి కన్నా ఉత్తమ సంస్కారమే మంచి సంపద, మంచి అలంకారం.

అరిస్టాటిల్



పనిచేసే తత్త్వమూ, పని పట్ల విశ్వాసమూ విజయానికి మూలకారణాలు.

హెన్రీఫోర్డ్

# ప్రజావాక్కు



## సినిమా టిక్కెట్ ధరలు తగ్గించాలి

ఇటీవలి కాలంలో తెలుగు చలనచిత్ర పరిశ్రమలో కొత్త సినిమాలు విడుదలైన తొలి మూడు రోజుల పాటు టికెట్ ధరలనుపెంచడం ఒకప్రధాన చర్చనీయాంశంగా మారింది. ఈవిధానం నిర్మాతలకు లాభదాయకమై ఉంటే, సామాన్య ప్రేక్షకులపై తీవ్రమైన భారాన్ని మోపుతోంది. నేటి తరం పెద్ద బడ్జెట్ సినిమాల నిర్మాణ వ్యయం భారీగా పెరగడంతో, తొలి వారాంతంలో అధిక ధరలు వసూలు చేసి పెట్టుబడి త్వరగా తిరిగిపొందాలని నిర్మాతలు ప్రయత్నిస్తున్నారు. అధిక టికెట్ ధరల వలన తొలి రోజు కలెక్షన్లు భారీగా నమోదై, సినిమా బ్లాక్‌బస్టర్‌గా ప్రచారం పొందుతుంది. సాధారణ మధ్యతరగతి కుటుంబం నాలుగు టికెట్లు కొనుగోలుచేయాలంటే, అధిక ధరలు భారంగా మారతాయి. ఫలితంగా వారు సినిమా చూడకపోవచ్చు లేదా ఓటీటీ విడుదల కోసం వేచి చూడవచ్చు. ఈ పరిస్థితి థియేటర్ యజమానులకు కూడా కష్టాలు తెస్తోంది

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

## మండుతున్న లద్దాక్

లద్దాక్ తన అస్తిత్వంనిలుపుకోవడం కోసం మండుతోంది. తన వనరులపైన తన ఆధిపత్యం నిలుపుకోవడం కోసం మండుతోంది. తెలంగాణ ఏమో ఇతరుల ఆధిపత్యంకు వ్యతిరేకంగా కొట్లాడితే లద్దాక్ ఏమో తన స్వేచ్ఛ కోసం పోరాడుతుంది. కేంద్రం చేతిలో బంధి కావడం ఇష్టం లేక కొట్లాడుతోంది స్వేచ్ఛ వాయువులు పిల్చిన ఆ నెలలోకి అభివృద్ధి పేరుతో ఆధిపత్య ధోరణులు రాకూడదని పోరాడుతోంది. అభివృద్ధి సమ్మిళితంగా ఉండాలి అని ప్రాథమిక రంగం కేంద్రంగా అభివృద్ధి ఉండాలి.

- భారత అవినాష్, జనగామ

## గ్రామీణ వైద్యులకు శిక్షణ అవసరం

గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేద ప్రజలకు ప్రథమ చికిత్స చేస్తున్న ఆర్ఎంపి పిఎంపీల గ్రామీణ వైద్యులకు తెలంగాణ ప్రభుత్వం శిక్షణ తరగతులు నిర్వహించి గుర్తించాలి. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆర్ఎంపి పిఎంపీలకు శిక్షణ తరగతులను నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీచేసి తరగతులు సైతం ప్రారంభించారు. కోర్టువివాదాల కారణంగా ఆగిపోయింది.

- ముడితనపెల్లి ప్రభాకర్, భూపాలపల్లి జిల్లా

## క్రమశిక్షణ పాటించాలి

ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ప్రకృతి ప్రకోపాన్ని నిరోధించడం అసాధ్యం. కాని మానవ తప్పిదాలను తప్పించుకోవచ్చు. అయితే ప్రజలలో క్రమశిక్షణలోపిస్తే అదిప్రమాదాలకు, విషాదాలకు దారి తీస్తుంది. ఈలోపాలవల్ల ఎన్నో ప్రాణాలు గాలిలో కలసిపోతున్నాయి. కన్నవారికి కన్నీళ్లు మిగులుస్తున్నాయి. ఈ నెల 27న తమిళ సూపర్ స్టార్, తమిళ వెట్రి కజగమ్ అనే నూతన పార్టీని ప్రారంభించిన విజయ్ జోసేఫ్ తమిళనాడు లోని కరూర్‌లో తనమెగా మీటింగ్ పెట్టిన సందర్భంలో వేలకు పైగా అభిమానులు గుమ్మిగూడారు. ఒకపద్ధతి ప్రకారం పాటించవలసిన క్రమశిక్షణ లోపం ద్వారా తొక్కిసలాట జరిగి ఇప్పటికీ 39 మంది మరణించగా మరో50మందికి పైగా గాయపడి ఆసుపత్రి పాలయ్యారు. పరిహారాలు ఇస్తారు. పోయిన ప్రాణాలను తిరిగి తీసుకురాలేరెవరు. ప్రభుత్వాన్ని, పోలీసు యంత్రాగాన్ని బాధ్యతను పాటించని ప్రజలు మాత్రమే తిట్టి పోస్తారు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## బతుకమ్మ పాటలనే పాడుకుందాం

ప్రకృతిలోని పూలను బతుకమ్మగా పేర్చి భక్తితో గౌరమ్మను కొలుసుకుంటూ చారిత్రాత్మక కథలను తీరొక్క పాటలుగా అల్లి గుండ్రంగా బతుకమ్మ సుట్టూ అమ్మలక్కలు సేరి సప్పట్లు కొడుతూ ఆడే ఆట బతుకమ్మ ఆట.. గిప్పుడేమో బతుకమ్మ కాడా పొంతనలేని గేయాలేట్టి..మన ఆచార సాంప్రదాయాలను మంటగలుపుతున్నారు. ఈ బతుకమ్మ పాటల్లో ఎంతో అంతరార్థం దాగి ఉందనే విషయాన్ని తెల్వకపాయే. ఎన్నో ఒడిదుడుకులతో సాగిన కుటుంబం మానవీయ విలువలతో దాగి ఉండేటి పాటలు ఒగ్గేసి ఇష్టం అచ్చినట్లు సౌండ్ బాక్స్‌ల్లో పాటలు పెట్టి ఎగురుతున్నారు. ఇకనైనా బతుకమ్మ పాటలను పాడుకొని ఆడుకుందాం మానవ బంధాలను పెంచుకుందాం.

-కాల్వ నిఖిత, సిద్దిపేట

## జనావాసాలకు దూరంగా మద్యం షాపులు

ఇటీవల ఏపిలో కొత్తగా ఏర్పాటుచేసిన మద్యం విక్రయ కేంద్రాలు కొన్ని నగరాలలో జన వాడల మధ్య ఉంటున్నాయి. దీనికి తోడు వివిధ జంక్షన్‌లోకి వచ్చేజనం ఆమార్గం గుండా వస్తారు. మద్యం సేవకులు మోతాదు ఎక్కువై అక్కడ ఇతరుల తో ఘర్షణలు శృతిమించి కొట్టుకుంటూ ఆ దృశ్యం భయం కలుగుతున్నది. ఇకపై కొత్త షాప్ లకు ప్రదేశం కాస్త దూరంగా ఉంటే ఈ సమస్య కొంత తగ్గుతుంది.

-బొల్లోజు మేఘనాధ్, విశాఖపట్నం

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# 'ప్రాథమిక విద్య'కు గాంధీజీ పరిష్కారాలే శరణ్యం

**గాంధీజీ ప్రతిపాదించిన విద్యా విధానాన్ని స్వాతంత్ర్యం సమపార్జనంతరం అమలుపరిస్తే ఏనాడో మన దేశం సంపూర్ణ అక్షరాస్యత సాధించి అభివృద్ధి చెందిన దేశాల సరసననిలిచేది. విద్యార్థుల్లో విలువలు అభివృద్ధి చెంది నేటి విషసంస్కృతి విస్తరించేది కాదు. పని విద్య అమలుపరచడం ద్వారా పిల్లలకు పనిపట్ల గౌరవం సమకూరేది. నిరుద్యోగ నిర్మూలనకు తోడ్పడేది చదువుతో పూర్తిప్రయోజనం పొందేవారు 'మాతృ భాషలోనే ప్రాథమిక విద్యా బోధన' అని నిర్దుష్టంగా సిఫారసు చేసినందున కొనసాగుతున్న వివాదానికి ఏనాడో పరి ష్కారం చేకూరేది. స్వాతంత్ర్యానంతరం ప్రాథమిక విద్యారంగ ప్రాముఖ్యత గుర్తించి ఎన్నో కమిషన్లు కమిటీలు వేసినా మరెన్నో సిఫార్సులు చేసిన మౌలిక సమస్యలు నేటికీ అపరిష్కృతంగానే ఉన్నవి.**



కొల్లు మధుసూదన రావు

స్వాతంత్ర్యం సముపార్జించుకొని 78 సంవత్సరాలు గడిచినా బ్రిటిష్ వారు రూపొందించిన విద్యా విధానమే నేటికి కొనసాగుతున్నది. విద్యారంగానికి మూలమైనది ప్రాథమిక వ్యవస్థ. అది పటిష్టవంతంగా ఉన్నప్పుడే యావత్ విద్యారంగం ఆదర్శవంతంగా, అభ్యుదయకరంగా ఉంటుంది. కానీ ప్రధానమైన సమస్యలు నేటికీ కొనసాగడం విచారకరం. బ్రిటిష్ విద్యా విధానానికి ప్రత్యామ్నాయంగా మహాత్మా గాంధీజీ 1937లో బేసిక్ ఎడ్యుకేషన్ 'నయీ తాలీమ్' అనే నూతన విద్యావిధానాన్ని ప్రతిపాదించారు. ఈ వ్యవస్థను ప్రత్యక్షంగా అమలుచేయని కారణాన ప్రాథమిక విద్యా రంగంలో అతి మౌలికమైన, ప్రధానమైన సమస్యలు నేటికీ కొనసాగడం అత్యంత దురదృష్టకరం. భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలో 6 నుండి 14 సంవత్సరాల వయస్సుగల పిల్లలందరికీ ఉచిత, నిర్బంధ, ప్రాథమిక హక్కు అందించాల్సిన బాధ్యత రాజ్యంపై ఉందని పేర్కొనినా, ఉచిత నిర్బంధ విద్యాహక్కుకు బాలల హక్కు చట్టం 2009లో 35 ఆఫ్ 2009 రూపొందించినా అమలులో ఘోరంగా విఫలమయ్యాం. భారతదేశ అక్షరాస్యత రేటు 2023-24లో 80.9 మాత్రమే, ఇంకా మనదేశంలో 19.1 నిరక్షరాస్యులుగానే కొనసాగుతున్నారు. సాక్షర భారతం సాకారం చేసుకోలేకపోయాం. మనకన్నా అతి చిన్న వెనుకబడిన దేశాలు అండోర, గ్రీన్ లాండ్, నార్వే, లక్సెంబర్గ్, నార్త్ కొరియా, యుక్రెన్, యుజిబికిస్థాన్ మొదలగునవి సంపూర్ణ అక్షరాస్యత సాధించడమైనది. మన దేశంలో చదువుకున్నందువల్ల పూర్తి ప్రయోజనం కలగడం లేదని, బతుకు తెరువు చూపడం లేదని. జీవనోపాధికి తోడ్పడడం లేదని, నిత్య జీవితానికి ఉపయోగపడడం లేదనే భావనతో పిల్లలు వివిధ దశలలో చదువుకు స్వస్తి చెప్పి నిరుద్యోగులుగానే కాదు నిష్ప్రయోజకులుగా సమాజానికి భారంగా రూపొందుతున్నారు. మానవ జీవితం అత్యంత ఉన్నతమైనది, ఉద్దేశపూర్వకమైనది. భారతీయ సంస్కృతి సామాజిక నిబంధనలతో కూడిన వేల సంవత్సరాల ఆచారాలు, సాంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాల సమ్మేళనం. ఇది జన్మనిచ్చిన తల్లిదండ్రులు, పెరిగిన ప్రాంతం, ఎదిగిన వాతావరణంలో అలవడుతుంది. ఒక వ్యక్తి భావనతో కూడి విలువల ప్రాధాన్యత వ్యక్తమవుతుంది. వారి ప్రవర్తన సంబంధాలు పెంపొందించి జీవితంలో ఉపయోగపడతాయి. విద్యార్థులకు అలవడాల్సిన విలువలు సత్యము, సత్ప్రవర్తన, శాంతి, ప్రేమ, అహింస, నిజాయితీ, సమైక్యత, సహకారం, క్రమశిక్షణ, సృజనాత్మకత, సేవా దృక్పథం మొదలగునవి. బాల్యంలోనే విలువలు అంకురిస్తాయి. తల్లిదండ్రులు సహాయకుల్ని చూసి, విని తెలుసుకొని ఎదుగుతాయి. ప్రస్తుతం విష సంస్కృతి విస్తరిస్తోంది. పిల్లలు నైతిక విలువలు కోల్పోయి విద్వేషాలు, వివక్షతలతో, క్రమశిక్షణరాహిత్యం, అవినీతి అక్రమాలు, అసత్యానికి అలవాటు పడి నీతీ బాహ్య చర్యలకు పాల్పడుతున్నారు, నేరస్తులుగా మారుతున్నారు. అత్యధిక తల్లిదండ్రులకు ఒకే సంతానంతో అల్లారుముద్దుగా పెంచుతున్నారు. పిల్లల కోరికలుఎటువంటివైనా తీర్చుతున్నారు. ఇప్పుడు పిల్లల ప్రపంచాన్ని ట్యాబ్ లు టి.విలు ఆక్రమిస్తున్నాయి. ఆన్లైన్‌కు అడిక్ట్ అవుతున్నారు. స్మార్ట్‌ఫోన్లు, పోర్న్ సైట్లల అశ్లీలాన్ని చూసి పిల్లల మనసులో విషం నింపుకొని, రేప్‌లు, హత్యలు దొంగతనాలకు, బ్యాంకు దోపిడీలలో పాల్గొంటూ పిల్లలు నేరస్తులుగా రూపొందుతున్నారు. పిల్లలకు సంస్కృతి, నైతిక విలువలు ఇప్పుడు పాఠశాలలోనే ప్రారంభించాల్సి వస్తుంది. దీనికి



తల్లిదండ్రులు సహకారం అందించాలి. నైతిక విలువలు పెంపు జరగాల్సింది పాఠశాలలోనే, బోధించాల్సింది ఉపాధ్యాయులు. విలువలు అంటే వ్యక్తికి ప్రయోజనం కలిగించేలా ఇతరులకు హాని కలగకుండా ఉండాలి. గాంధీజీ ప్రతిపాదించిన ఆదర్శ, ఆచరణాత్మక విద్యప్రబోధనలు, నిర్బంధ సార్వత్రిక విద్య, మాతృభాషలోనే ప్రాథమిక విద్య, అక్షరాస్యత మాత్రమే కాదు స్వావలంబన, విద్య విలువల్ని పెంపొందించాలి, విద్య ద్వారా బాధ్యత గల పౌరునిగా పిల్లల్ని రూపొందించాలి, పిల్లల శారీరక, మానసిక ఆత్మవిశ్వాసం అభివృద్ధికి తోడ్పడాలి. పని, విద్యా ద్వారా ఉత్పాదిక కార్యక్రమంలో పని అనుభవం చేకూర్చి భావి జీవితానికి తోడ్పడాలి. విద్యా స్వావలంబనకు అవకాశం కల్పించి స్వతంత్రంగాను జీవనభృతి సాధించేలా ఉండాలి. మన విద్యా విధానంలో గాంధీజీ ప్రతిపాదించిన విధానాలు ప్రత్యక్షంగా అమలు చేయలేదు కానీ భారతీయ విద్యారంగంలో అమలుపర్చిన విధానం పద్ధతులను గణనీయంగా ప్రభావితం చేశాయి. సంపూర్ణ అక్షరాస్యత సాధనకు సర్వ శిక్ష అభియాన్, సమగ్ర శిక్షఅభియాన్, బాలల హక్కుచట్టం 2009 మొదలగు కార్యక్రమాలు చేపట్టినా సంపూర్ణంగా సాధించకుండానే నిలిపివేశారు. భారత స్వాతంత్ర్యం కఠినమైన ప్రస్థానంలో ఉంది. సమాజంలో అన్ని విలువలు అణగారిపోతున్నవి గతంలో పాఠశాలల్లో మోరల్ పిరియడ్లు వారానికి ఒకటి రెండు ఉండేవి. వాటిలో నీతి కథలు చెప్పేవారు. పాఠ్యాంశాలల్లో సుమతి, వేమన మొదలగు నీతిశతకాల పద్యాలు బోధించేవారు వాటి ద్వారా నీతి బోధన జరిగేది భావి పౌరుల్ని ఉత్తమ విలువలతో రూపొందించాలి. రోజురోజుకి విలువలు దిగజారుతున్న తరుణంలోఉపాధ్యాయులు క్రియాశీల పాత్ర వహించాలి. నైతిక విలువలను పిల్లలు నీతి కథలు ద్వారానేర్చుకుంటారని టొరంటో విశ్వవిద్యాలయం పరిశోధనలో వెల్లడించడమైనది. మన దేశ నైతికసంపద పంచ తంత్రం 50 భాషలకు అనువదించబడింది. వీటిద్వారా సంస్కారమంతమైనసంపద, సంస్కృతి పలు దేశాల్లో ప్రాచుర్యంపొంది, సంరక్షణకు ఇది తోడ్పడుతుంది. వీటిని మన పాఠ్యాంశాల్లో చేర్చాలి. పాఠశాల స్థాయిలో నీతి బోధనకు ప్రతిరోజు ఒక పీరియడ్ కేటాయించాలి. నూతన సాంకేతిక పరిజ్ఞానంలో వచ్చిన కొత్త ఆవిష్కరణలు, నైపుణ్యాలు విధానాలను విద్యారంగంలో కూడా వినియోగించుకోవాలి. స్మార్ట్‌ఫోన్, డిజిటల్ టి.వి, కృత్రిమ మేధ, ప్రోగ్రామింగ్ మొదలగునవి సద్వినియోగం చేసుకుంటే సౌలభ్యం, సౌకర్యం, సౌగమ్యం, సౌముఖ్యం పరిజ్ఞానం మొదలగునవి సమకూరుతాయి. కానీ పిల్లలు సెల్‌ఫోన్, టి.వి. మొదలగు వాటిని దుర్వినియోగం చేయడంతో దుష్ప్రవర్తన, హింస, క్రమశిక్షణారాహిత్యం, చెడు విలువలు, దురాశ, దుర్మార్గానికి, దొంగతనానికి, హత్యలకు పాల్పడడం జరుగుతుంది. పిల్లలు సెల్‌ఫోన్లు, ట్యాబ్లు వినియోగించకుండా కాపాడాలి లేదా పర్యవేక్షణలో వినియోగించేలా చూడాలి. దీనికి తల్లిదండ్రుల సహకారం స్వీకరించాలి. గాంధీజీ ప్రతిపాదిం చిన పని విద్యను ప్రత్యక్షంగా అమలు చేయకపోయినా కేంద్ర ప్రభుత్వం నియమించిన వివిధ కమీషన్లు, కమిటీలు కొఠారి కమిషన్ (6466) ఈశ్వరీ బాబు పటేల్ కమిటీ (1977) మాల్కం ఆదిశేషయ్య కమిటీ (1977) వి.ఆర్.రెడ్డి కమిటీ (1980) పని విద్యకు ప్రాముఖ్యత కల్పించాలని, పాఠ్యాంశాల్లో భాగంగా ఉండాలని, వారానికి 6 గంటలు కేటాయించాలని సిఫార్సు చేసినా, సిఫార్సులు కాగితాలతో పరిమితం అయ్యాయి కానీ అమలుకు నోచుకోలేదు. గాంధీజీ ప్రతిపాదించిన విద్యావిధానాన్ని స్వాతంత్ర్యం సమపార్జనంతరం అమలుపరిస్తే ఏనాడో మన దేశంసంపూర్ణ అక్షరాస్యత సాధించి అభివృద్ధి చెందిన దేశాల సరసననిలిచేది. విద్యార్థుల్లో విలువలు అభివృద్ధి చెంది నేటి విషసంస్కృతి విస్తరించేది కాదు. పని విద్య అమలుపరచడం ద్వారా పిల్లలకు పనిపట్ల గౌరవం సమకూరేది. నిరుద్యోగ నిర్మూలనకు తోడ్పడేది చదువుతో పూర్తిప్రయోజనం పొందేవారు "మాతృ భాషలోనే ప్రాథమిక విద్యా బోధన' అని నిర్దుష్టంగా సిఫా రసు చేసినందున కొనసాగుతున్న వివాదానికి ఏనాడో పరి ష్కారం చేకూరేది. స్వాతంత్ర్యానంతరం ప్రాథమిక విద్యారంగ ప్రాముఖ్యత గుర్తించి ఎన్నో కమిషన్లు కమిటీలు వేసినా మరెన్నో సిఫార్సులు చేసిన మౌలిక సమస్యలు నేటికీ అపరిష్కృతంగానే ఉన్నవి. గాంధీజీ ప్రతిపాదించిన విద్యా విధానం నిర్దిష్టంగా, నిర్మాణాత్మకంగా అమలు పరిస్తే మౌలిక సమస్యలన్నీ పరిష్కృతమై అత్యంత కీలకమైన ప్రాథమిక విద్యారంగం సమాజ సంరక్షణకు అభివృద్ధికి తోడ్పడి భాసిల్లే అవకాశం సమకూరుతుంది. ●

# రీసర్వే పారదర్శకం కావాలి

తరిగోపుల నారాయణస్వామి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భూముల రీ సర్వే ప్రారంభించి ఐదేళ్లకు పైగా అవుతున్నా ఇంకా పూర్తిస్థాయిలో ఫలితాలు ప్రజలకు అందుబాటులోకి రాకపోవడం ఒక ముఖ్య సమస్యగా కనిపిస్తోంది. ఈ కార్యక్రమం ప్రభుత్వ ఉద్దేశ్యం ప్రకారం సాగి ఉంటే, భూముల యజమానులు ఆన్‌లైన్‌లో సులభంగా తమ రికార్డులు పొందగలిగేవారు. కానీ వాస్తవ పరిస్థితి ఏమిటంటే, చాలా మంది రైతులు ఇంకా ప్రతిసారి పంట రుణం రీన్యువల్ చేయాలంటే లేదా భూమి లావాదేవీలు జరపాలంటే తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామాలలో రీ సర్వే పూర్తయ్యాక అధికారులు రైతులకు రసీదులు ఇచ్చి, ఏమైనా అభ్యంతరాలు ఉంటే నిర్దిష్ట సమయంలో రాతపూర్వకంగా తెలియచేయాలి. చాలా గ్రామాల్లో రైతులు ఎటువంటి అభ్యంతరాలు తెలపలేదు. అంటే రికా ర్డులు పూర్తిస్థాయిలో ఖరారయ్యాయి. అయితే ఈ రికార్డులు ఆన్‌లైన్‌లో కనిపించకపోవడం వల్ల ప్రజలకు ఉపయోగం తక్కువగానే మిగిలింది. ప్రస్తుత పరిస్థితిలో ఒక రైతుపంట రుణం రీన్యువల్ చేసుకోవాలంటే తహసీల్దార్ దగ్గరికి వెళ్లి రాతపూర్వకంగా వన్ బి పొందాలి. ఇది ఒక విధంగా ప్రభుత్వ డిజిటలైజేషన్ ఉద్దేశ్యానికి విరుద్ధం. ముందుగా ప్రజలు మీ సేవ లేదా మీభూమి ద్వారా సులభంగా రికార్డులు పొందగలిగారు. ఇప్పుడు రీ సర్వే పూర్తయ్యాక కొత్త రికార్డులు సరిగా అప్‌డేట్ కానందువల్ల ఆ సౌలభ్యం లేకుండాపోయింది. భూమి యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల్లో ముఖ్యమైనది సమయం, డబ్బు వృథాకావడం. ప్రతిసారి రెవెన్యూ కార్యాలయానికి వెళ్లడం రైతులపై అదనపు భారమవుతోంది. ఇది గ్రామీణ ప్రజానీకానికి పెద్ద సమస్యగా మారింది. పంట పనులు చూసుకోవడమో, ఇతర కూలి పనుల కోసం వెళ్ళడమో చేయాల్సిన రైతులు ఇలా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడం అనవసరమైన ఇబ్బంది. రీ సర్వే అనేది చాలా ముఖ్యమైన సంస్కరణ. దశాబ్దాలుగా కొనసాగుతున్న భూముల వివాదాలు, అశుద్ధ రికార్డులు, పక్కా హద్దులు లేని సమస్యలు తొలగించడానికి ఇది గొప్ప ప్రయత్నం. ప్రజలకు ఖచ్చితమైన హక్కుపత్రాలు ఇవ్వ




డం, భూమి వివాదాలను తగ్గించడం ఈకార్యక్రమంప్రధాన లక్ష్యం. కానీ పూర్తి చేసిన రికార్డులను తక్షణమే ఆన్‌లైన్‌లో ఉంచకపోతే ఈ ప్రయోజనం రైతులకు చేరదు. ప్రజల అంచనాలు చాలా స్పష్టంగా ఉన్నాయి. ఒకసారి రీ సర్వే పూర్తయ్యాక ఎలాంటి అభ్యంతరాలు లేవంటే, ఆ రికార్డులు వెంటనే అందుబాటులో ఉండాలి. రైతులు తాము యజమానులమని నిరూపించుకోవడానికి మళ్లీ మళ్లీ అధికారులను సంప్రదించాల్సిన అవసరం ఉండకూడదు. ఇది మాత్రమే కాకుండా, కొత్తగా భూములు అమ్ముకోవాలనుకున్నా లేదా పంట రుణాలు తీసుకోవాలనుకున్నా సులభతరం కావాలి. ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని పారదర్శకంగా పూర్తి చేసి, రికార్డులు అందుబాటులో ఉంచితే రైతులపై నమ్మకం పెరుగుతుంది. లేకపోతే ప్రభుత్వం చేసిన రీ సర్వే పేరు మీద కొత్త సమస్యలు మాత్రమే వచ్చాయని ప్రజలు భావిస్తారు. కాబట్టి ఆలస్యాలు తగ్గించి పూర్తి అయిన గ్రామాల రికార్డులను వెంటనే ఆన్‌లైన్‌లో ఉంచడం అత్యవసరం. ఈసమస్య పరిష్కారం కోసం అధికారులు కొన్ని చిన్న చర్యలు తీసుకుంటే పెద్ద మార్పు వస్తుంది. గ్రామాల వారీగా రీ సర్వే పూర్తి అయిన వెంటనే ఆ గ్రామానికి సంబంధించిన వన్ బి, అడంగళ్, ఎల్పీ నంబర్లు, పటాలు అన్నీ మీ సేవ లేదా మీభూమి లాంటి వెబ్‌సైట్లలో అప్డేట్ చేయాలి. అలాగే బ్యాంకులకు కూడా ఈ డిజిటల్ రికార్డులు చెల్లుబాటు అయ్యేలా మార్పులు చేయాలి. ప్రభుత్వం ఈ సమస్యను ఒక అవకాశంగా తీసుకుంటే రైతులకు మాత్రమే కాకుండా మొత్తం వ్యవసాయ రంగానికి కూడా ఊరటనిస్తుంది. డిజిటల్ రికార్డులు అందుబాటులోకి రావడంవలన భవిష్యత్తులో వివాదాలు తగ్గుతాయి, భూమి విలువ పెరుగుతుంది. పంట రుణాలు తేలికగా లభిస్తాయి. ఇవన్నీ కలిపి గ్రామీణాభివృద్ధికి దోహదం చేస్తాయి. గ్రామీణ ప్రజానీకం కూడా ఈ అంశంలో చైతన్యం కలిగి ఉండాలి. రీ సర్వే పూర్తయినా రికార్డులు ఆన్‌లైన్‌లో కనిపించకపోతే అధికారులు దగ్గర ప్రశ్నించాలి, ఫిర్యాదులు చేయాలి. పత్రికలలో, సమావేశాలలో, సంఘాల ద్వారా ఈ సమస్యను ప్రస్తావించాలి. అప్పుడు మాత్రమే ఈ వ్యవస్థ వేగంగా పనిచేస్తుంది. రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వానికి ఇది పెద్ద సవాలు. ఒకవైపు పారదర్శకతను చూపించాలి, మరోవైపు రైతుల నమ్మకాన్ని పొందాలి. ఈ రెండు లక్ష్యాలను సాధించడానికి అత్యవసరంగా అవసరమైనది పూర్తి చేసిన రికార్డులను వెంటనేప్రజలకు అందుబాటులో ఉంచడం. రీ సర్వే విజయవంతమయ్యిందని చెప్పుకోవాలంటే ఇది తప్పనిసరిగా జరగాలి. ●

# రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ: మహాత్తర ఘట్టం

రామ కిష్టయ్య సంగన భట్ల

స్వతంత్ర భారతదేశంలో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ ఒక రాజకీయ, సాంస్కృతిక, పరిపాలనా ప్రస్థానమే కాక, దేశ సమాఖ్య నిర్మాణానికి పునాది వేసిన చారిత్రాత్మక పరిణామం. బ్రిటీష్ పాలనలో ఏర్పడిన ప్రావిన్సులు, సంస్థానాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా లేవు. ఆ విభజనలో పార్ట్ ఏ లోని అస్సాం, బీహార్, బొంబాయి, తూర్పు పంజాబ్, మధ్యప్రదేశ్, మద్రాస్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ వంటి బ్రిటీష్ ప్రావిన్సులు, పార్ట్ బిలోని సంస్థానాలు, పార్ట్ సిలోని చిన్న ప్రాదేశిక పాలనాయూనిట్లు, పార్ట్ డి వంటి ప్రత్యేక కేంద్రపాలిత ప్రాంతాలు అన్నీ సామ్రాజ్య అవసరాలఆధారంగా కూర్చబడ్డాయి. స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే ప్రజలలో భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటుకై డిమాండ్లు పెరిగాయి. కాంగ్రెస్ పార్టీ 1920లో నాగపూర్ సమావేశంలోనే భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటును సమర్థించింది. అయితే దేశ విభజనలో జరిగిన రక్తపాతం, వలసల కల్లోలం దృష్ట్యా నెహ్రూ, పటేల్ వంటి నాయకులు కొత్త రాష్ట్రాల ఏర్పాటులో జాగ్రత్త వహించారు. 1948లో ఏర్పాటు చేసిన ధార్ కమిషన్, తదనంతరం నెహ్రూ, పటేల్, పట్టాభి సీతా రామయ్యలతో కూడిన జేవీపీ కమిటీలు భాషా ప్రాతిపదిక సరికాదని, ఇప్పుడే రాష్ట్రాలను పునర్వ్యవస్థీకరించడం సమంజసం కాదని తేల్చాయి. కానీ ప్రజల ఆకాంక్షలు ఆగలేదు. తెలుగు ప్రాంత ప్రజలు తమ రాష్ట్రం కోసం గళమెత్తారు. పొట్టి శ్రీరాములు 1952లో ఆంధ్రరాష్ట్రం కోసం చేపట్టిన నిరాహార దీక్షలో 58 రోజుల తరువాత ప్రాణత్యాగం చేయడం ఉద్యమాన్ని ఉధృతం చేసింది. ఆ త్యాగ ఫలితంగా 1953 అక్టోబర్ 1న మద్రాస్ నుండి విడిపోయి ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. ఇది స్వతంత్ర భారత దేశంలో భాషా ప్రాతిపదికన ఏర్పడిన తొలి రాష్ట్రం. ఈ పరిణామం ఇతర భాషా ప్రాంతాలకూ స్ఫూర్తినిచ్చింది. మహారాష్ట్ర కోసం మరాఠీలు, గుజరాత్ కోసం గుజరాతీలు, పంజాబ్ కోసం సిక్కులు, మైసూరు కోసం కన్నడిగులు ఉద్యమాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 1953 డిసెంబర్ 29న రాష్ట్రాల పునర్వ్య



వస్థీకరణ కమిషన్‌ను నియమించింది. న్యాయమూర్తి ఫజల్ అలీ అధ్యక్షతన, సభ్యులు పణిక్కర్, కుంజ్రూ పాల్గొన్న ఈ కమిషన్ 1955 సెప్టెంబర్ 30న నివేదిక సమర్పించింది. ఇందులో పార్ట్ ఎ,బి,సి వర్గీకరణలు రద్దు చేయాలని, సంస్థానాల ప్రత్యేక హక్కులు తొలగించాలని, చిన్న రాష్ట్రాలను విలీనం చేయాలని, భాషా, భౌగోళిక, ఆర్థిక అంశాలను సమన్వయం చేస్తూ రాష్ట్రాల కొత్త రూపకల్పన జరగాలని సూచించింది. ఈ నివేదిక ఆధారంగా 1956లో పార్లమెంట్ రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టం ఆమోదించి, ఏడో సవరణ రాజ్యాంగంలో అమలులోకి తెచ్చింది. 1956 నవంబర్ 1న 14 రాష్ట్రాలు, 6 కేంద్రపాలిత ప్రాంతాలు ఏర్పడ్డాయి. ఈ పునర్వ్యవస్థీకరణలో ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణ కలసి ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటు ప్రజల్లో సాంస్కృతిక, భాషా గౌరవాన్ని బలపరిచింది. స్థానిక సమస్యల పరిష్కారానికి సమర్థవంతమైన పాలన సాధ్యమైంది. కానీ ఈ ప్రక్రియలో ప్రాంతీయత, విభజన వాదనలు కూడా పుంజుకున్నాయి. బొంబాయి రాష్ట్ర విభజనలో మహారాష్ట్ర గుజరాత్, పంజాబ్ విభజనలో భాషామత సమస్యలు, అస్సాం విభజనలో ఈశాన్య గుర్తింపు కోసం ఉద్యమాలు చోటుచేసుకున్నాయి. అయినప్పటికీ రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ ప్రజాస్వామ్య పటిష్టతకు దోహదపడింది. రాష్ట్రాలు వరుసగా ఏర్పాటులో మహారాష్ట్ర, గుజరాత్ 1960లో, నాగాలాండ్ 1963లో, హర్యానా 1966లో, మణిపూర్, త్రిపుర, మేఘాలయం 1972లో, సిక్కిం 1975లో, మిజోరాం, అరుణాచల్ ప్రదేశ్ 1987లో, గోవా అదే ఏడాది, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, జార్ఖండ్ 2000లో, తెలంగాణ 2014లో ఏర్పడ్డాయి. 2019లో ఆర్టికల్ 370 రద్దుతో జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా మారింది. ప్రస్తుతానికి దేశం 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలుగా ఉంది. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ ఒక నిరంతర ప్రక్రియ. ఇది ప్రజల ఆకాంక్షలు, ప్రాంతీయ అవసరాలు, రాజకీయ పరిణామాలు కలగలసిన జీవం. భాషా గౌరవం, స్థానిక అభివృద్ధి, పాలనా సమర్థత వంటి లాభాలు లభించినప్పటికీ వనరుల పంచిక, ప్రాంతీయ వాదనలు వంటి సవాళ్లు కూడా ఎదురయ్యాయి. అయినప్పటికీ ఫజల్ అలీ కమిషన్ నివేదిక, 1956 చట్టం, పొట్టి శ్రీరాముల త్యాగంవంటి ఘట్టాలు భారతప్రజాస్వామ్య చరిత్రలో అచెంచలంగా నిలిచిపోయాయి. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ ప్రజల భాషాసాంస్కృతిక వ్యక్తిత్వానికి, సమాఖ్య ఐక్యతకు అద్దం పట్టిన చారిత్రక ఘట్టమని చెప్పాలి. ●

## ఢాకా నియోజకవర్గంలో 80 వేల

# ముస్లిం ఓట్లు తొలగింపు..

### బిజెపి స్థానిక నాయకుల నుంచే సిఇఒకు ఫిర్యాదులు




**పాట్నా, సెప్టెంబరు 29:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఓట్‌చోరీ నినాదం మరింతగా ఊపందుకుంది. ఎన్నికల్లో ఒకే ఒక్క నియోజకవర్గంలో ఉన్న ముస్లిం ఓటర్లను భారీ సంఖ్యలో తొలగించాలని బిజెపినుంచే ఎన్నికల సంఘానికి డిమాండ్ వచ్చినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి ఆధారాలతోసహా విపక్షాలు ఎన్నికల సంఘానికి నివేదించాయి. తూర్పుచంపారన్ జిల్లాలోని ఢాకా నియోజకవర్గంలో సుమారు 80వేల మంది ముస్లిం ఓటర్లను జాబితాలనుంచి తొలగించారన్న దుమారం రేగింది. ఇందుకు సంబంధించి ఈ ఓట్లు తొలగించాలని బిజెపి పాట్నాలోని రాష్ట్ర కార్యాలయంనుంచే లేఖ వచ్చిందని ఎన్నికల సిఇఒకు ఈ లేఖను పంపిస్తూ వారంతా భారతీయ ముస్లింలు కాదని, బోగస్ ఓట్లని తొలగించాలని డిమాండ్‌చేసినట్లు తేలింది. కాషాయపార్టీ బూత్ స్థాయి ఏజెంట్ ధీరజ్‌కుమార్, బిజెపి ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకకుడు పవన్‌కుమార్‌జైస్వాల్‌లనుంచి కూడా ఈసికి ఇవే డిమాండ్లు వచ్చాయని తేలింది. ఓటర్ల జాబితానుంచి 130 మంది ముస్లింల ఓట్లు తొలుత తొలగించారు. ముసాయిదా జాబితా ప్రకటించేందుకు ముందే ఈ తొలగింపు జరిగింది. బీహార్‌లో నిర్వహించిన సర్‌మరింత వివాదాస్పదం అయిందనడానికి ఇదే ఉదాహరణ. ఆగస్టు 19 నుంచి ఈ ఓట్ల తొలగింపు యధేచ్ఛగా సాగిందని విపక్షాలు ఆరోపించాయి. ఢాకాలోని బూత్ స్థాయి ఏజెంట్ తాను ఇచ్చిన ఆధారాలన్నీ సమగ్ర పరిశీలన తర్వాతనే చేసామని ప్రజాప్రాతినిధ్య చట్టం 1950కింద అవసరమైతే శిక్షార్హం ఉన్న సెక్షన్ 31గురించి కూడా తనకు తెలుసునని అన్నారు. ధీరజ్‌కుమార్ ఒక్కరే 78,384ముస్లిం ఓట్లు తొలగించాలని సిఇఒకు ఫిర్యాదులు చేసారు. ఫిర్యాదుతోపాటు వారి పేర్లు ఎపిక్ నంబర్లు కూడా ఇచ్చారు. ఆ తర్వాత బిజెపి స్టేట్ ఆఫీస్‌నుంచి కూడా సిఇఒకు లేఖ వెళ్లింది. ఈ మొత్తం ఓటర్లను తొలగించాలని వీరంతా భారతీయ పౌరులు కాదని తెలిపింది. బీహార్ ఎన్నికల మేనేజ్‌మెంట్ విభాగం తిరుహత్ ప్రమండల్ ప్రభారి నుంచి లోకేష్ అనే పేరుతో ఈ లేఖ వచ్చింది. అయితే తర్వాత ఆరాతీస్తే లోకేష్ అనవారి పేరు పార్టీ ఆఫీసులోనే ఎవ్వరూ లేరని తేలింది. అయితే బిఎల్‌ఎ దాఖలుచేసిన లేఖను మాత్రం బిజెపి నాయకులు కొట్టివేయలేకపోతున్నారు. ఢాకా ఎమ్మెల్యే పవన్ జైస్వాల్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే 80వేల ముస్లిం ఓట్లను తొలగించే కుట్రలు చేసారని ఫుల్వారియా పంచాయత్ సర్పంచ్ ఫిరజ్ ఆలమ్ పేర్కొన్నారు. అలాగే బిజెపి ఫిర్యాదులో చందన్‌బారా గ్రామంలో కూడా ఐదువేల ఓట్లు తొలగించాలని సూచించారు. ఢాకా నియోజకవర్గం ఇండోనేపాల్ సరిహద్దులో ఉంది. వాస్తవానికి కాంగ్రెస్ పట్టున్న ఈ ప్రాంతంలో తర్వాత ఆర్జేడి పట్టుసాధించింది. ఆతర్వాత బిజెపి చేతుల్లోకి వెళ్లింది.

## హోంవర్క్ చేయలేదని విద్యార్థిని తలకిందులుగా వేలాడదీసి చిత్రహింసలు

**పానిపట్, సెప్టెంబరు 29:** హర్యానా రాష్ట్రంలో దారుణ ఘటన చోటు చేసుకుంది.



హోమ్‌వర్క్ చేయలేదన్న కారణంతో ఓ చిన్నారిని కిటికీకి తలకిందులుగా వేలాడదీసి చితకబాదారు. ఈ అమానవీయ ఘటన పానిపట్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చోటు చేసుకుంది. ముఖిజా కాలనీకి చెందిన ఓ కుటుంబం తన ఏడేళ్ల బాలుడిని స్థానిక ప్రైవేట్ పాఠశాల లో చేర్పించింది. రెండో తరగతి చదువుతున్న ఆ చిన్నారి హోమ్‌వర్క్ పూర్తి చేయకపోవడంతో ప్రిన్సిపాల్ రీనా ఆగ్రహం వ్యక్తం చేసింది. స్కూల్లో డ్రైవర్‌గా పనిచేస్తున్న అజయ్ అనే వ్యక్తికి చిన్నారిని శిక్షించమని ఆదేశించింది. ప్రిన్సిపాల్ ఆదేశాలతో సదరు డ్రైవర్ బాలుడిని తాళ్లతో పాఠశాల కిటికీకి తలకిందులుగా వేలాడదీశాడు. అనంతరం చిన్నారిని దారుణంగా కొట్టాడు. అంతటితో ఆగని అజయ్ చిన్నారిని కొడుతున్న దృష్యాలను తమ ఫ్రెండ్స్‌కు వీడియో కాల్ చేసి మరీ పైశాచిన ఆనందాన్ని పొందాడు. ఈ తతంగాన్ని అక్కడే ఉన్న వారు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయగా అదికాస్తా ప్రస్తుతం వైరల్‌గా మారింది. అంతేకాదు, పాఠశాల ప్రిన్సిపాల్ రీనా స్వయంగా చిన్న పిల్లల్ని కొడుతున్న వీడియో కూడా బయటకు వచ్చింది. ఈ వీడియోలు బయటకు రావడంతో స్థానికంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. పాఠశాలల్లో విద్యార్థుల భద్రతపై ఆందోళనలను రేకెత్తించింది. పలుసార్లు పిల్లలను శిక్షగా టాయిలెట్లను కూడా శుభ్రం చేయిస్తున్నారని పలువురు ఆరోపించారు. ఈ అమానవీయ ఘటనపై బాధిత కుటుంబం పోలీసులను ఆశ్రయించింది. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న మోడల్ టౌన్ పోలీసులు చర్యలు చేపట్టారు. పలు సెక్షన్ల కింద ప్రిన్సిపాల్, ఇతర సిబ్బందిపై కేసు నమోదు చేశారు.






## మెలోనీ ఆత్మకథకు మోడీ ముందుమాట

### మన్ కీబాత్ శీర్షిక నుంచి ప్రేరణ పొందిన పుస్తకం

### ప్రధాని మోడీ ట్వీట్... సోషల్ మీడియాలో వైరల్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 29:** ప్రధాన మంత్రి నరేంద్ర మోడికి ప్రపంచ దేశాధినేతలతో మంచి సంబంధాలు ఉన్నాయి. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, నరేంద్రమోడి మంచి స్నేహితులన్న విషయం తెలిసిందే. పలు అంతర్జాతీయ వేదికలపై వీరు ఇరువురూ ఎంతో ఆప్యాయంగా పలకరించుకుంటూ అందరినీ ఆకర్షిస్తుంటారు. తాజాగా ఇటలీ ప్రధానమంత్రి మెలోని జీవిత 'ఐయామ్ జార్జియా– మై రూట్స్, మై ప్రిన్సిపల్స్' పేరిట మెలోనీ ఆత్మకథ రాసింది. అందులో ఆమె తన చిన్ననాటి జ్ఞాపకాలు, రాజకీయ, వ్యక్తిగత జీవితం, తల్లిదండ్రులు.. ఇలా తన జీవితంలో జరిగిన సంఘటనలను పొందుపరిచారు. అంతేకాదు, తాను ఎదుర్కొన్న సవాళ్లు, ఎన్నికల ప్రచార సమయంలో గర్భిణిగా, సింగిల్ పేరెంట్‌గా ఎదుర్కొన్న ఇబ్బందులను ప్రస్తావించారు. ఈ ఆత్మకథ 2021లో తొలిసారి మార్కెట్‌లోకి వచ్చి బెస్ట్ సెల్లర్‌గా నిలిచింది. ఇటీవలే అమెరికాలో కూడా ఇది విడుదలైంది. ఇప్పుడు భారత్‌లో అందుబాటులోకి తెచ్చేందుకు మెలోనీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమెతో ఉన్న స్నేహబంధంతో ప్రధాని మోడి, మెలోనీ పుస్తకంలో ముందుమాట రాశారు. ఈ సందర్భంగా మెలోని ఆత్మకథను 'హర్ మన్ కీ బాత్' గా ప్రధాని అభివర్ణించారు. ఈ పుస్తకంలో ముందుమాట రాయడం తనకు గొప్ప గౌరవంగా పేర్కొన్నారు. ఈ జీవిత చరిత్రకు భారత్‌లో మంచి ఆదరణ లభిస్తుందని మోడి ఆశాభావం వ్యక్తం చేశారు. తన రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' శీర్షిక నుంచి ప్రేరణ పొందిన పుస్తకం ఇది అని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ప్రస్తుతం ఆ పోస్ట్ వైరల్ కావడంతో మెలోడీ మూమెంట్ మరోసారి తెరపైకి వచ్చింది. మెలోని పుస్తకాన్ని రూపా పబ్లికేషన్స్ ప్రచురించింది. జార్జియా మెలోని ఆత్మకథ భారతీయ ఎడిషన్ త్వరలో దేశంలో అందుబాటులోకి రానుంది.

## గ్యాంగ్‌రేప్‌పై వాయవ్యబంగ్లాదేశ్‌లో హోరెత్తిన నిరసనలు



**చిట్టగాంగ్, సెప్టెంబరు 29:** బంగ్లాదేశ్‌లో ఓ గిరిజన బాలికపై జరిగిన సామూహిక అత్యాచారం స్థానికంగా జాతుల మధ్య చిచ్చు రాజేసింది. ఆదివాసీ తెగలకు, వలస వచ్చిన బెంగాలీ వర్గాలకు మధ్య చెలరేగిన తీవ్ర ఘర్షణల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, సైనికులు, పోలీసులు సహా పదుల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. భారీగా భద్రతా బలగాలను మోహరించినా హింస అదుపులోకి రాకపోవడంతో ఆగ్నేయ బంగ్లాదేశ్‌లోని పలు ప్రాంతాల్లో భయానక వాతావరణం నెలకొంది. భారత్‌మయన్మార్ సరిహద్దుల సమీపంలోని చిట్టగాంగ్ కొండ ప్రాంతమైన ఖగ్రాఛారి జిల్లాలో మంగళవారం ఎనిమిదో తరగతి చదువుతున్న ఓ గిరిజన బాలిక ట్యూషన్ నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా సామూహిక అత్యాచారానికి గురైంది. అర్ధరాత్రి సమయంలో అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను గుర్తించిన కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై గిరిజన సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. శనివారం నుంచి నిరసనలు ఉధృతం చేసి, టైర్లు కాల్చి, చెట్లను అడ్డంగా వేసి రహదారులను దిగ్బంధం చేశాయి. దీంతో ఆదివారం నాటికి ఈ ఆందోళనలు హింసాత్మక ఘర్షణలుగా మారాయి. ఖగ్రాఛారి జిల్లా కేంద్రంలో మొదలైన అల్లర్లు క్రమంగా ఇతర ప్రాంతాలకూ వ్యాపించాయి. ఇరు వర్గాల వారు ఒకరి వ్యాపార సముదాయాలపై, ఇళ్లపై మరొకరు దాడులు చేసుకుంటూ నిప్పు పెట్టారు. దీంతో జిల్లా కేంద్రానికి 36 కిలోమీటర్ల దూరంలోని గుయిమారా ప్రాంతంలో పరిస్థితి చేయిదాటింది. అక్కడ జరిగిన కాల్పుల్లో ముగ్గురు మరణించారని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ అహ్సన్ హబీబ్ మీడియాకు తెలిపారు. మృతదేహాలను ఖగ్రాఛారి సదర్ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన చెప్పారు. మృతులు ఏ వర్గానికి చెందినవారో అధికారులు వెల్లడించలేదు. ఈ ఘర్షణల్లో 13 మంది సైనికులు, ముగ్గురు పోలీసులు కూడా గాయపడినట్లు హోం మంత్రిత్వ శాఖ ప్రకటించింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు జిల్లా యంత్రాంగం ఖగ్రాఛారి పట్టణంలో, సమీప ప్రాంతాల్లో సెక్షన్ 144 విధించింది. సైన్యం, సరిహద్దు భద్రతా దళం (బిఎస్‌ఎఫ్), పోలీసులు గస్తీ కాస్తున్న ప్పటికీ, ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయ పడుతున్నారు. అక్కడ కర్ఫ్యూ వాతావరణం నెలకొందని స్థానిక జర్నలిస్టులు తెలిపారు. ఈ ఘటనపై విచారం వ్యక్తం చేసిన బంగ్లాదేశ్ హోం శాఖ, తక్షణమే దర్యాప్తు జరిపి దోషులను కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చింది. ప్రజలందరూ సంయమనం పాటించాలని కోరింది. కాగా, బాలికపై అత్యాచారం కేసులో సైన్యం సహాయంతో ఓ బెంగాలీ యువకుడిని అరెస్టు చేసిన పోలీసులు, కోర్టు ఆదేశాలతో ఆరు రోజుల కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు.

## కన్సల్టెంట్‌గా రూ.241కోట్లు సంపాదించా: ప్రశాంత్‌కిశోర్



**పాట్నా, సెప్టెంబరు 29:** ఎన్నికల వ్యూహకర్త నుంచి రాజకీయ నాయకుడిగా మారిన ప్రశాంత్ కిషోర్‌కు చెందిన జన్ సురాజ్ నిధుల గురించి బీజేపీ ఎంపీ సంజయ్ జైస్వాల్ ప్రశ్నించారు. షెల్ కంపెనీల ద్వారా ఆయన కోట్లు సేకరించారని ఆరోపించారు. 'నష్టాల్లో నడుస్తున్న కంపెనీలు ప్రశాంత్ కిషోర్‌కు మాత్రమే కోట్ల రూ పాయలు ఎందుకు ఇస్తాయి కాంగ్రెస్ పాలనలో(కేంద్రంలో) ప్రతి గ్రామస్తుడికి 'స్కామ్' అనే పదం తెలిసినట్లే, ప్రశాంత్ కిషోర్ ద్వారా రౌండ్‌ట్రిప్పింగ్ అంటే ఏమిటో అందరికీ తెలుస్తుంది' అని అన్నారు. ప్రశాంత్ కిషోర్ ఈ వ్యాఖ్యలపై స్పందించారు. పార్టీ నిధులు పారదర్శకంగా, క్లీన్‌గా ఉన్నాయని తెలిపారు. పలు సంస్థలకు తాను కన్సల్టెంట్‌గా పనిచేసి మూడేళ్లలో రూ.241కోట్లు సంపాదించినట్లు తెలిపారు. 'నేనురూ.31కోట్లు జీఎస్టీగా, రూ.20 కోట్లు ఆదాయపు పన్నుగా చెల్లించా. రూ. 98కోట్లు చెక్ చెల్లింపు ద్వారా జన్‌సురాజ్‌కు విరాళంగా ఇచ్చా'అన్నారు. పార్టీ ఖాతాలకు చెల్లింపులన్నీ చెక్కుల ద్వారా జరిగాయని తెలిపారు. ఇతర వనరుల నుంచి కూడా విరాళాలు అందినట్లు చెప్పారు. మరోవైపు సొంత రాష్ట్రమైన బీహార్‌ను మార్చాలన్న లక్ష్యంతోనే రాజకీయాల్లోకి వచ్చి నట్లు ప్రశాంత్ కిషోర్ తెలిపారు. 'నేను డబ్బు సంపాదించడానికి బీహార్ రాలేదు. నా దగ్గర ఉన్న ప్రతి రూపాయి ప్రభుత్వ పర్యవేక్షణలో ఉన్నది. ఈ వ్యవస్థ మారే వరకు పదేళ్ల పాటు నేను బీహార్‌లోనే ఉంటా' అని అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో తన పార్టీ పోటీ చేస్తుందని ఇప్పటికే ఆయన స్పష్టం చేశారు.



## అహల్యనగర్‌లో ఐలవ్ మహ్మద్ ముగ్గులు

### పోలీసులతో నిరసనకారుల వాగ్వాదం

### 30 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

**ముంబయి, సెప్టెంబరు 29:** మహారాష్ట్రలోని అహల్యానగర్‌లో ఒక రోడ్డుపై వేసిన రంగోలిలో ఐలవ్ మహ్మద్ అని రాయడంతో తీవ్ర ఉద్రిక్తతలకు తావచ్చింది. కొంతమంది నిరసనకారులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పరిస్థితిని అదుపుచేసేందుకు పోలీసులు స్వల్ప లాఠీఛార్జికూడా చేయాల్సి వచ్చింది. వెంటనే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదుచేసి 30 మందిని అదుపులోకి తీసుకున్నారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ మాట్లాడుతూ శాంతిని భగ్నంచేసేందుకు కొందరు ఈ కుట్రలకు పాల్పడినట్లుగా ఉందని, సమగ్ర దర్యాప్తుచేయాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసుల వివరాలప్రకారం అహ్మద్‌నగర్‌లో ఒక రోడ్డుపై వేసిన రంగోలిలో ఐలవ్ మహ్మద్ అని రాసారు. నవరాత్రి వేడుకల సందర్భంగా వేసిన రంగోలిలో కొందరు అభ్యంతరకర వ్యాఖ్యలు చేసారని ముస్లిం సమాజానికి వ్యతిరేకంగా రంగోలిల్లో వ్యాఖ్యలున్నాయన్నారు. ఆ కులస్తులు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదుచేసారని, ఒక వ్యక్తిని అరెస్టుచేసామని, అయితే నిరసనకారులు శాంతించక హైవేను బ్లాక్‌చేయడంతో పోలీస్ చర్యకు దిగాల్సి వచ్చిందన్నారు. మతఘర్షణలు రెచ్చగొడితే కఠిన చర్యలు తప్పవని మహారాష్ట్ర సీఎం హెచ్చరించారు. ప్రస్తుతం తాను ప్రయాణంలో ఉన్నాన,ఇవివరాలు తెలుసుకుని సగ్ర దర్యాప్తునకు ఆదేశిస్తామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఇలాంటి చర్యలకు కొందరు దిగారని, వాటిని కూడా అణిచివేసామని గుర్తుచేసారు. అంతకుముందు యూపిలో ఈ స్లోగన్ వెలుగులోకి వచ్చింది. యుపిలోని కాన్పూర్‌లో ఐలవ్ మహ్మద్ అన్న నినాదాలతో బోర్డులు వేలాడదీయడంతో అక్కడ ఎఫ్ఐఆర్ నమోదు చేసి 24మందిని అరెస్టుచేసారు. ఈద్‌మిలాద్ ఉన్‌నబీ ఊరేగింపు సందర్భంగా ఈ సంఘటన జరిగింది. హిందూ సంస్థలు ఈ తీరును తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇది కేవలం రెచ్చగొట్టే వైఖరి మాత్రమేనని అన్నారు. ఇదే అదునుగా ఐలవ్‌ముహమ్మద్ పోస్టర్లు దేశంలో పలుచోట్ల వెలిసాయి.

# రాహుల్ ఛాతీలో బుల్లెట్ దించుతా!

### బిజెపి నేత వివాదాస్పద వ్యాఖ్యలు

### అమిత్ షాకు కెసి వేణుగోపాల్ లేఖ

### బిజెపి- ఆర్‌ఎస్‌ఎస్‌పై నేతల ఆరోపణలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 29:** 'రాహుల్ గాంధీని ఛాతిలో బుల్లెట్ దించి చంపుతా' అంటూ ఏబీవీపీ కేరళ మాజీ చీఫ్, బీజేపీ అధికార ప్రతినిధి ప్రింటు మహదేవ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తిరువనంతపురంలో ఓ టీవీ చర్చా వేదికలో ప్రింటు మహదేవ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం లేపాయి. లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీకి బహిరంగంగా హత్య బెదిరింపులు రావడం దేశ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు. టీవీ చర్చా వేదికలో మహదేవ్ చేసిన వ్యాఖ్యలు పొరపాటున వచ్చినవి కావని, ఉద్దేశపూర్వకంగా చేసినవేనని పేర్కొన్నారు. 'ఇది లోక్‌సభ ప్రతిపక్ష నేతలకు ఇచ్చిన అత్యంత భయంకరమైన, దారుణమైన హత్య బెదిరింపు. అధికార పార్టీకి చెందిన అధికార ప్రతినిధి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం రాహుల్ గాంధీ ప్రాణాలకు తక్షణ ముప్పు కలిగించడమే కాకుండా, రాజ్యాంగాన్ని, శాంతిభద్రతలను కూడా బలహీనపరుస్తుంది' అని వేణుగోపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీ భద్రతకు సంబంధించి సీఆర్‌పీఎఫ్ ఇప్పటికే పలుమార్లు హెచ్చరికలు జారీ చేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు రాసిన లేఖ కూడా మీడియాకు లీక్ కావడం వెనుక ఉన్న ఉద్దేశాలపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. 'బీజేపీ సృష్టించిన విద్వేషపూరిత వాతావరణం కారణంగానే వారి నేతలు ఇలాంటి బెదిరింపులకు పాల్పడేంత ధైర్యం చేస్తున్నారు. దీని వెనుక పెద్ద కుట్ర దాగి ఉంది' అని కేసీ వేణుగోపాల్ ఆరోపించారు. వీటిపై ప్రభుత్వం తక్షణం స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే, ఈ హింసను మీరు ప్రోత్సహిస్తున్నట్లుగానే భావించాల్సి ఉంటుందని అమిత్ షాకు రాసిన లేఖలో వేణుగోపాల్ స్పష్టం చేశారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన కుటుంబం నుంచి వచ్చిన రాహుల్‌గాంధీకి ఇలాంటి బెదిరింపులు రావడం ప్రజాస్వామ్య స్ఫూర్తిపై జరిగిన దాడిగా అభివర్ణించారు. రాహుల్‌గాంధీని లక్ష్యంగా చేసుకుని ప్రింటు మహదేవ్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపడింది. బీజేపీ– ఆర్‌ఎస్‌ఎస్‌పై తన దాడిని తీవ్రతరం చేసింది. సైద్ధాంతిక యుద్ధంలో ఓడిపోతున్న వారు, వారి దొంగతనం బయటపడిన వారు ప్రతిపక్ష నాయకుడి నోరు మూయించడానికి కుట్ర పన్నుతున్నారని ఆరోపణలు గుప్పించింది. మహదేవ్ వ్యాఖ్యలు హేయమైనవి, హత్య బెదిరింపు అని కాంగ్రెస్ మీడియా సెల్ ఇన్‌చార్జి పవన్ ఖేరా ధ్వజమెత్తారు. తక్షణమే అతడిపై చట్టప్రకారం కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## సంక్షిప్తంగా..

### నేను ఎక్కడికి పారిపోను : నేపాల్ మాజీ పిఎం ఓలి



**కఠ్మాండూ, సెప్టెంబరు 29:** ఇటీవల నేపాల్‌లో జరిగిన జెన్–జెడ్ ఆందోళనల నేపథ్యంలో నేపాల్ మాజీ ప్రధాని కెపి శర్మ ఓలి దేశం వీడి వెళ్లనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ వార్తలపై ఓలీ స్పందిస్తూ తనపై జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. తాను దేశం విడిచి ఎక్కడికీ పారిపోనన్నారు. ఎటువంటి ఆధారంలేని ఈ ప్రభుత్వానికి దేశాన్ని అప్పజెప్పి తాను పారిపో తానని అనుకుంటున్నారా? అని పార్టీ యువ విభాగాన్ని ప్రశ్నించారు. ప్రస్తుత ప్రభుత్వం తన భద్రత, అధికారిక హక్కులను రద్దుచేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తాను ఎవరికీ భయపడనని దేశంలోనే ఉండి తన రాజకీయ పోరాటాన్ని కొనసాగిస్తానని ఓలీ అన్నారు. దేశంలో శాంతిభద్రతలు, రాజ్యాంగ పాలనను తిరిగి పునరుద్ధరించడానికి కట్టుబడి ఉన్నాన న్నారు. సుశీలా కార్కి నేతృత్వంలోని పరిపాలనకు ఎటువంటి చట్టబద్ధత లేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజల తీర్పుతో కాకుండా విధ్వంసం శక్తుల ద్వారా అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. ఇప్పటికి కూడా తనకు బెదరింపు సందేశాలు వస్తున్నాయన్నారు. నిరసనకారులు తన నివాసాన్ని ధ్వంసం చేయడంతో ప్రస్తుతం గుండు ప్రాంతంలోని అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నట్లు తెలిపారు.

## 'సర్'తో ప్రజల హక్కులకు హాని కలిగించొద్దు

### ఎన్నికల సంఘాన్ని కోరుతూ కేరళ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం



**తిరువనంతపురం, సెప్టెంబరు 29:** ప్రతిపాదిత ఓటర్ల జాబితా ప్రత్యేక అత్యవసర సవరణ (ఎస్ఐఆర్)పై సందేహాలను వ్యక్తం చేస్తూ, ప్రజల హక్కులకు హాని కలిగించే చర్యలకు ఉండాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరుతూ కేరళ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఓటర్ల జాబితాను న్యాయంగా, పారదర్శకంగా సవకరించాలని కోరింది. ఓటర్లకు నిర్దేశించిన అర్హత నిబంధనలపై కేరళ అసెంబ్లీ తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేసింది. అలాగే పౌరసత్వాన్ని మతం ఆధారితంగా చేయడానికి ప్రయత్నించే పౌరసత్వ చట్టాన్ని పునరుజ్జీవించజేయడానికి ప్రయత్నిస్తున్న విభాగాలు ఎస్ఐఆర్‌ని ఏవిధంగా ఉపయోగిస్తారని, ఇది ప్రజాస్వామ్యానికి అది పెద్ద సవాల్ అని తీర్మానం పేర్కొంది. మైనారిటీ వర్గాలు, మహిళలు, పేద కుటుంబాలు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ప్రవాస భారతీయుల ఓటింగ్ హక్కులపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని అభిప్రాయం వ్యక్తం చేసింది. కేరళలో ఓటర్ల జాబితా ప్రత్యేక అత్యవసర సవరణ చేపట్టేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధమవుతున్న క్రమంలో.. ఆ రాష్ట్రంలోని అధికార లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్), ప్రతిపక్ష యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) కలిసి అందుకు వ్యతిరేకంగా ఏకగ్రీవ తీర్మానం చేశాయి. ముఖ్యమంత్రి పినరయి విజయన్ అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆ తీర్మానానికి ప్రతిపక్ష కూటమి మద్దతు తెలిపింది. దాంతో తీర్మానం ఏకగ్రీవంగా సభ ఆమోదం పొందింది. ఎన్నికల జాబితాలో ప్రత్యేక అత్యవసర సవరణ అనేది దేశంలో నేషనల్ పాపులర్ రిజిస్టర్ (ఎన్‌పీఆర్) అమలుకు వెనుక ద్వారం లాంటిదని తీర్మానంలో పేర్కొంది. కాగా కేరళ, పశ్చిమబెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడ్డాయని, ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో అధికార బీజేపీకి లబ్ధి చేకూర్చే ప్రయత్నం చేస్తోందని దేశంలోని విపక్ష పార్టీల నేతలు విమర్శిస్తున్నారు.

## పాక్‌కు వ్యతిరేకంగా పిఒకెలో భారీ ఆందోళన




**ముజఫరాబాదల్, సెప్టెంబరు 29:** పాకిస్థాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్‌లో అక్కడి ప్రజలు భారీ ఆందోళనలు చేపట్టారు. అవామీ యాక్షన్ కమిటీ (ఎఎసి) నేతృత్వంలో కొనసాగుతున్న ఈ నిరసనలను మరింత ఉధృతం చేయనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. పాక్ ప్రభుత్వం దశాబ్దాలుగా తమను రాజకీయంగా, ఆర్థికంగా అణగదొక్కుతున్నట్లు నిరసనకారులు తెలిపారు. 70 యేళ్లకుపైగా పిఒకెలోని ప్రజలకు ప్రాథమిక హక్కులు కూడా కల్పించలేదని అవామీ కమిటీ నేత షౌకత్ నవాజ్ మీర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఒకెలో మౌలిక సంస్కరణలు తీసుకురావాలని, తమ 38 డిమాండ్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 'షటర్–డౌన్.. వీల్–జామ్' పేరుతో అవామీ యాక్షన్ కమిటీ సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ క్రమంలో పిఒకెలోని పలు ప్రాంతాల్లో పౌరులు పాక్ బలవంతపు ఆక్రమణల నుంచి విముక్తి కల్పించాలని నినాదాలు చేస్తూ రోడ్లపైకి వచ్చారు. ప్రభుత్వం తమ డిమాండ్ల విషయంలో చర్చలు జరపడానికి ముందుకు రావాలని అవామీ యాక్షన్ కమిటీ కోరింది. ప్రభుత్వం తమ డిమాండ్లను పట్టించుకోకపోతే నిరసనలను మరింత తీవ్రం చేస్తామని హెచ్చరించింది.

## అసోం బిటిసి ఎన్నికల్లో బోడోపీపుల్స్ ఫ్రంట్ గెలుపు




**న్యూఢిల్లీ,సెప్టెంబరు29:** అస్సాంలో అధికార బీజేపీకి గట్టి షాక్ తగిలింది. 2026లో జరగనున్న రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు సెమీఫైనల్‌గా భావిస్తున్న బోడోలాండ్ టెరిటోరియల్ కౌన్సిల్ (బిటిసి) ఎన్నికల్లో కమలం పార్టీకి ఘోర పరాభవం ఎదురైంది. 40 స్థానాలకు గానూ ఆ పార్టీ కేవలం ఐదు స్థానాల్లోనే గెలుపొందింది. ది బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్ (బీపీఎఫ్) 28 స్థానాల్లో గెలుపొంది అధికారం చేజిక్కించుకుంది. ఇప్పటివరకు బీజేపీ, యునైటెడ్ పీపుల్స్ పార్టీ లిబరల్ (యూపీపీఎల్) కలిసి కౌన్సిల్ పాలనా పగ్గాలు చేపట్టాయి. తాజా ఎన్నికల్లో ఒంటరిగా పోటీచేసిన బీజేపీ.. అతిపెద్ద పార్టీగా లేదా కింగ్‌మేకర్‌గా నిలవాలని భావించింది. అయితే ఆ పార్టీ ఆశలపై ప్రజలు చావుదెబ్బ కొట్టారు.

## రూ. లక్షకోట్లు దాటేస్తున్న ఐపిఒలు..



**న్యూఢిల్లీ,సెప్టెంబరు 29:** భారత ఐపీఓ మార్కెట్ 2025లో సరికొత్త రికార్డుల దిశగా దూసుకెళుతోంది. ఇప్పటికే కంపెనీలు భారీగా నిధులు సమీకరించగా, అక్టోబర్‌లో రానున్న రెండు పెద్ద ఐపీఓలతో ఈ ఏడాది కార్పొరేట్‌రంగంలో లక్ష కోట్ల రూపాయల మైలురాయిని అధిగమించనున్నాయి. ఇది భారత ప్రైమరీ మార్కెట్ల చరిత్రలో మూడోసారి కావడం గమనార్హం. ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి 74 మెయిన్‌బోర్డ్ కంపెనీలు ఐపీఓల ద్వారా సుమారు రూ. 85,000 కోట్లను సమీకరించాయి. అక్టోబర్ నెలలో రానున్న రెండు కీలక ఐపీఓలు ఈ మైలురాయిని అధిగమించేందుకు తోడవుతున్నాయి. టాటా క్యాపిటల్ సంస్థ రూ.16,000 కోట్ల భారీ ఐపీఓతో అక్టోబర్ 6 నుంచి 8 వరకు మార్కెట్లోకి రానుంది. అదేవిధంగా, వీవర్క్ ఇండియా కూడా రూ. 3,000 కోట్ల సమీకరణ లక్ష్యంతో అక్టోబర్ 3నుంచి 7 మధ్య తన ఐపీఓను ప్రారంభించనుంది. ఈ రెండు ఆఫరింగ్‌లతో కలిపి 2025లో మొత్తం నిధుల సమీకరణ రూ. లక్ష కోట్లు దాటనుంది. గతంలో 2021, 2024 సంవత్సరాల్లో మాత్రమే ఐపీఓ మార్కెట్ ఈ ఘనతను సాధించింది. 2021లో 63 ఐపీఓల ద్వారా రూ. 1.19 లక్షల కోట్లు సమీకరించగా, 2024లో 91 ఐపీఓలు కలిసి రూ. 1.6 లక్షల కోట్లు రాబట్టాయి. ఈ ఏడాది ఆ రికార్డులు కూడా బద్దలయ్యే అవకాశాలున్నాయి. ఎల్‌జీ ఇండియా కూడా అక్టోబర్ ప్రథమార్ధంలో రూ. 15,000 కోట్ల ఐపీఓకు సిద్ధమవుతుండటంతో, సమీకరణలు మరింత పెరుగుతాయి. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్, గ్రో, పైన్ ల్యాబ్స్ వంటి మరిన్ని పెద్ద సంస్థలు కూడా ఈ ఏడాది చివరి నాటికి మార్కెట్లోకివచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. కేవలం మెయిన్‌బోర్డ్ ఐపీఓలే కాకుండా, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎస్ఎంఈ) విభాగం కూడా ఈఏడాది అద్భుతమైన పనితీరు కనబరుస్తోంది. 2025లో ఇప్పటివరకు 207 ఎస్ఎంఈ ఐపీఓలు రూ. 9,129 కోట్లు సమీకరించి, గత వార్షిక రికార్డులన్నింటినీ అధిగమించాయి. ఒక్క సెప్టెంబర్ నెలలోనే 53 కంపెనీలు రూ. 2,309కోట్లు సేకరించడం ఈ విభాగానికి సంబంధించి ఆల్‌టైమ్ రికార్డు.

## లారెన్స్‌బిష్ణోయ్ గ్యాంగ్‌ను 'ఉగ్ర'సంస్థగా ప్రకటించిన కెనడా



**న్యూఢిల్లీ,సెప్టెంబరు 29:** మాఫియా గ్యాంగ్‌నడిపిస్తున్న లారెన్స్‌బిష్ణోయ్ ఆతడి గ్యాంగ్‌ను కెనడా ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. కెనడా తన నేరస్మృతి చట్టాలనుఅనుసరించి ఈ నిర్ణయం తీసుకున్నదని ప్రజాభద్రతా మంత్రి గ్యారీ ఆనంద సంగారీ సోమవారం ప్రకటించారు. హత్యలు, దోపిడీలు,ఆయుధాలు, డ్రగ్స్ స్మగ్లింగ్‌తో ఢిల్లీలో నోటోరియస్‌గా మారిన లారెన్స్ బిష్ణోయ్ కెనడాలో ఉన్నట్లు భారత్ అనుమానించిన సంగతి తెలిసిందే. నగదు చోరీనుంచి వాహానాలు,ఆస్థుల ఆక్రమణ వంటివి అన్నింటినీ స్వాధీనంచేసుకుంటామని కెనడియన్ చట్టాలను అను సరించి గ్యాంగ్‌సభ్యులపై వివిధ నేరాలకింద ప్రాసిక్యూట్ చేస్తామని ప్రకటించింది.

# నక్సలైట్లు విముక్తి భారత్ సాధ్యం

## బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి

**విజయవాడ, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** నక్సలైట్లు విముక్తి భారత్ సాధ్యమేనని బీజేపి, జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎస్.విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసారు. ఈ రోజు ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ రీసెర్చ్ ఫౌండేషన్ నిర్వహించిన భారత్ మంథన్" కార్యక్రమంలో పాల్గొని, నక్సల్ రహిత భారతదేశం" అనే అంశంపై ఆలోచనలను పంచుకున్నానని తెలిపారు. ఈ సమావేశంలో, మావోయిస్టు హింస ప్రభావిత ప్రాంతాలు ఎదుర్కొంటున్న సవాళ్లు, వాటిని అధిగమించడానికి వ్యూహాలపై అభిప్రాయాలను పంచుకున్నట్లు పేర్కొన్నారు. పారామిలిటరీ దళాలు, పోలీసుల ప్రభావవంతమైన భాగస్వామ్యం, కఠినమైన చర్యల కారణంగా, నక్సలిజం నేడు దాని ఉనికి చివరి దశలో ఉందన్నారు. కేంద్ర మంత్రి అమిత్ షా ప్రత్యేక అతిథిగా హాజరై, వామపక్ష తీవ్రవాదంపై ఉక్కుపాదం అవసరాన్ని నొక్కి చెప్పారని విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, విశ్వవిద్యాలయ విద్యార్థులు, నక్సలైట్లు బాధితులు పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారని వివరించారు.

# గోరంత చేసి కొండంత చెప్పుకోవడం ముఖ్యమంత్రి చంద్రబాబుకే చెల్లు



**విజయవాడ, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** గోరంత చేసి కొండత చెప్పుకోవడం ముఖ్యమంత్రి చంద్రబాబు చెల్లుతుందని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఆరోపించారు. విజయవాడలో పీసీసీ కార్యాలయం షర్మిల పేరిట సమాచార పత్రం విడుదల చేసింది. కూటమి అధికారంలోకి వచ్చిన 15 నెలల్లో ప్రజలపై మోపిన ట్రూ అప్ భారం రూ.15,780 కోట్లు అని షర్మిల ఆరోపించారు. ఇప్పుడు ట్రూ డౌన్‌తో తగ్గిన భారం కేవలం రూ.923 కోట్లు అన్నారు. 2024- 25 వార్షిక సంవత్సరానికి సర్దుబాటు పేరుతో అదనంగా దోచిన రూ.923 కోట్లను ఈఆర్సీ చెల్లించండని మొట్టికాయలు వేస్తే చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నాడన్నారు. అదేదో కూటమి ప్రభుత్వం ఛార్జీలు తగ్గించిందని చంద్రబాబు చెప్పుకుంటున్నారన్నారు. వినియోగదారులకు భారీ ఉపశమనం ఇచ్చామని, సమర్థత, అనుభవం అని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటు షర్మిల వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఛార్జీల తగ్గింపు హామీని నిలబెట్టుకున్నామని ప్రకటించుకోవడం ఈ శతాబ్దపు అతి పెద్ద జోక్ అన్నారు. నిజంగా చంద్రబాబుకి చిత్తశుద్ధి ఉంటే, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయండి. అమలవుతున్న విద్యుత్తు ఛార్జీల్లో 30 శాతం మేర ఛార్జీలు తగ్గిస్తామని ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండమన్నారు. అదనంగా విధించిన రూ.15 వేల కోట్ల సర్దుబాటు ఛార్జీల భారాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని షర్మిల డిమాండ్ చేశారు.

# చట్టసభల సాక్షిగా సీఎం అబద్ధాలు



**విజయవాడ, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** చట్టసభల సాక్షిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అబద్ధాలను వల్లె వేశారని వైసిపి ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ విమర్శించారు. తాడేపల్లి లోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎనిమిది రోజుల శాసన మండలి సమావేశాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కూటమి ప్రభుత్వాన్ని నిలదీశామని తెలిపారు. అసమర్థ పాలనను కప్పిపుచ్చుకునేందుకు ప్రభుత్వం నానా తంటాలు పడిందన్నారు. రాష్ట్రంలో రైతులు సంతోషంగా ఉన్నారంటూ సిఎం సభలో పేర్కొనడాన్ని తప్పుబట్టారు. యూరియా కొరత, గిట్టుబాటు ధరలపై మంత్రులు నీళ్ల నమిలారని చెప్పారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణపై ప్రభుత్వాన్ని నిలదీశామన్నారు. మంత్రి లోకేష్ పీకుడు భాష, ఎమ్మెల్యే బాలకృష్ణ తాగుబోతు మాటలు వారి సంస్కృతికి అద్దం పడుతున్నాయని పేర్కొన్నారు. శాసనమండలి ఛైర్మన్‌కే ప్రొటోకాల్ పాటించకుండా అవమానించిందని తెలిపారు. సూపర్ సిక్స్‌పై శాసనమండలిలో ఆరుగురు మంత్రులు మాట్లాడారని, వారికి సూపర్ సిక్స్, సూపర్ ఫ్లాప్ అని తెలుసని, అయినా ప్రభుత్వాన్ని సమర్థించుకునేందుకు అడ్డగోలుగా మాట్లాడారన్నారు. 6 హామీల్లో ఒక్కటి కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. స్టీల్ ప్లాంట్‌పై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు.



# శ్వేత కమలాలతో పూజ ద్వారా సరస్వతీ దేవి అనుగ్రహం

**రాపూరు (నెల్లూరు), సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** నవరాత్రులలో పంచమీ రోజున శ్వేత కమలాలతో పూజ చేయడం ద్వారా సరస్వతీ దేవి అనుగ్రహం లభిస్తుందని భగవతి కరుణామయి శ్రీశ్రీశ్రీ విజయేశ్వరీ దేవి తెలిపారు. పెంచలకోనలోని శ్రీ మాతృదేవి విశ్వశాంతి ఆశ్రమంలోని మణిద్వీప మహా సంస్థానంలో నిర్వహిస్తున్న దేవి నవరాత్రి ఉత్సవాలలో 8వ రోజైన సోమవారం శ్రీ లలితాంబికా దేవి, శ్రీ మహాలక్ష్మీదేవి, శ్రీ మహాసరస్వతీదేవిలకు, శ్రీ మహా గణపతి, శ్రీ సుబ్రమణ్యేశ్వరల స్వాములకు వేదపారాయణం, శ్రీ మహా రుద్రాభిషేకం, శ్రీ లలితాంబికాదేవి, శ్రీ మహా లక్ష్మీదేవి, శ్రీ మహా సరస్వతీ దేవిల ఉత్సవ మూర్తులకు ఆశ్రమ వ్యవస్థాపకరాలు భగవతి కరుణామయి శ్రీశ్రీశ్రీ విజయేశ్వరీ దేవి తన స్వహస్తాలతో అభిషేకాలు, విశేష అర్చనలు, కమలార్చనలు, మహా మంగళ హారతులు నిర్వహించి, భక్తులకు దేవి నవరాత్రుల ప్రాముఖ్యతను అనుగ్రహ బాషణం చేశారు. అనంతరం ఆశ్రమంలోని యాగశాలలో శ్రీ మహాగణేశ హోమం, శ్రీ లలితా సహస్రనామ హోమం, శ్రీ ఛండీ హోమం, నవగ్రహ శాంతి హోమం, శ్రీ లక్ష్మీ నృసింహ హోమం, శ్రీ సరస్వతి సూక్త హోమం, శ్రీ మేధా సూక్త హోమం, శ్రీ సుదర్శన హోమం, శ్రీ ధన్వంతరి హోమాలు నిర్వహించి భగవతి విజయేశ్వరీ దేవి పూర్ణాహుతిని హోమగుండాలలో సమర్పించారు. సాయంత్రం మణిద్వీప మహా సంస్థానంలో సామూహిక శ్రీ లలితా సహస్రనామ కుంకుమార్చన చేశారు. శ్రీ లలితాంబికా దేవికి శ్రీ మహా సరస్వతి దేవి అలంకారం నిర్వహించి, హంస వాహనంపై ఆశ్రమంలోని మాఢవీదులలో క్షేత్రోత్సవం నిర్వహించారు.



# అమరావతిలో వాతావరణ మార్పులపై సమగ్ర అధ్యయనం

- అధ్యయనం చేస్తున్న ఇక్లీ
- వచ్చే అక్టోబర్ నెలాఖరుకు నివేదిక

**విజయవాడ, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతి నగరంలో వాతావరణంపై సమగ్ర విశ్లేషణ జరుగుతోంది. వాతావరణ మార్పులకు సంబంధించి గత వాతావరణ గణాంకాలను ఇక్లీ సంస్థ సిబ్బంది విశ్లేషిస్తున్నారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ సూచన మేరకు రాజధాని నగరానికి సంబంధించి వాతావరణ మార్పులపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధమవుతోంది. 2058 నాటికి వాతావరణ మార్పుల కారణంగా సంభవించే దుష్ఫలితాలను నివారించేందుకు సీఆర్డీఏ తయారు చేయిస్తోంది. కర్బన ఉద్గారాలను కనిష్ఠ స్థాయికి తీసుకెళ్లాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. బహుళ జాతి సంస్థ అయిన ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఫర్ లోకల్ ఎన్విరాన్‌మెంట్ ఇనిషియేటివ్స్ (ఇక్లీ) ఆధ్వర్యంలో గత నాలుగు నెలలుగా అధ్యయనం సాగుతోంది. అక్టోబరు చివరి నాటికి పూర్తి నివేదికను సమర్పించనుంది. లక్ష్యాలను చేరుకునేందుకు పలు సిఫార్సులను సైతం చేయనుంది. ఉష్ణోగ్రతలు, వర్షపాతం, వాయు నాణ్యతపై ప్రభావం గురించి తెలుసుకునేందుకు ఈ ప్రక్రియ సాగుతోంది. వార్షిక సగటు ఉష్ణోగ్రత ప్రతి ఏటా 0.22 డిగ్రీల సెంటిగ్రేడ్ చొప్పున పెరుగుతోంది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు ప్రతి దశాబ్దానికి 0.2 డిగ్రీల సెంటిగ్రేడ్ మేర పెరుగుదల కనిపిస్తోంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా ప్రతి దశాబ్దానికి 0.32 డిగ్రీల సెంటిగ్రేడ్ చొప్పున పెరుగుతున్నాయి. అమరావతిలో భూమి ఉపరితల సగటు ఉష్ణోగ్రత 32.74 డిగ్రీల సెంటిగ్రేడ్. రాజధానిని హరిత, నీలి నగరంగా అభివృద్ధి చేయాలన్నది బృహత్ ప్రణాళికలో లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. అధిక ఉష్ణోగ్రతలు తగ్గించేందుకు ఇది ఉపయోగపడనుంది. ఖాళీ స్థలాలు, రహదారుల వెంబడి పచ్చదనం పెంచితే భూమి ఉపరితల ఉష్ణోగ్రత 1.5 డిగ్రీల సెంటిగ్రేడ్ మేర తగ్గే అవకాశం ఉందని అధ్యయనంలో గుర్తించారు. పచ్చదనం తక్కువగా ఉన్న అనంతవరం, లింగాయపాలెం, నేలపాడు, వెంకటపాలెం, నవులూరులో అధిక ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యే అవకాశం ఉందని తేలింది. 2015 -2024 కాలంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏటా 4.5 మిల్లీమీటర్ల చొప్పున వార్షిక వర్షపాతం పెరుగుతోంది. పెరుగుదల ప్రధానంగా నైరుతి రుతుపవనాల్లో కనిపించింది. వర్షం పడే రోజులు తగ్గుతున్నాయి. ప్రతి దశాబ్దానికి 2.6 రోజుల చొప్పున తరుగుదల నమోదైంది. కానీ వర్ష తీవ్రత మాత్రం పెరుగుతోంది.

రాజధానికి సంబంధించి నీటి సరఫరా, వృథా నీరు, వర్షపు నీరు, ఘన వ్యర్థాలు, రవాణా, విద్యుత్తు, భవనాలు, ఆరోగ్యం, హరితం, జీవవైవిధ్యం, గాలి నాణ్యత అంశాలపై ఇక్లీ ముమ్మరంగా అధ్యయనం చేస్తోంది. వీటికి సంబంధించి ప్రస్తుత పరిస్థితులు, 2058 నాటికి వాతావరణ మార్పుల కారణంగా తలెత్తే సమస్యలను ఎలా అధిగమించాలన్న దానిపై సూచనలు కూడా ఇవ్వనుంది. ప్రకాశం బ్యారేజి నుంచి అమరావతికి మొదటి దశలో 386 లీలీదీ నీరు, వైకుంఠపురం నుంచి రెండో దశలో 539 లీలీదీ చొప్పున 2058 నాటికి మొత్తం 925ఎంఎల్‌డీ నీరు అవసరమవుతుందని అంచనా. 15 శాతం మేర నీటి నష్టాలు ఉంటాయని సర్వే అధికారులు లెక్కగట్టారు.

2058 నాటికి వృథా నీరు 723 వస్తుందని, ఈ నీటిని శుద్ధి చేసేందుకు 12 ఎస్‌టీపీ, 1సీఇటీపీ నిర్మించాల్సి ఉంది. శుద్ధి చేసిన నీటిలో పచ్చదనం కోసం వినియోగించుకోవచ్చు. రాజధాని నగరంలో 2058 నాటికి రోజుకు 3,956 టన్నుల మేర ఘన వ్యర్థాలు పోగయ్యే అవకాశం ఉంది. ఇందులో తడి చెత్త 2,028 టన్నులు కాగా, పొడి చెత్త 1,436 టన్నులు. ఈ వ్యర్థాలను శుద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం రాజధానిలో విద్యుత్తు వినియోగం 220.5 మిలియన్ కిలోవాట్ అవర్. 2058 నాటికి డిమాండ్ 10,756 మిలియన్ కిలోవాట్ అవర్‌కు చేరుకోవచ్చని అధ్యయనంలో గుర్తించారు. సౌరవిద్యుత్తు డిమాండ్ 7,954 మిలయన్ కిలోవాట్ అవర్‌గా ఉంటుందని అంచనా.



# రాష్ట్రం నుంచి పండుగల ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** ప్రస్తుత దసరా, దీపావళి, చాత్ పండుగల సమయంలో ప్రయాణీకుల సౌకర్యార్థం రైల్వే శాఖ పండుగ ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వేవర్గాలు తెలిపాయి. తిరుపతి నుంచి హిస్సార్ వెళ్ళే నెంబర్ 07717 ప్రత్యేక రైలును అక్టోబర్ 01 నుంచి నవంబర్ 26 వరకు నడుపుతున్నట్లు తెలిపారు. అలాగే హిస్సార్ నుంచి తిరుపతి వెళ్ళే నెంబర్ 07718 రైలును అక్టోబర్ 05 నుంచి నవంబర్ 30 వరకు పడుతున్నారన్నారు. ఈ రైలు సర్వీసులు తెలుగు రాష్ట్రాల్లో రేణిగుంట, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, డోన్, కర్నూలు, గద్వాల, మహబూబ్ నగర్, జడ్చర్ల, కాచిగూడ, మల్కాజిగిరి, మేడ్చల్, కామారెడ్డి, నిజామాబాద్, బాసర, ధర్మాబాద్ స్టేషన్లతోపాటు, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లోని ముఖ్యమైన స్టేషన్‌లలో నిలుస్తాయి.

### నర్సాపూర్- బెంగళూరు ప్రత్యేక రైళ్లు

నర్సాపూర్ నుంచి బెంగళూరు వెళ్ళే నెంబర్ 07153 ప్రత్యేక రైలు అక్టోబర్ 3 నుంచి డిసెంబర్ 26 వరకు, బెంగళూరు నుంచి నర్సాపూర్ వెళ్ళే నెంబర్ 07154 రైలు అక్టోబర్ 4 నుంచి డిసెంబర్ 27 వరకు తిరుగుతాయి. ఈ రైళ్లు మార్గమధ్యంలో రాష్ట్రంలో పాలకొల్లు, విరసవరం, భీమవరం జంక్షన్, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కుప్పం తోపాటు, తమిళనాడు, కర్ణాటకలోని ముఖ్యమైన స్టేషన్‌లలో నిలుస్తాయి.



# సెల్ ఇవ్వలేదని సూసైడ్

**ఎమ్మిగనూరు క్రైం, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణంలోని వెరటాపురం కాలనీ నందు చోటు చేసుకుంది.. వివరాల్లోకి వెళితే.. కాలనీలో నివాసం ఉంటున్నా శేఖర్, శారదకు ఒక కుమారుడు, ఒక కుమార్తె సంతానం. శేఖర్ దసరా సెలవులు కావడంతో ఇంట్లో ఉన్న కుమారుడు పవన్(10) అతిగా సెల్‌ఫోన్ చూస్తూ ఉండటంతో గమనించిన తల్లితండ్రులు మందలించారు. మనస్థాపం చెంది బాత్రూంలోకి వెళ్లి తాళం వేసుకున్నాడు. విషయం గమనించి బాత్రూం తలుపును పగలకొట్టి చూస్తే లోపల పవన్ ఉరికి వేలాడుతున్నాడు. బాలుడిని దించి హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి బాలుడు మృతి చెందినట్టు ధ్రువీకరించారు. దీంతో కొడుకు ఆత్మహత్యను తట్టుకోలేని తల్లిదండ్రులు గుండెలవిసేలా కన్నీరుమున్నీరుగా విలపించారు.

# వర్షాకాలంలో రైలు మార్గాల నిర్వహణపై అప్రమత్తంగా ఉండండి

## రైల్వే భద్రతా సమీక్షలో ఎస్‌సీఆర్ జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ




**గుంతకల్లు రైల్వే, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** ప్రస్తుత వర్షాకాలంలో రైలు మార్గాల నిర్వహణను నిత్యం అప్రమత్తంగా ఉంటూ సమర్థవంతంగా ఎదుర్కోవాలని దక్షి ణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ అన్నారు. సోమవారం రైల్ నిలయం నుండి రైల్వేజోన్ పరిధిలోని వివిధ డివిజన్లలో రుతుపవనాల ప్రభావంపై రైల్వే సిబ్బంది సన్నద్ధత, భద్రతపై ఆయన సమీక్షించారు. జోన్‌కు చెందిన వివిధ విభాగాల ప్రధాన అధికారులతోపాటు గుంతకల్లు డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, అదనపు డిఆర్ఎం సుధాకర్‌లతోపాటు, సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, నాందేడ్ డివిజన్‌లకు చెందిన డిఆర్ఎంలు, ఆయా విభాగాలకు చెందిన సంబంధిత ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజయ్ కుమార్ శ్రీవాత్సవ మాట్లాడుతూ వర్షాకాలంలో వంతెనలు, చెరువుగట్లు, సొరంగాలు వాటి నిర్వహణ స్థితిపై ప్రాథమికంగా దృష్టి సారించాలని సూచించారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు అవసరమైన ఇసుక, బండరాళ్లు, పైపుల వంటి అవసరమైన వస్తుసామగ్రి, నిల్వలను కూడా ఆయన సమీక్షించారు. భారీవర్షాలు కురిసినపక్షంలో ప్రమాదానికి గురయ్యే వంతెనలు ట్యాంక్ బండ్‌ల వద్ద రేయింబవళ్లు పర్యవేక్షించేందుకు గాను పెట్రోలింగ్ సిబ్బందిని నియమించాలని ఆయన అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన తక్షణ చర్యలు చేపట్టేందుకు ఇరవైనాలుగు గంటలు రైలుమార్గాలను పహారాకాస్తూ, పర్యవేక్షించాల్సిన అవసరం ఉందన్నారు. సైడ్ వాటర్ డ్రెయిన్లు, వాటర్‌వేలను శుభ్రపరచడంతోపాటు రైలుకమ్మిలపై వరదనీరు ప్రవహించకుండా, రైళ్ల సాఫీగా తిరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరికరాల సురక్షితమైన పని విధానాలను, రైలు కార్యకలాపాలకు సంబంధించిన రిజిస్టర్ల సరైన నిర్వహణ, అవసరమైన అన్ని వర్షాకాల జాగ్రత్తలు చేపట్టాలని ఆయన అధికారులకు, సిబ్బందికి సూచించారు. పర్యవేక్షక సిబ్బంది జోన్ స్థాయి కార్యాచరణను నిరంతరం పర్యవేక్షించాలని, ఏవైనా సమస్యలు ఉత్పన్నం అయిన పక్షంలో తక్షణమే హాజరు కావాలని, వీలైనంత త్వరగా పరిస్తితిని సరిదిద్దాలన్నారు. గ్రూప్ మీటింగ్‌లు, వ్యక్తిగత కౌన్సెలింగ్ సెషన్‌ల ద్వారా భద్రతా కేటగిరీ సిబ్బందికి క్రమం తప్పకుండా అవగాహన కల్పించాలని ఆయన అధికారులకు సూచించారు.



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న సిఎం చంద్రబాబు దంపతులు

# వైభవంగా దసరా ఉత్సవాలు

- దుర్గమ్మ వారికి సిఎం పట్టువస్త్రాల సమర్పణ
- 1,44,000 మంది భక్తులకు దర్శనం
- విజయదశమిన దర్శన టిక్కెట్లు రద్దు
- అమ్మవారి సేవలో పలువురు వీఐపీలు



డికె శివకుమార్‌కు జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం



మంత్రి కొలుసు పార్థసారధికి దుర్గమ్మవారి జ్ఞాపిక

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** అమ్మల గన్న అమ్మ బెజవాడ దుర్గమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. దుర్గమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీసమేతంగా పట్టువస్త్రాలు తీసుకొచ్చి శ్రీ అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా పూర్ణకుంభ స్వాగతం పలికి మంత్రులు, అధికారులు ముఖ్యమంత్రి దంపతులను ఆలయంలోకి తీసుకెళ్ళారు. దుర్గమ్మవారికి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించిన అనంతరం సిఎం దంపతులకు శ్రీ అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

### శ్రీ సరస్వతి మాతగా దుర్గమ్మ

దసరా ఉత్సవాల్లో శ్రీ అమ్మవారి జన్మనక్షత్రం మూలా నక్షత్రం సందర్భంగా శ్రీ సరస్వతి దేవిగా దర్శించుకునే భక్తులకు విజయవంతంగా సేవలందించి వారి మన్ననలందుకున్న అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. శ్రీ సరస్వతి మాతగా దుర్గమ్మవారు భక్తులను అనుగ్రహించారు. రాత్రి 8 గంటల వరకు ఒకలక్ష 44వేల మంది భక్తులు దుర్గమ్మను సోమవారం దర్శించుకున్నారు. కలెక్టర్ లక్ష్మీషా, విజయవాడ సిపి రాజశేఖర్‌బాబు, కమీషనర్ రామచంద్రమోహన్, ఇఓ వికె శీనా నాయక్ ఏర్పాట్లు ఎప్పటికపుడు పరిశీలించారు. అమ్మవారి దర్శనానికి భక్తుల సంఖ్య అంతకంతకు పెరుగుతుండడంతో మూలానక్షత్రం రోజున సోమవారం నాడు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. దుర్గమ్మవారి ఆలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆధ్యాత్మిక ఆనందంలో భక్తులను ఓలలాడించాయి. సాయంసంధ్యాకాలంలో శ్రీ గంగాభవాని సమేత మల్లేశ్వర స్వామివార్ల నగరోత్సవం వైభవంగా జరిగింది. నగర వీధుల్లో విహరిస్తూ శ్రీ స్వామి అమ్మవార్లు భక్తులను కటాక్షించారు. కమీషనర్ రామచంద్రమోహన్ పాల్గొన్నారు.

### దుర్గమ్మవారి సేవలో విఐపిలు

దుర్గమ్మవారిని సోమవారం శ్రీ సరస్వతిదేవి అవతారంలో కర్ణాటక ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్, ఏపి శాసనసభ డిప్యూటి స్పీకర్ కె రఘురామకృష్ణంరాజు, మంత్రులు కొలుసు పార్థసారధి, కొల్లు రవీంద్ర, ఎంపి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, నక్కా ఆనందబాబు, తదితర ప్రముఖులు దర్శించుకున్నారు.

### విజయదశమిన దర్శన టికట్లు రద్దు

విజయ దశమిన దుర్గమ్మవారి దర్శనానికి టికెట్లు అని న్నిటిని రద్దు చేస్తున్నట్లు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు దుర్గమ్మవారిని ఈ దసరా ఉత్సవాల్లో సుమారు 8లక్షల మంది భక్తులు దర్శించుకున్నారని చెప్పారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు.



మహాగౌరి అలంకారాల్లో అమ్మవారు




శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల కిటకిట

# దుర్గాష్టమి వేళ... అమ్మవారి ఆలయాలకు పోటెత్తిన భక్తజనం

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** 'దుర్గాష్టమి. సోమవారం. సాధారణంగానే దుర్గాష్టమి రోజు ఆలయాలకు భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. సోమవారం దుర్గాష్టమి రావటంతో శ్రీకాళహస్తీశ్వరాలయంతో పాటు అనుబంధ ఆలయాలు శక్తి ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి. ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు 'దుర్గమ్మ మాల ధరించి' కనబడ్డారు. ఎర్రటి చీరల్లో వారు దర్శనమిచ్చారు.

### కొండదిగిన జనం... కైలాసనాథుని దర్శనం

శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధి సోమవారం భక్తజనంతో కిటకిట లాడింది. తిరుమలేశుని గరుడవాహన సేవలకు కదలి వచ్చిన జనం సోమవారం ఉదయం కైలాసనాథుని దివ్యదర్శనానికి పోటెత్తారు. సాధారణంగానే సోమవారం శ్రీకాళహస్తీశ్వరాలయం రద్దీగా ఉంటుంది. అలాంటిది ఆదివారం రాత్రి తిరుమలేశుని గరుడవాహన సేవ రావటంతో అక్కడ దర్శనం చేసుకున్న భక్తులు కదలి వచ్చారు. దాంతో సోమవారం ఉదయం భోళాశంకరుని సన్నిధి కిటకిట లాడింది. శివయ్యకు విశేష సంఖ్యలో అభిషేకాలు నిర్వహించారు.

### నిత్యకళ్యాణంకు విశేష స్పందన

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రవేశిస్తే ఎనలేని మధురానుభూతి కల్గుతుంది. ఇక్కడి ఆలయ నిర్మాణామో స్వామి అమ్మవార్ల మహత్మ్యమో కాని ఆలయంలోని కంచుగడప దాటితే ఇక బయటి ప్రపంచం గుర్తుకురాదు. ఆద్మాత్మిక చింతక కల్గుతుంది. ఇక ఆలయంలో ప్రవేశిస్తూనే ఎదురుగా చిన్మయముద్ర కల్గిన గురు దక్షిణామూర్తి దర్శనం లభిస్తుంది. ఇక ఎడమవైపును ఆకాశ గణపతి, ఆకాశ గంగ దర్శనం లభిస్తుంది. పక్కనే స్వామి అమ్మవార్ల విగ్రహాలను ఏర్పాటు చేసి నిత్యకళ్యాణం నిర్వహిస్తున్నారు. సోమవారం ఆలయంలోని స్వామి అమ్మవార్ల నిత్యకళ్యాణోత్సవానికి విశేష స్పందన వచ్చింది. గణపతి పూజలు, నవగ్రహ పూజలు, యజ్ఞోపవేత పూజలు, మాంగల్యధారణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాధికారులు అందించిన సమాచారం మేరకు సుమారు 25వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు సమాచారం.

### విశేష అలంకరణల్లో అమ్మవారు

శ్రీకాళహస్తీశ్వరాలయంలోనూ, అనుబంధ ఆలయాల్లో వెలసిన దేవేరి ఆలయాల్లో వెలసిన మూల విరాట్టులకు నిర్వాహకులు వివిధ రూపాల అలంకారాలు నిర్వహించారు. ఆలయంలోని బొమ్మల కొలువులో దేవేరిజ్ఞాన ప్రసూనాంబ అమ్మవారికి మహాలక్ష్మీ దేవిగా, ముత్యాలమ్మ గుడిలో లలితా దేవి, కనక దుర్గమ్మను మహాలక్ష్మీదేవిగా తీర్చిదిద్దారు. కాగా మహాగౌరి దేవిగా ముస్తాబు చేసారు.

# మన్నెం కళావతికి ఘన సన్మానం

**విజయవాడ, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన మన్నెం కళావతిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సత్కరించారు. ఈ సందర్భంగా శాలువా కప్పి, శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయ బోర్డు డైరెక్టర్‌గా మన్నెం కళావతి నియమితులవడం సంతోషదాయకమని సౌమ్య ప్రశంసించారు. దేవస్థానం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తారని ఆశిస్తున్నా, ఆలయ సేవలు మరింత మెరుగుపరచడంలో ఆమె పాత్ర కీలకమవుతుందని పేర్కొన్నారు.



# కరకట్టలో సామూహిక సరస్వతీ పూజ

**కైకలూరు, సెప్టెంబరు 29 (ప్రభాతవార్త):** చదువుల తల్లి సరస్వతీదేవి తన చల్లని ఆశీస్సులను చిన్నారులందరికీ అందించాలని, అమ్మ దయతో చిన్నారులంతా మంచి విద్యాబుద్ధులు నేర్చుకుని జీవితంలో ఉన్నతమైన స్థితికి చేరుకోవాలని పలువురు పెద్దలు ఆకాంక్షి ంచారు. కైకలూరు వైఎస్ఆర్ కాలనీ (కరకట్ట)లో విజయదుర్గ అమ్మవారి తృతీయ వార్షిక దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు చదువులతల్లిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉత్సవ పందిరిలో చిన్నారులతో సామూహిక సరస్వతి పూజ, కుంకుమార్చన నిర్వహించారు. అర్చకస్వామి యాజ్ఞకత్వంలో సుమారు 120మంది చిన్నారులు అమ్మవారికి కుంకుమార్చన చేశారు.

# ఆ పోస్టులు మాకొద్దు బాబోయ్!


ఖాళీగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కుర్చీలు

## ఒకే నెలలో ఒకరు సస్పెన్షన్... మరొకరు బదిలీ

- అనంత అర్బన్ కార్యాలయంలో రెండు సబ్ రిజిస్టర్ పోస్టులు ఖాళీ
- ఆ పోస్టుల్లోకి రావడానికి వెనకడుగు వేస్తున్న ఇతర సబ్ రిజిస్టర్లు
- అనంత ఆర్వోలోని ప్రస్తుత పరిస్థితిపై జిల్లా వ్యాప్తంగా చర్చ

**అనంతపురం న్యూటౌన్, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జిల్లా కేంద్రంలో పనిచేయడానికి ఇష్టపడతారు. కానీ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలోని సబ్ రిజిస్టర్లు మాత్రం జిల్లా కేంద్రంలో పనిచేయడానికి ఇష్టపడటం లేదు. ఇటీవల ఒక సబ్ రిజిస్టర్ సస్పెన్షన్ కావడం, మరొక సబ్ రిజిస్టర్ ఆకస్మికంగా తాడిపత్రి కి బదిలీ కావడం ఆ శాఖలో తీవ్ర చర్చ కొనసాగుతుంది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలోని అనంతపురం అర్బన్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో జాయింట్ వన్ సబ్ రిజిస్టర్గా పనిచేస్తున్న రమణరావు ఇటీవల పలు తప్పులు చేయడంతో ఈనెల 3వ తేదీ సస్పెన్షన్ అయ్యారు. ఇది జరిగిన నాలుగు రోజులకే మరొక సబ్ రిజిస్టర్ యూనస్‌ను కూడా తాడిపత్రి సబ్ రిజిస్టర్ (ఎఫ్ఎసి)గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే అప్పటి నుంచి ఆ సబ్ రిజిస్టర్‌పై పలు రకాలుగా పలు ఒత్తిళ్లు అధికం అవడంతో వాటిని ఆయన తట్టుకోలేక శనివారం రిలీవ్ అయ్యి సోమవారం తాడిపత్రిలో జాయిన్ అయ్యారు. దీంతో అక్కడే సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఇంద్ర శేఖర్‌కు ఇంచార్జ్ సబ్ రిజిస్టర్‌గా బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతము ఆర్వోలో రెండు సబ్ రిజిస్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టుల్లో పనిచేస్తున్న సబ్ రిజిస్టర్లలో ఒకరు సస్పెన్షన్ అయ్యారు. మరొకరికి పలు ఒత్తిళ్లు రావడంతో బదిలీ అయ్యారు. ఇక్కడ పరిస్థితిని ఆ ఇద్దరు సబ్ రిజిస్టర్లు ఇతర సబ్ రిజిస్టర్లకు చెప్పడంతో ఆ పోస్టులు మాకొద్దు బాబోయ్ అంటున్నట్లు ఆ శాఖలోని సబ్ రిజిస్టర్లు, ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. రెగ్యులర్ సబ్ రిజిస్టర్లు వచ్చేవరకు అనంతపురం రూరల్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఇస్మాయిల్‌కు అదనపు బాధ్యతలు అప్పగించనున్నట్లు ఆ శాఖ ద్వారా అందిన సమాచారం. ఆయన కూడా గతంలో సబ్ రిజిస్టర్ (ఎఫ్ఎసి)గా పనిచేశారు. అప్పుడు కూడా ఆయన పలు ఒత్తిళ్ల వలన అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆయన జాయిన్ అవుతారా? లేదా? అన్నది తెలియాల్సి ఉంది.

### రూరల్లో కూడా అదే పరిస్థితి

అనంతపురం రూరల్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో గత కొన్ని నెలలుగా రెగ్యులర్ సబ్ రిజిస్టర్ లేరు. ప్రస్తుతము అక్కడే సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న టీజీ రెడ్డి ఇన్‌చార్జ్ సబ్ రిజిస్టర్‌గా కొనసాగుతున్నారు. ఆ పోస్టులోకి రావడానికి కూడా పలువురు సబ్ రిజిస్టర్లు వెనకడుగు వేస్తున్నట్లు తెలిసింది. గతంలో అక్కడ పనిచేస్తున్న సబ్ రిజిస్టర్లకు పలు రకాలుగా ఒత్తిళ్లు రావడంతోనే అందుకు భయపడి రావడంలేదని ఆ శాఖలో తీవ్ర చర్చ కొనసాగుతుంది. రెగ్యులర్ సబ్ రిజిస్టర్ వచ్చేంతవరకు ప్రస్తుతం పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ ఇన్‌ఛార్జ్ సబ్ రిజిస్టర్‌గా కొనసాగనున్నారు. అయితే ఆయన మీద కూడా పలు ఒత్తిళ్లు వస్తుండడంతో చేసేది లేక అలాగే భరిస్తున్నారని అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ఇలా పలు ఒత్తిళ్లతో ఇబ్బందులకు గురవుతున్న సబ్ రిజిస్టర్లు, సీనియర్ అసిస్టెంట్లకు అండగా ఉండాల్సిన ఉన్నతాధికారులు, ఉద్యోగుల సంఘం నాయకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చెందుతున్నారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ల పంపిణీకి

# రూ.2,745.05 కోట్లు విడుదల



- పెన్షన్ లబ్ధిదారులు 63,50,765మంది
- కొత్తగా 10,578మందికి స్పౌజ్ పెన్షన్లు
- స్పౌజ్ పెన్షన్‌ల కోసం అదనంగా రూ.4.23 కోట్లు విడుదల
- రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడి

**విజయవాడ, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీర్ భరోసా పెన్షన్ పథకం కింద అక్టోబర్ ఒకటవ తేదీన 63,50,765 మంది లబ్ధిదారులకు పెన్షన్ మొత్తాన్ని పంపిణీ చేసేందుకు రూ. 2,745.05 కోట్లు గ్రామ, వార్డు సచివాలయాలకు విడుదల చేసిందని రాష్ట్ర సూక్ష్మ చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. కొత్తగా మంజూరైన 10,578 మంది స్పౌజ్ పెన్షన్ లబ్ధిదారులకు అక్టోబర్ 1న పెన్షన్ పంపిణీ చేయడానికి రూ.4.23 కోట్లు కూడా విడుదల చేశామని మంత్రి చెప్పారు. బుధవారం జరిగే పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం దత్తి గ్రామంలో ముఖ్యమంత్రి సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని మంత్రి తెలియజేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మొదటిసారిగా విజయనగరం జిల్లాలో తాను ప్రాతినిధ్యం వహిస్తున్న గజపతినగరం నియోజకవర్గంలో పేదల దినోత్సవ కార్యక్రమంలో భాగంగా పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి పాల్గొనడం ఆనందించదగ్గ విషయమన్నారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన ప్రారంభమైన తర్వాత పెన్షన్ల ద్వారా 45 వేల కోట్ల రూపాయలు లబ్ధిదారులకు అందించామని మంత్రి తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి పింఛన్ల కోసం రూ.32,143 కోట్లు బడ్జెట్ కేటాయించగా, ఇందులో ఏప్రిల్ నుంచి అక్టోబర్ 2025 వరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ల పంపిణీకి రూ.19,111.85 కోట్లు విడుదలయ్యాయని తెలిపారు. దేశంలో మరే రాష్ట్ర ప్రభుత్వం కూడా పెన్షన్ కోసం ఏడాదిలో రూ.10,000 కోట్లకు మించి కేటాయించడం లేదని తెలియజేశారు.

పెన్షన్ పంపిణీ ప్రక్రియ మరింత పారదర్శకంగా ఉండేలా, లబ్ధిదారుల ఇంటి వద్దే పెన్షన్ అందించడం తోపాటు వారి జియోకోఆర్డినేట్స్‌ను కూడా నమోదు చేస్తున్నా మని మంత్రి శ్రీనివాస్ అన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమానికి, అభివృద్ధికి కట్టుబడి ఉందని, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు వంటి నిరుపేద, నిస్సహాయ వర్గాల కష్టాలను తొలగించడానికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకాన్ని ఒక ముఖ్యమైన సంక్షేమ పథకంగా అమలు చేస్తోందని అన్నారు. దేశంలో సామాజిక భద్రతా పెన్షన్ కోసం అత్యధిక మొత్తాన్ని ఖర్చు చేస్తున్నది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమేనని మంత్రి శ్రీనివాస్ తెలియజేశారు.

## తిరువూరు మున్సిపల్ కౌన్సిల్

# సమావేశం రసాభాస

**విజయవాడ, సెప్టెంబరు 29, ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో గందరగోళం నెలకొంది. అధికార, ప్రతిపక్ష సభ్యుల వాగ్వివాదంతో తిరువూరు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం దద్దరిల్లింది. వైసీపీ సభ్యులు ఛైర్ పర్సన్ పోడియాన్ని చుట్టిముట్టి సభను అడ్డుకున్నారు. అజెండాలో పొందుపర్చిన అంశాలపై చర్చ జరగకుండా వైసీపీ సభ్యులు వ్యక్తిగత అంశాలను సభలో లేవనెత్తారు. ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లు వరసగా మూడు కౌన్సిల్ సమావేశాలకు దుమ్మా కొట్టారు. దీంతో ఛైర్ పర్సన్ వారిపై అనర్హత వేటు వేశారు. ఈ క్రమంలో మానవతా దృక్పథంతో తమ ఇద్దరు కౌన్సిలర్ల సభ్యత్వాన్ని పునరుద్ధరించాలంటూ వైసీపీ సభ్యులు చేసిన విజ్ఞప్తిని ఛైర్ పర్సన్ తిరస్కరించారు. వైసీపీ సభ్యుల సభ్యత్వాన్ని ఆమోదించటం లేదని ఛైర్ పర్సన్ చెప్పటంతో సమావేశంలో ఓటింగ్‌కు వైసీపీ సభ్యులు పట్టుబట్టారు. ఓటింగ్‌లో 10 మంది టీడీపీ సభ్యులు వారి సభ్యత్వం పునరుద్ధరణకు వ్యతిరేకంగా ఓటు వేయగా 9 మంది వైసీపీ సభ్యులు అనుకూలంగా ఓటు వేయటంతో మరోసారి వైసీపీ సభ్యులు.. ఛైర్ పర్సన్ పోడియాన్ని చుట్టుముట్టి సభను అడ్డుకున్నారు. ఇద్దరు వైసీపీ సభ్యుల అనర్హత వేటుపై ఓటింగ్‌ను మినిట్స్‌లో రికార్డు చేసి సభ్యులు సంతకాలతో మున్సిపల్ ఉన్నతాధికారుల అనుమతి కోసం డీఎంఏకు అధికారులు నివేదించారు. రానున్న సమావేశాలకు ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లు తమ పదవి కోల్పోయే అవకాశం ఉంది.

## విజయవాడ ఉత్సవం...

# ఆద్యంతం ఆహ్లాదం

**విజయవాడ, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పండుగ వాతావరణాన్ని సృష్టించాయి. రంగుల హరివిలాసంగా సాగిన ఈ వేడుకలు సందర్శకులను అలరించాయి. శాస్త్రీయ నృత్యాలు, సంగీత కచేరీలు, జానపద కళలు, నాటిక ప్రదర్శనలు వరుసగా సాగి ప్రేక్షకులను కట్టిపడేశాయి. రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే ప్రత్యేక నాటికలు ప్రేక్షకుల కరతాళ ధ్వనులతో మారుమోగాయి. వేదికపై నృత్యాలు, సంగీతం, నాటకాలతో సందడి నెలకొంది. విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ ఆధ్వర్యంలో గొల్లపూడి జక్కంపూడి రోడ్డులో ఏర్పాటు చేసిన విజయవాడ ఎగ్జిబిషన్ సాయంత్రం సంగీత వాతావరణంతో సందడిగా మారింది. ప్రసిద్ధ సింగర్, మ్యూజిక్ డైరెక్టర్ రామ్ మిరియాల తన బృందంతో కలిసి ఇచ్చిన లైవ్ మ్యూజిక్ కచేరీ ప్రేక్షకులను అలరించింది. హిట్ సాంగ్స్‌తో పాటు ఉత్సాహభరితమైన బీట్స్‌తో ప్రేక్షకులను అలరించిన రామ్ మిరియాల గాత్రం ఎగ్జిబిషన్ వేదికను కాసేపు సంగీతమయం చేసింది. వేలాది మంది సందర్శకులు ఈ కచేరీని ఆస్వాదిస్తూ కరతాళధ్వనులతో ప్రోత్సహించారు. కుటుంబ సభ్యులతో తరలివచ్చిన సందర్శకులు ఆదివారం ఎగ్జిబిషన్ వేదికను పండుగ వాతావరణంగా మార్చారు. గొల్లపూడి ఎగ్జిబిషన్‌లో ఆదివారం రాత్రి జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను ఎంపి కేశినేని శివనాథ్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, సుంకర అనిల్, తదితరులు ఆసక్తిగా తిలకించారు.

## వడ్డీ వ్యాపారుల నుండి

# రైతులకు విముక్తి

### మనీ లెండింగ్ యాక్ట్ తెచ్చిన సర్కార్

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** తెలంగాణలో వడ్డీ వ్యాపారుల వేధింపుల నుంచి రైతులను రక్షించేందుకు రాష్ట్ర సర్కార్ మనీ లెండింగ్యాక్ట్ తీసుకొచ్చింది. రాష్ట్రంలో ఈ యాక్టు 1349ను కఠినంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేసింది. పంట పెట్టుబడుల కోసం తప్పని సరి పరిస్థితుల్లో అన్నదాతలు వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు రుణాలు తీసుకుంటారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. వడ్డీ వ్యాపారులు వేస్తున్న అధిక వడ్డీభారంతో రైతుల అప్పులు పెరిగిపోతున్నాయని, దీంతో అసలు, వడ్డీ కలిపి చెల్లించలేక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని గతంలో రాష్ట్ర రైతు కమిషన్ ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. దీంతో వాటిని తీర్చలేని అప్పుల ఊబిలో కూరుకుపోతున్న రైతులు గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు తెలిపింది. రైతు కమిషన్ నివేదికలోని పలు అంశాలను పరిగణనలోనికి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం మనీలెండింగ్ యాక్ట్ అమలు కఠినంగా చేయాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలిచ్చింది.

# డైనమిక్ ఫ్లడ్ మేనేజ్‌మెంట్‌తో నీటి వనరుల సంపూర్ణ వినియోగం



- వరద నీటిని ఒడిసి పట్టుకోవాలి
- ప్రతి రిజర్వాయర్, చెరువు నింపాలి
- కృష్ణా, గోదావరి నదుల వరద ఉధృతి
- ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలి
- ప్రకాశం బ్యారేజ్‌కు 7 లక్షల క్యూసెక్కుల వరద వచ్చే చాన్స్
- రిజర్వాయర్లులో నీటి నిల్వలపై అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు

**విజయవాడ, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** డైనమిక్ ఫ్లడ్ మేనేజ్‌మెంట్‌తో నీటి వనరుల సంపూర్ణ వినియోగం జరగాలని సిఎం చంద్రబాబు సూచించారు, వరద నీటిని ఒడిసి పట్టుకుని తాగు, సాగునీటి అవసరాలకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎగువ రాష్ట్రాల నుంచి వస్తున్న వరద ప్రవాహాలను రియల్ టైంలో అంచనా వేస్తూ... అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో నదీ ప్రవాహాలు, రిజర్వాయర్లలో నీటి నిల్వలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రెయిన్ గేజెస్ ద్వారా కురిన వర్షాన్ని లెక్కించి ఫ్లడ్ మేనేజ్‌మెంట్ జరపాలన్నారు. వర్షపాతం, ఎగువ రాష్ట్రాల నుంచి వచ్చే నీటి ప్రవాహాల సమాచారాన్ని విశ్లేషించి సమన్వయంతో అన్ని రిజర్వాయర్లను పూర్తిగా నింపాలని సిఎం సూచించారు. అదే విధంగా సాధ్యమైనన్ని ఎక్కువ చెరువులను నీటితో నింపాలని సూచించారు. కృష్ణా నదిలో ప్రకాశం బ్యారేజ్ వద్ద ప్రస్తుతం 6.57 లక్షల క్యూసెక్కుల వరద ఉందని అధికారులు తెలిపారు. వచ్చిన నీటిని వచ్చినట్లు సముద్రంలోకి పంపుతున్నట్లు వివరించారు. రేపు 7 లక్షల క్యూసెక్కులకు పైగా వరద రావొచ్చని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. శ్రీశైలం నుంచి వస్తున్న వరదతో పాటు తెలంగాణ రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరద వస్తుందని తెలిపారు. అలాగే అటు గోదావరిలో ధవళేశ్వరం వద్ద ప్రస్తుతం 10.12 లక్షల క్యూసెక్కుల వరద ఉందని, ఈ వరద ప్రవాహం పెరిగి 11.50 లక్షల క్యూసెక్కుల వరకు రావచ్చని అధికారులు తెలిపారు. కృష్ణా, గోదావరి నదులకు వస్తున్న భారీ వరద కారణంగా వేల టిఎంసిల నీరు సముద్రంలో కలుస్తోంది. రాష్ట్రంలో అన్ని రిజర్వాయర్లలో కలిపి ప్రస్తుతం 94 శాతం నీటి నిల్వలు ఉన్నాయని అధికారులు తెలిపారు. పైనుంచి ఇంకా వరద వస్తున్న కారణంగా నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కృష్ణానది నుంచి సముద్రంలో ఇప్పటి వరకు 1089 టిఎంసిలు వెళ్లాయని అధికారులు వివరించారు. గోదావరి నుంచి 3251 టిఎంసిలు సముద్రంలోకి వెళ్లాయని అధికారులు అన్నారు. సమర్థ నీటి నిర్వహణ, కాలువల్లో ప్రవాహాలు, చెరువులు నింపే కార్యక్రమం వల్ల భూ గర్భ జలాలు పెరిగినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది భూగర్భ నీటి మట్టం పెరిగినట్లు వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో సరాసరి భూగర్భ నీటి మట్టం 8.43 మీటర్లు ఉందని తెలిపారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది 1.25 మీటర్ల భూగర్భ జలాలు పెరిగినట్లు తెలిపారు. ముఖ్యంగా రాయలసీమలో గత ఏడాది కంటే 2.07 మీటర్లు భూగర్భ జలాలు పైకి వచ్చినట్లు అధికారులు వివరించారు. కృష్ణా, గోదావరి నదుల వరద ప్రవాహం గమనించినప్పుడు నిలకడగా కృష్ణా వరద ఉందని అధికారులు సీఎంకు వివరించారు. ఇప్పటికి ప్రకాశం బ్యారేజ్ వద్ద ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 6,86,074 క్యూసెక్కులు ఉందని సీఎంకు వివరించారు. దీంతో రెండవ ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్నట్లు తెలిపారు.

గోదావరి వరదను భద్రాచలం వద్ద ప్రస్తుతం 44.4 అడుగుల నీటిమట్టం ఉందని తెలిపారు. ధవళేశ్వరం వద్ద ఇన్ ఔట్ ఫ్లో 9,80,447 లక్షల క్యూసెక్కులు ఉందన్నారు. ఇక్కడ మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహారణ జరిగినట్లు తెలిపారు. సహాయక చర్యలకు 2 ఎన్‌డిఆర్ఎఫ్, 3 ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉంచామన్నారు. ఈ క్రమంలో కృష్ణా, గోదావరి నదిపరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. ఇంకా వరదలు, వర్షాలు ఉన్న కారణంగా... నీటి సమర్థ వినియోగానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సిఎం సూచించారు. చెరువులు నింపడంతో పాటు భూగర్భ జలాల పెంపునకు అవసరమైన అన్ని ప్రణాళికలు అమలు చేయాలని ఆదేశించారు. మరోవైపు వరదల కారణంగా ముంపు ఉండే ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడు సమాచారంతో అప్రమత్తం చేయాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆయా శాఖల అధికారులు సమన్వయంతో ప్రజలకు అవసరమైన సహాయం అందించాలని సూచించారు. ఆన్‌లైన్ విధానంలో జరిగిన ఈ సమీక్షలో ఇరిగేషన్ శాఖ అధికారులు, ఆర్టీజీఎస్ అధికారులు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్‌లో మైక్రో బ్రూవరీ

- మంత్రివర్గ ఉపసంఘం భేటీలో చర్చ
- డిజిటల్ పేమెంట్లకు ప్రోత్సాహం
- ప్రీమియం స్టోర్స్ ఏర్పాటుపై సమాలోచన




**విజయవాడ, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** విభిన్న ఎక్సైజ్ అంశాలపై సోమవారం మంగళగిరి ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో మంత్రివర్గ ఉపసంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఖనిజ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధ్యక్షత వహించారు. ఆహార, పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ హాజరయ్యారు. ఎంఎస్ఎంఈ, ఎస్ఈఆర్పీ, ఎన్ఆర్ఐ వ్యవహారాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. సమావేశంలో బార్ ఏఆర్ఈటీ సమస్యపై చర్చ జరిగింది. మైక్రో బ్రూవరీ విధానం, డిజిటల్ పేమెంట్ల ప్రోత్సాహం, ప్రీమియం స్టోర్స్ ఏర్పాటు అంశాలు కూడా పరిశీలించారు. ప్రభుత్వం ఎక్సైజ్ రంగంలో పారదర్శకత, ఆధునికత, బాధ్యతాయుత వినియోగం కోసం ముందడుగు వేస్తోందని ఈ చర్చలు సూచించాయి. నియంత్రణతో పాటు వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త విధానాలు రూపొందించాలని మంత్రులు అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి (ఎక్సైజ్, మైన్స్, సాధారణ పరిపాలన శాఖ -పొలిటికల్) ముఖేష్ కుమార్ మీనా, ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్ చామకూరి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ పాల్గొన్నారు. అధికారులు సంబంధిత నివేదికలు సమర్పించి, అమలు విధానాలపై మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో వివరించారు.

# 12న విజయవాడలో ఒబిసిల సదస్సు

### చట్టసభల్లో రిజర్వేషన్‌లు సాధిస్తాం: ఎంపి ఆర్.కృష్ణయ్య ధీమా



**హైదరాబాద్(సైఫాబాద్), సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** దేశ జనాభాలో సగానికిపైగా ఉన్న బిసిలకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో 50 శాతం రిజర్వే షన్‌లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అక్టోబరు 12న విజయవాడలో ఒబిసిల జాతీయస్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని రా జ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలి పారు. ఈ మేరకు సోమ వారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో దక్షిణ భారత బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు జబ్బాల శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సదస్సుకు సంబం ధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళకు చెందిన వేలాది మంది ఒబిసిలు పాల్గొంటారని చెప్పారు. ముఖ్య అతిథులుగా నలుగురు కేంద్ర మంత్రులు, మేధావులు, ప్రొఫెసర్లు, 20 మంది వివిధ పార్టీలకు చెందిన ఎంపిలు పాల్గొంటారని తెలిపారు. ఈ సదస్సు తరువాత హైదరాబాద్, బెంగళూరు, తమిళనాడు, ఢిల్లీలోనూ ఒబిసిల జాతీయ సదస్సులు నిర్వహించి ఒబిసిల సత్తా తెలియజేస్తామన్నారు. కుల గణన తరువాత అన్ని రంగాల్లో ముఖ్యంగా ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్యా, ఉద్యోగరంగాల్లో జనాభా ప్రాతిపదిక వాటా లభిస్తుందని, అన్ని కోణా ల్లో కులగణన తర్వాత సమాజంలో విప్లవాత్మక మార్పు వస్తుందన్నారు.



## లింగాలలో ఉచిత వైద్య శిబిరం

**మండవల్లి, సెప్టెంబర్ 29 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని లింగాల గ్రామం సచివాలయంలో ఏర్పాటు చేసిన గ్రామసర్పంచ్ బోయిడి ధానలక్ష్మి శ్రీ సురేష్ బాబు ఆధ్వర్యంలో సోమవారం ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. సేవ పక్షోత్సవాలు కార్యక్రమంలో భాగంగా కూటమి నేత చాపరాల దుర్గాప్రసాద్ రక్తదాన శిబిరం ప్రారంభించారు. అనంతరం యువకులు 20 మంది రక్తదానం చేసారు. గ్రామంలోని ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కుటుంబ సంక్షేమ వైద్య ఆరోగ్య శాఖల ద్వారా రెండు వారాల పాటు సేవ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఉద్దేశంతో ప్రధాని నరేంద్ర మోడీ దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి డాక్టర్ ఎన్ పవిత్ర, జిల్లా వైస్ ప్రెసిడెంట్ సమయం ఏసుబాబు, కాశగాని కొండ, కాశగాని వెంకటేశ్వరావు, అనిశెట్టి రామకృష్ణ, బి.వెంకటశాస్త్రులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పశ్చిమగోదావరి జిల్లా పోలీసులపై

# హైకోర్టు మండిపాటు

**విజయవాడ, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** సున్నిత అంశాలపై వచ్చిన ఫిర్యాదులపై నమోదైన కేసులపై శ్రద్ధపెట్టరా?, కనీస విచారణపైనా చేయరా! అంటూ పశ్చిమ గోదావరి జిల్లా పోలీసులపై ఏపీ హైకోర్టు మండిపడింది. పెళ్లి జరిగాక అత్తింట భర్త, అత్తమామల వేధింపులను భరించలేక కూతురు పుట్టింటికి చేరింది. కొద్ది రోజుల తర్వాత మళ్లీ అత్తింటికి వెళ్లిన తర్వాత కనబడకుండా పోయింది. తమ అల్లుడు, అతని తల్లిదండ్రులే కారణమంటూ ఫిర్యాదు చేస్తే పోలీసులు 13 ఏళ్లుగా కేసు కట్టకుండా కాలయాపన చేస్తున్నారని కలెక్టర్ వద్ద గోడు చెప్పుకున్నారు. సాక్షాత్తు ఎస్పికి ఫిర్యాదు చేశారు. న్యాయ సేవాధికార సంస్థ తలుపు తట్టారు. ఆ తర్వాత మానవ హక్కుల కమిషన్‌కు వెళ్లారు. ఫలితం లేకపోవడంతో అలిసిపోయిన తండ్రి హైకోర్టు మెట్లు ఎక్కారు. 2017 నుంచి హైకోర్టులో చేస్తున్న పోరాటంలో ఆ తర్వాత ఏడాది ఎస్పి కౌంటర్ వేశారు. పిటిషన్ తాజాగా విచారణకు రావడంతో పోలీసుల తీరుపై హైకోర్టు ఆగ్రహించింది. ఈ కేసు దర్యాప్తును సిబిఐకి అప్పగించడం సబబుగా ఉంటుందని, ఇందుకు తగిన ప్రాథమిక ఆధారాలు కూడా ఉన్నాయని జస్టిస్ బి దేవానంద్ అభిప్రాయపడ్డారు. పశ్చిమగోదావరి జిల్లా, జీలుగుమిల్లి మండలం, కామయ్యపాలెం గ్రామానికి చెందిన చిన్న రైతు బండారు ప్రకాశరావు తన కూతురు మంగాదేవిని మోహన బ్రహ్మాజీకి ఇచ్చి కొన్నేళ్ల క్రితం పెళ్లి చేశారు. కట్నకానుకల కోసం భర్త, అత్తమామలు వేధిస్తున్నారని చెప్పి మంగాదేవి 2012లో పుట్టింటికి వచ్చేసింది. తల్లిదండ్రులు కానుకలను కూడా సర్దుబాటు చేసి అత్తింటికి పంపారు. 2012 అక్టోబరు 18న అల్లుడు బ్రహ్మాజీ ఫోన్ చేసి తన భార్య ఎక్కడికో వెళ్లిపోయిందని, కనబడటం లేదని చెప్పాడు. దీనిపై ప్రకాశరావు ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసుగా రిజిస్టర్ చేశారు. అల్లుడు, వారి తల్లిదండ్రులపై అనుమానంతో చేసిన ఫిర్యాదులో 13 ఏళ్లుగా ఎలాంటి పురోగతి లేకపోవడంపై హైకోర్టు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసింది. కేసు దర్యాప్తు పురోగతిని వివరించాలని ఎస్పిని ఆదేశించింది. విచారణను అక్టోబరు 19కి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

### సజ్జల శ్రీధర్‌రెడ్డి, వెంకటేష్ నాయుడు, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

# బెయిల్ పిటిషన్‌లపై తీర్పు రిజర్వు

**విజయవాడ, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** లిక్కర్ కేసులో విజయవాడ ఏసీబీ కోర్టులో నిందితులు సజ్జల శ్రీధర్ రెడ్డి, వెంకటేష్ నాయుడు, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి బెయిల్ పిటిషన్‌పై వాదనలు ముగిసాయి. అనంతరం ఈ బెయిల్ మంజూరు అంశంలో తీర్పు రిజర్వు చేసినట్లు ఏసీబీ కోర్టు ప్రకటించింది. సజ్జల శ్రీధర్ రెడ్డి, వెంకటేష్ నాయుడు, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఏపీలో భారీ స్కామ్‌గా ప్రచారంలో ఉన్న మద్యం కుంభకోణంలో కీలక నిందితులుగా ఉన్నారు. వీరు తమకు బెయిల్ ఇవ్వాలను కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌లను కోర్టు కొట్టివేసింది. ఈ క్రమంలో మరోసారి బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించగా విచారణ జరిపిన న్యాయస్థానం తీర్పు రిజర్వు చేసింది.

# విధి నిర్వహణలో ఎస్ఐ మృతి

**విజయవాడ, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** విధి నిర్వహణలో విజయనగరం జిల్లా పూసపాటిరేగా పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీనివాసరావు గుండెపోటుతో మృతి చెందారు. దసరా ఉత్సవాల సందర్భంగా ఇంద్రకీలాద్రి ప్రత్యేక విధులకు హాజరైన ఎస్ఐ శ్రీనివాసరావు గుండెపోటుతో బాత్రూంలో పడి మృతి చెందారు. అది గమనించి సహచర పోలీసులు ఆయనను హుటాహుటిన ఆస్పత్రికి తరలించినప్పటికి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపినట్లు సమాచారం, ఎస్ఐ శ్రీనివాసరావు మృతదేహాన్ని విజయనగరంకు పంపడానికి పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# గ్రాండ్ చెస్ టూర్ సెమీఫైనల్స్‌లో ప్రజ్ఞానంద డ్రా




**న్యూఢిల్లీ:** గ్రాండ్ చెస్ టూర్ 2025, సెమీఫైనల్స్ లో వాచియర్‌లాగ్రేవ్ తో ప్రజ్ఞానంద మ్యాచ్‌ను డ్రా చేసుకున్నాడు. బ్రెజిల్‌లోని సావో పాలోలో సోమవారం జరిగిన గ్రాండ్ చెస్ సెమీఫైనల్స్ లో భారత గ్రాండ్ మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద ఆలస్యంగా తడబాటు నుంచి తప్పించుకుని ఫ్రెంచ్ గ్రాండ్‌మాస్టర్ మాక్సిమ్ వాచియర్‌లాగ్రేవ్‌తో మ్యాచ్ డ్రా గా ముగించాడు. ఆటపై పట్టు కోల్పోవడానికి కేవలం ఒక సెకను మిగిలి ఉండగానే ప్రజ్ఞానంద పేలవమైన ఎత్తుగడ వేశాడు. కానీ వాచియర్‌లాగ్రేవ్ దానిని సద్వినియోగం చేసుకోవడంలో విఫలమవడం ప్రజ్ఞానందకు కలిసొచ్చింది. కాగా మరో సెమీఫైనల్లో, ఫాబియానో కరువానా లెవాన్ అరోనియన్‌తో జరిగిన మ్యాచ్‌ను డ్రాగా ముగించాడు. ఈ టోర్నమెంట్ మిశ్రమ సమయ నియంత్రణలతో సింగిల్ ఎలిమినేషన్ నాకౌట్ ఫార్మాట్‌లో జరుగుతుంది. ప్రతి టైలో రెండు క్లాసికల్ గేమ్‌లు, రెండు రాపిడ్ గేమ్‌లు మరియు నాలుగు బ్లిట్జ్ గేమ్‌లు ఉంటాయి.

# ఐపిఎల్‌లో 'అండర్ 19'కు నో ఎంట్రీ

## ఫస్ట్ క్లాస్ మ్యాచ్ ఆడితేనే ఛాన్స్

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టోర్నమెంట్ గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. ఇందులో సెలెక్ట్ అయి ఒక్క మ్యాచ్ ఆడితే చాలు ఆ క్రికెటర్ స్టార్ అయిపోతాడు. అలా చాలామంది స్టార్లై ఇప్పుడు ఇండియన్ క్రికెట్ టీంను ఏలుతున్నారు. అభిషేక్ శర్మ, అర్ష్ దీప్, 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశి, గిల్ ఇలా చెప్పుకుంటూ పోతే చాలామంది క్రికెటర్లు ఇండియన్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్




ద్వారా టీమిండియాలోకి వచ్చారు. ఐపిఎల్ లో రాణిస్తే చాలు నేరుగా టీమిండియాలోకి వస్తున్నారు. అయితే ఇలాంటి నేపథ్యంలో ఐపిఎల్ ఆడేందుకు ప్రయత్నాలు చేస్తున్న యువ క్రికెటర్లకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) ఊహించని షాక్ ఇచ్చింది. అండర్ 19 ఉన్న ప్లేయర్లు ఇండియన్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ లో ఆడాలంటే కచ్చితంగా ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడాల్సిందేనని తాజాగా కొత్త రూల్ తీసుకువచ్చింది. అంటే అండర్ 19 ఉన్న ప్లేయర్ కచ్చితంగా ఫస్ట్ క్లాస్ క్రికెట్ మ్యాచ్ ఒకటైన ఆడాలి. అప్పుడే ఇండియన్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ వేలం లేదా మ్యాచ్‌ల్లో ఆడవచ్చు. ఇప్పటివరకు ఐపీఎల్ ఫ్రాంచైజీలు ఏ వయసు వారైనా ఆటగాళ్లను తీసుకునే వీలుండేది.

కానీ ఈ సారి ఐపీఎల్ నుండి ఆ ఆటగాడు ఇండియన్ కోల్ట్స్ తరపున ఆడినప్పటికీ కనీసం ఒక ఫస్ట్‌క్లాస్ ఆట ఆడిన తర్వాత మాత్రమే నగదు అధికంగా ఉండే లీగ్‌లో ఆడటానికి అర్హత పొందుతాడు. ఈ నిర్ణయం ఫ్రాంచైజీల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. ప్రధానంగా రాజస్థాన్ రాయల్స్ తరపున ఐపీఎల్‌లో ఆడిన అతి పిన్న వయస్కుడైన బీహార్ యువకుడు 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ గురించే. అయితే సూర్య గత ఏడాది రంజీ ట్రోఫీలో ఐదు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లతో సహా అన్ని ఫార్మాట్లలో దేశవాళీ క్రికెట్‌లో బీహార్‌కు ప్రాతినిధ్యం వహించినందున, ఐపీఎల్‌లో అతని భాగస్వామ్యంపై దీని ప్రభావం ఉండదు. ఇక చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఆడుతూ ఐపీఎల్‌లో అందరినీ ఆకట్టుకున్న మరో అండర్ 19 ఆటగాడు ఆయుష్ మాత్రేకు ఎదురు దెబ్బ తప్పనిసరి కానుంది. ఏడు ఇన్నింగ్స్‌లలో 206 పరుగులు చేసి తన ప్రతిభను, హిట్టింగ్ సామర్థ్యాన్ని ప్రపంచం గమనించేలా చేశాడు. ఇప్పుడు ఇలాంటి అండర్ 19 ప్లేయర్లకు బిసిసిఐ గట్టి షాక్ ఇచ్చినట్లయింది.



# నేషనల్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో.. మణికంఠకు స్వర్ణం

**న్యూఢిల్లీ:** నేషనల్ ఓపెన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2025లో మాజీ జాతీయ రికార్డు హోల్డర్ మణికంఠ హోబ్లిధర్ స్వర్ణం సాధించాడు. బిర్సా ముండా స్టేడియంలో సోమవారం 24 ఏళ్ల మణికంఠ పురుషుల 100 మీటర్ల టైటిల్‌ను 10.19 సెకన్లలో గెలుచుకుని తన సొంత మీట్ రికార్డును బద్దలు కొట్టాడు. ఇది ఒక భారతీయ స్ప్రింటర్ సాధించిన రెండవ వేగవంతమైన సమయం. సెమీఫైనల్లో తన మునుపటి మీట్ రికార్డు 10.23 సెకన్లను సమం చేశాడు. ఫైనల్‌లో క్లిష్ట పరిస్థితులు ఉన్నప్పటికీ నాణ్యమైన ఫీల్డ్‌ను అధిగమించి ప్రణవ్ గురవ్ (10.31 సెకన్ల) హర్ష్ రౌత్ (10.38 సెకన్ల) కంటే ముందు నిలిచాడు. మణికంఠ గెలిచిన సమయం అనిమేష్ కుజూర్ జాతీయ రికార్డు 10.18 సెకన్ల కంటే కేవలం 0.01 సెకన్ల దూరం తేడాలో ఉంది. అయితే, ఆ రోజు ఇద్దరు ఆశావహ అథ్లెట్లకు గాయాలు అయ్యాయి. ఇప్పటికే 1.79 మీటర్ల క్లియరెన్స్‌తో స్వర్ణం సాధించిన హై జంపర్ గోబికా ఎక్కువ మార్కు సాధించే ప్రయత్నంలో కుడి మోకాలికి తీవ్రమైన గాయమైంది. 2గా మహిళల 100 మీటర్ల పరుగులో స్నేహ ఎస్ఎస్ (11.62) సుధేష్ణ శివాంకర్ (11.64), అభినయ రాజరాజన్ (11.67) లను ఓడించింది. కానీ అభినయ బాధతో కుప్పకూలిపోవడంతో ట్రాక్ నుంచి బయటకు తీసుకెళ్లాల్సి వచ్చింది.

# షూటింగ్ ప్రపంచ కప్‌లో ఛాంపియన్‌గా ఓజస్వి

## హిమాన్షుకు స్వర్ణం



**న్యూఢిల్లీ:** ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ ప్రపంచ కప్ 2025, మహిళల విభాగంలో భారత్ అద్భుత ప్రదర్శనతో క్లీన్ స్వీప్ చేసింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఛాంపియన్‌గా భారత్ షూటర్ ఓజస్వి ఠాగూర్ నిలిచింది. డాక్టర్ కర్ణి సింగ్ షూటింగ్ రేంజ్‌లో సోమవారం జరిగిన ఎయిర్ రైఫిల్ జూనియర్ మహిళల ఈవెంట్‌లో భారత్ అద్భుతమైన ఆధిపత్యంతో పోడియంను కైవసం చేసుకుంది. ఓజస్వి రెండు అద్భుతమైన 8వ మరియు 16వ షాట్‌లలో 10.9 సెకన్లలో 252.7 స్కోరుతో కొట్టి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. మిగిలిన భారత్ షూటర్లు హృదయ శ్రీ కొండూర్ 250.2 పాయింట్లతో రజతం సాధించగా, అర్హత లీడర్ శాంభవి ఎస్. క్షీర్‌సాగర్ 229.4 పాయింట్లతో అఖిల భారత పోడియంను పూర్తి చేసింది. అర్హత సమయంలో భారత త్రయం ఇప్పటికే తమ అధికారాన్ని చాటుకుని మొదటి మూడు స్థానాల్లో నిలిచింది. శాంభవి 632.0తో ముందంజలో, ఓజస్వి 631.9తో దగ్గరగా, మరియు హృద్య 629.8తో మూడవ స్థానంలో నిలిచారు. ఇక పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ జూనియర్ ఫైనల్లో, 633.7 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచిన భారతదేశానికి చెందిన హిమాన్షు తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగించి 250.9 పాయింట్లతో స్వర్ణం సాధించాడు. వ్యక్తిగత తటస్థ అథ్లెట్ దిమిత్రి పిమెనోవ్ 249.9 పాయింట్లతో రజతం సాధించగా, భారతదేశానికి చెందిన అభినవ్ షా 228.4 పాయింట్లతో కాంస్యం సాధించాడు. తోటి భారత షూటర్ నరెయిన్ ప్రణవ్ వనితా సురేష్ 187.0తో ఐదవ స్థానంలో నిలిచింది.



# జపాన్ ఓపెన్‌లో ఫైనల్‌కు బోపన్న, యుజుకి జోడీ

**న్యూఢిల్లీ:** జపాన్ ఓపెన్ డబుల్స్ ఫైనల్‌కు ఇండో జపనీస్ ద్వయం రోహన్ బోపన్న-టకేరు యుజుకి దూసుకెళ్లింది. ఉత్కంఠభరితమైన టోక్యో షోడౌన్‌లో టోక్యోలో సోమవారం జరిగిన మ్యాచ్‌లో టాప్‌సీడ్ అమెరికన్లను ఓడించడానికి ఇండో జపనీస్ ద్వయం 3మ్యాచ్ పాయింట్లను కాపాడుకుంది. ఏటా జరిగే ఎటిపి 500 ఈవెంట్ అయిన జపాన్ ఓపెన్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్స్‌లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న అగ్రశ్రేణి సింగిల్స్ మరియు డబుల్స్ ఆటగాళ్ళు పాల్గొంటారు. ఈ నేపథ్యంలో భారత డబుల్స్ దిగ్గజం 45 ఏళ్ల బోపన్న ఈ మ్యాచ్‌లో నైపుణ్యం మరియు అనుభవాన్ని ప్రదర్శించి మెరిశాడు. జపాన్‌కు చెందిన స్థానిక టెకెరు యుజుకి (27)తో కలిసి, బోపన్న మొదటి రౌండ్‌లో నార్వేకు చెందిన కాస్పర్ రూడ్ మరియు ఆస్ట్రేలియాకు చెందిన జోర్డాన్ థాంప్సన్‌పై 6-3, 6-4 తేడాతో విజయం సాధించి తమ ప్రచారాన్ని ప్రారంభించారు. క్వార్టర్ ఫైనల్స్‌లో బోపన్న మరియు యుజుకి మూడవ సీడ్ అర్జెంటీనా జంట మాక్సిమో గొంజాలెజ్ మరియు ఆండ్రెస్ మోల్టెనితో తలపడ్డారు. అరియాక్ కొలిసియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో వైల్డ్‌కార్డ్ ద్వయం 7-6(5), 7-6(4)తో విజయం సాధించడంతో, రెండు టైబ్రేకర్లకు దారితీసింది.

# చైనా ఓపెన్ సెమీఫైనల్లోకి సిన్నర్



**న్యూఢిల్లీ:** చైనా ఓపెన్ 2025, సెమీఫైనల్లోకి జానిక్ సిన్నర్ దూసుకెళ్లగా, 16వ రౌండ్‌లోకి ఇగా స్వియాటెక్ చేరుకుంది. బీజింగ్‌లో సోమవారం జరిగిన మ్యాచ్‌లో సిన్నర్ తన ప్రత్యర్థి ఫాబియన్ మరోజ్సాన్‌ను వరుస సెట్లలో ఓడించి మూడో చైనా ఓపెన్ సెమీఫైనల్ స్థానాన్ని దక్కించుకున్నాడు. అలాగే స్వియాటెక్ తన ప్రత్యర్థి గాయంతో రిటైర్ అయినప్పుడు చివరి 16కి చేరుకుంది. ఇటాలియన్ సిన్నర్ బీజింగ్‌లో ఒక గంటా 19 నిమిషాల్లో ప్రపంచ 57వ ర్యాంకర్ హంగేరియన్‌ను 6-1, 7-5 తేడాతో ఓడించి, తర్వాత మూడో సీడ్ అలెక్స్ డి మినార్‌తో తలపడ్డాడు. సిన్నర్ మొదటి సెట్‌ను సులభంగా గెలుచుకున్నాడు కానీ రెండవ సెట్‌లో మరోజ్సాన్ దానిని మరింత కష్టతరం చేసినా 5-4 ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. చివరి నాలుగు ఆటలలో కేవలం ఒక డ్రాప్ పాయింట్‌తో సిన్నర్ తదుపరి మూడు ఆటలను గెలుచుకున్నాడు. ఇక మహిళల డ్రాలో, పోలాండ్‌కు చెందిన టాప్ సీడ్ స్వియాటెక్, కామిలా ఒసోరియోపై మొదటి సెట్‌ను 6-0తో గెలుచుకుంది. స్వియాటెక్ తదుపరి అమెరికాకు చెందిన ఎమ్మా నవారోతో తలపడనుంది. అలాగే ఉక్రెయిన్‌కు చెందిన మార్తా కోస్ట్యుక్, రష్యాకు చెందిన మిర్రా ఆండ్రీవా కూడా చివరి 16కి చేరుకుని సెమీఫైనల్స్‌కు దగ్గరగా ఉన్నారు. నాల్గవ సీడ్ ఆండ్రీవా 6-4, 6-1 తేడాతో స్పెయిన్‌కు చెందిన జెస్సికా బౌజాస్‌ను ఓడించగా, కోస్ట్యుక్ 6-4, 6-2 తేడాతో బెలారస్‌కు చెందిన అలియాక్సాండ్రా సస్నోవిచ్‌ను ఓడించింది.



# 'థామా' ఆడియన్స్‌ను అలరిస్తుంది

## ప్రెస్ మీట్ లో హీరో ఆయుష్మాన్ ఖురానా

**ఆయుష్మాన్ ఖురానా,** రష్మిక హీరో హీరోయిన్స్‌గా తెరకెక్కిన సినిమా 'థామా'. హారర్ కామెడీగా రూపొందిన ఈ సినిమాకి ఆదిత్యా సర్పోత్దార్ దర్శకత్వం వహించారు. పరేష్ రావల్, నవాజుద్దీన్ సిద్ధిఖీ కీలక పాత్రలు పోషించారు. మాడాక్ ఫిల్మ్స్ సమర్పణలో దినేష్ విజన్, అమర్ కౌశిక్ నిర్మించారు. ఈ మూవీ అక్టోబరు 21న విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ హైదరాబాద్‌లో ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్‌లో హీరో ఆయుష్మాన్ ఖురానా మాట్లాడుతూ...'మాడాక్ ఫిల్మ్స్ యూనివర్స్‌లో భాగమవడం చాలా ఆనందంగా ఉంది. మాడాక్ ఫిల్మ్స్ హారర్ కామెడీ యూనివర్సిటీలో వస్తున్న నెక్స్ట్ చాప్టర్ థామా. బేతాళ్ కి హెడ్ థామా. రష్మిక గారితో ఫస్ట్ టైం కలిసి నటించడం చాలా ఆనందంగా ఉంది. రష్మిక బ్రిలియంట్ పెర్ఫార్మర్. ఫస్ట్ టైం హైదరాబాద్ ఫిలిం ప్రమోషన్ కోసం వచ్చాను. అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాని తమిళనాడు, ఊటీలో కూడా షూట్ చేసాము. ఇది ఫుల్ పాన్ ఇండియా ఫిలిం. నేను ప్రతి సినిమాకి ఒక కొత్త కాన్సెప్ట్ ఉండేలాచూస్తుంటాను. ఈ సినిమా కాన్సెప్ట్ కూడా ఆడియన్స్‌ని అలరిస్తుంది. అందరూ 21 అక్టోబర్ థియేటర్స్‌కి వచ్చి ఈ సినిమాను చూసి ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నాను అన్నారు. హీరోయిన్ రష్మిక మందన మాట్లాడుతూ... 'మాడాక్ హారర్ కామెడీ ఫిలిమ్స్‌లో చాలా మంచి కాన్సెప్ట్ ఉంటుంది. కథకు చాలా ప్రాధాన్యత ఉంటుంది. పర్ఫార్మెన్స్‌లో అమేజింగ్‌గా ఉంటాయి. ఈ యూనివర్స్‌కు ఆడియన్స్ నుంచి చాలా మంచి ఆదరణ ఉంది. అలాంటి సినిమా చేస్తున్నప్పుడు కచ్చితంగా మనపై రెస్పాన్సిబిలిటీ ఉంటుంది. ఈ అవకాశం ఇచ్చిన మాడాక్ ఫిలింస్ కి థాంక్యూ. ప్రతి సినిమాకి ఒక కొత్త క్యారెక్టర్ చేయాలని ప్రయత్నిస్తుంటాను. ఈ సినిమాతో కూడా ఆడియన్స్‌ని సర్ప్రైజ్ చేస్తానని భావిస్తున్నాను. ఈ సినిమా 21 అక్టోబర్ రిలీజ్ అవుతుంది. అందరూ థియేటర్స్‌లోచూసి మీబ్లెస్సింగ్స్ అందిస్తారని కోరుకుంటున్నాను అన్నారు.

# కాంతార: చాప్టర్ 1 బ్లాక్ బస్టర్ అవుతుంది

## ప్రీరిలీజ్ ఈవెంట్‌లో మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్




**కాంతారతో** పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్ అందుకున్న రిషబ్ శెట్టి మోస్ట్ ఎవైటెడ్ ప్రీక్వెల్ కాంతార: చాప్టర్ 1తో రాబోతున్నారు. ఈ చిత్రాన్ని ఆయన స్వయంగా దర్శకత్వం వహించి, నటించారు. ఇటీవల విడుదలైన థియేట్రికల్ ట్రైలర్ అన్ని భాషలలో హ్యూజ్ బజ్ క్రియేట్ అంచనాలను భారీగా పెంచింది. ప్రఖ్యాత పాన్‌ఇండియా నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబర్ 2న దసరాకు విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. యంగ్ టైగర్ ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ వేడుక చాలా గ్రాండ్ గా జరిగింది.

ప్రీరిలీజ్ ఈవెంట్‌లో యంగ్ టైగర్ ఎన్టీఆర్ మాట్లాడుతూ... 'మా అమ్మమ్మ నాకు చిన్నప్పుడు నుంచే కొన్ని కథలు చెప్పడం మొదలు పెట్టింది. అప్పుడు నిజంగా జరుగుతుందా ఈ కథ నిజమేనా కాదా? ఇలా ఎన్నో డౌట్లు. కానీ అవి బాగా నచ్చేవి. ఆవిడ చెప్పినప్పుడల్లా చాలా ఇంట్రెస్ట్ వచ్చేది. ఆ పింజుర్లి, గుడి ఘాట్ చిన్నప్పుడు నుంచి నాటుకుపోయింది. కానీ ఏనాడు అనుకోలేదు. చిన్నప్పుడు నేను విన్న ఆ కథల గురించి ఒక దర్శకుడు సినిమా తీస్తాడని. అతను మరెవరో కాదు నా బ్రదర్ రిషబ్ శెట్టి. నేను చిన్నప్పుడు విన్న కథ తెరపై చూసినప్పుడు నాకు మాటలు రాలేదు. కథ తెలిసిన నేనే అంత ఆశ్చర్య పోతే ఆ కథ తెలియని వాళ్లు చూసి ఏమయ్యారో అదే కాంతార రిజల్ట్. చాలా అరుదైన దర్శకుడు రిషబ్. 24 క్రాఫ్ట్‌లో అన్ని క్రాఫ్ట్స్‌ని ఆయన డామినేట్ చేయగలరు. రిషబ్ గారే లేకపోతే నిజంగా ఈ సినిమాని ఈ లెవెల్‌లో తీయగలిగేవారా అనిపిస్తుంది. ఈ సినిమా తీయడం అంత ఈజీ కాదు. ఒక గుడికి తీసుకెళ్లారు. నిజానికి ఆ గుడికి వెళ్లడానికి మార్గమే లేదు. అలాంటి మార్గాన్ని క్రియేట్ చేసుకున్నారు. కాంతార రిషబ్ శెట్టి గారి డ్రీమ్. ఈ డ్రీమ్‌ని ఫుల్ ఫిల్ చేయడానికి హోంబలే ఫిల్మ్స్ సపోర్ట్ చేశారు. ఇండియన్ ఫిలిమ్స్‌లో ఒక గొప్ప బ్లాక్ బాస్టర్ చిత్రంగా ఈ చిత్రం ప్రస్ఫుటంగా కనబడాలని మనస్ఫూర్తిగా దేవున్ని కోరుకుంటున్నాను. ఇక్కడికి వచ్చిన రిషబ్ గారిని కాంతారా టీంని ఆశీర్వదించినందుకు మీ అందరికీ మనస్ఫూర్తిగా నా ధన్యవాదాలు. ఈ సినిమా బిగ్‌బిగ్ బ్లాక్ బస్టర్ అవుతుంది. అక్టోబర్ 2న తప్పకుండా థియేటర్ కి వెళ్లి చూడండి. దయచేసి థియేటర్స్‌లో ఎంజాయ్ చేయండి. మా రిషబ్ గారికి ఆయన పడిన కష్టానికి మీరందరూ ఆశీర్వాదం అందించండి' అన్నారు.

హీరో, దర్శకుడు రిషబ్ శెట్టి మాట్లాడుతూ.. 'ఈ వేడుక వచ్చిన అందరికీ థాంక్యూ సో మచ్. ఎన్టీఆర్ గారు నాకు ఫ్రెండు, బ్రదర్. ఆయనతో మాట్లాడుతున్నప్పుడు నాకు ఒక బ్రదర్‌తో ఉన్న ఫీలింగ్ కలుగుతుంది. ఈ వేడుక హైదరాబాదులో జరుపుకోవడం, ఈవేడుకకు ఎన్టీఆర్ గారు రావడం చాలా ఆనందంగాఉంది. తెలుగు ఆడియన్స్‌కి హృదయపూర్వక నమస్కారాలు. ఈ వేడుకకి వచ్చిన ఎన్టీఆర్ గారికి థాంక్యూ సో మచ్. ఈ సినిమాకి మీరందరూ సపోర్ట్ చేసి మంచి విజయాన్ని అందించాలని కోరుకుంటున్నాను. తప్పకుండా అక్టోబర్ 2న ఈ సినిమాని అందరూ థియేటర్స్‌లో చూసి ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను' అన్నారు.

మైత్రి మూవీ మేకర్స్ నిర్మాత రవి మాట్లాడుతూ... 'కాంతార ఎక్స్ట్రార్డినరీ. రిషబ్ గారి లుక్ మైండ్ బ్లోయింగ్. ట్రైలర్ చూసిన తర్వాత ఇప్పుడే సినిమా చూడాలనే ఫీలింగ్ కలిగింది. ఈ సినిమా పాన్ ఇండియా లెవెల్‌లో చాలా పెద్దనెంబర్స్ కలెక్ట్ చేస్తుందని బలంగానమ్ముతున్నాను. రుక్మిణి ఎన్టీఆర్‌గారితో మేము చేస్తున్న సినిమాల్లో కూడా హీరోయిన్. హోంబలే ఫిలింస్ ఎక్స్ట్రాడినరీ సినిమాలు తీస్తున్నారు. ఎన్టీఆర్‌గారు రిషబ్‌గారు బ్రదర్స్‌లాగా ఉంటారు. ఎన్టీఆర్‌తోచేస్తున్న సినిమా వేరే లెవల్. ఈ అవకాశం ఇచ్చిన అందరికీ థాంక్యు సో మచ్' అన్నారు. మైత్రి డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ.. 'హోంబలే ఫిల్మ్స్ ఫస్ట్ సలార్ ఇచ్చారు ఇప్పుడు కాంతార 1 ఇస్తున్నారు. తప్పకుండా వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం. కాంతారా సినిమా అందులో పాటలు చాలా ఎనర్జీ ఇచ్చేవి. ఈ సినిమాని ఆశీర్వదించడానికి ఎన్టీఆర్ గారు రావడం చాలా సంతోషంగా ఉంది. తప్పకుండా ఈ సినిమాని థియేటర్స్‌లో చూడాలని కోరుకుంటున్నాను' అన్నారు.

హీరోయిన్ రుక్మిణి వసంత్ మాట్లాడుతూ.. 'ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్ కి వచ్చిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఎన్టీఆర్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు. ఆయన సొంత సినిమా లాగా సపోర్ట్ చేశారు. తెలుగు ఆడియన్స్ అందరికీ థాంక్యూ. నా ప్రతి సినిమాని మీరు సపోర్ట్ చేశారు. అక్టోబర్ రెండున ఈ సినిమా రిలీజ్ అవుతుంది. అందరూ థియేటర్స్‌లో చూసి ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నాను' అన్నారు.



# గ్రాండ్‌గా 'హైలెస్సో' లాంచ్

**సుడిగాలి సుధీర్‌గా** అందరికీ సుపరిచితుడైన సుధీర్ ఆనంద్ బుల్లితెర, వెండి తెర రెండింటిలోనూ తనదైన ముద్రవేస్తున్నారు. అతని కొత్త చిత్రం ఈరోజు అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. ప్రసన్న కుమార్ కోట దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంను వజ్ర వారాహి సినిమాస్ బ్యానర్‌పై శివ చెర్రీ, రవికిరణ్ నిర్మిస్తున్నారు. ఇది వారి బ్యానర్‌కు ప్రొడక్షన్ నంబర్ 1, సుధీర్ ఆనంద్‌కు హీరోగా ఐదవ చిత్రం. గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రంలో శివాజీ విలన్‌గా కనిపించబోతున్నారు. ఈచిత్రానికి 'హైలెస్సో' అనే ఆకట్టుకునే టైటిల్ పెట్టారు. హీరో నిఖిల్ టైటిల్‌ను లాంచ్ చేశారు. బన్నీ వాసు స్క్రిప్ట్‌ను అందజేశారు. దర్శకులు వశిష్ట, చందూ మొండేటి, మెహర్ రమేశ్ కెమెరాను ఆన్ చేయగా, ముహూర్తపు షాట్‌కు వి.వి.వినాయక్ క్లాప్ కొట్టారు. దర్శకుడు ప్రసన్న కుమార్ స్వయంగా యాక్షన్ చెప్పారు. ఈ సినిమాలో నటాషా సింగ్, నక్ష శరణ్ హీరోయిన్లుగా నటించగా, ప్రముఖ కన్నడ నటి అక్షర గౌడ కీలక పాత్రలో కనిపించనున్నారు.



# ఆకట్టుకుంటోన్న 'శశివదనే' ట్రైలర్

**రక్షిత్ అట్లూరి,** కోమలి ప్రసాద్ జంటగా నటించిన చిత్రం 'శశివదనే'. గౌరీ నాయుడు సమర్పణలో ఏజీ ఫిల్మ్స్ కంపెనీ, ఎస్.వి.ఎస్ స్టూడియోస్ బ్యానర్స్‌పై అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి గోడల సినిమాను నిర్మించారు. సాయి మోహన్ ఉబ్బన దర్శకత్వం వహించారు. అక్టోబర్ 10న రిలీజ్ కానున్న ఈ మూవీ ట్రైలర్‌ను మేకర్స్ సోమవారం విడుదల చేశారు. ట్రైలర్‌ను గమనిస్తే..'గలగల పారే గోదావరి గట్టుతో కళ కళలాడే అందమైన పల్లెటూరులో ఓ అమ్మాయిని చూడగానే తొలి చూపులోనే అబ్బాయికి ప్రేమ పడుతుంది. ప్రేమ ఆ చూపుతో మొదలైంది.. కాలం బొమ్మలా ఆగిపోయింది. ఆమెతో పాటే నా మనసుకూడా మాయమైంది' అనే డైలాగ్ హీరోయిన్‌పై హీరోకి లవ్ డెప్త్ ఏంటో చెబుతోంది. 'లంకలోని సీత కోసం రాముడు సముద్రాలు దాటినట్లు.. నీ సైకిల్ పాప కోసం నువ్వు ఈ గోదారి దాటుతున్నావన్నమాట' ఈ డైలాగ్ చూస్తే తన మనసుకి నచ్చిన ప్రేయసి కోసం హీరో గోదారి దాటి వెళ్లి అన్వేషిస్తాడని. దానికి తగినట్లుగానే సన్నివేశాలను చూపించారు. 'ఆడపిల్లలు మన జీవితంలోకి కోరికలతోను, ఆశలతోను రారురా..జీవితంలో తోడుగా ఉంటామని భరోసాతో వస్తారు...', 'నాకు ఊహ తెలియని వయసు నుంచి నా అనుకున్నబంధం నాన్న.. ఊహ తెలిసిన తర్వాత నా అనుకున్న బంధం మీరు' అంటూ హీరోయిన్‌కి హీరో తన ప్రేమను చెబితే, 'ఇంత ప్రేమ నా నుంచి ఎప్పటికీ దూరం కాదుగా రాఘవ' అంటూ హీరోయిన్ ప్రేమగా హీరోని రిక్వెస్ట్ చేసే సన్నివేశం ఇద్దరి మధ్య ఉన్న ప్రేమ గాఢతను తెలియజేస్తోంది. 'ప్రేమించాలని డిసైడ్ అయితే ఎన్నొచ్చిన యుద్ధం చేయాల్సిందే' అని హీరోకి తండ్రి చెప్పటం చూస్తే ప్రేమలో హీరోకి ఎదురైన సమస్య గురించి తెలుస్తుంది. అక్కడి నుంచి మనకు విలన్ పాత్ర ఎలా ఉండబోతుంది.. తన వల్ల హీరో పడ్డ ఇబ్బందులను ట్రైలర్‌లో చూపించే ప్రయత్నం చేశారు. "జాగ్రత్తగా వెళ్లి.. జాగ్రత్తగా తిరిగిరా' అంటూ హీరోకి హీరోయిన్ జాగ్రత్త చెప్పటం, 'ప్రేమతో వెళ్తున్నా.. వచ్చాక ప్రపంచాన్నే గెలుద్దాం' అని హీరో చెప్పటం.. దానికి హీరో నుంచి హీరోయిన్ ప్రామిస్ తీసుకోవటంతో ట్రైలర్ ముగిసింది. గోదావరి నేపథ్యంలో సాగే ఈ ప్రేమకథలోని సన్నివేశాలు ట్రైలర్‌లోనే హృదయాలను హత్తుకుంటుంటే సినిమాలో ఎమోషన్స్ ఎలా ఉండబోతున్నాయనే క్యూరియాసిటీ అయితే కలుగుతోంది. శరవణ వాసుదేవన్ సంగీతం అందిస్తోన్న ఈ చిత్రానికి అనుదీప్ దేవ్ నేపథ్య సంగీతాన్ని అందిస్తున్నారు. సాయికుమార్ దారా అందించిన విజువల్స్ చాలా రిచ్‌గా ఉన్నాయి.

# సంప్రదాయాల పండగ సద్దుల బతుకమ్మ

ప్రపంచ వ్యాప్తంగా ఒక్కో ప్రదేశంలో ఒక్కో విశిష్టత సంతరించుకొని ఉంటుంది. ముఖ్యంగా సంస్కృతి, సంప్రదాయాలలో భారతదేశం పేరెన్నికగలది. విభిన్న మతాలు ఉన్నప్పటికీ మేటికవే తమ సంస్కృతిని, సంప్రదాయాలలో భారతదేశం పేరెన్నికగలది. విభిన్న మతాలు ఉన్నప్పటికీ వెటికవే తమసంస్కతిని, సంప్రదాయాల్ని కాపాడుకుంటూ వస్తున్నవి. ముఖ్యంగా తెలంగాణా రాష్ట్రంలో అన్ని రకాల తెలుగువారి పండుగలలో ఘనంగా ప్రకృతి సహవాసంతో జరుపుకునే పండుగగా బతుకమ్మ పండుగ పేరెన్నికగన్నది.

సద్దుల బతుకమ్మరోజు ఐదు రకాల సద్దులను నైవేద్యంగా పెడతారు. అందుకే ఇది 'సద్దుల బతుకమ్మ' దద్దోజనం, చింతపండుపులిహోర, నిమ్మకాయ పులిహోర, కొబ్బరన్నం నువ్వులన్నం, పల్లీ, నువ్వులు,కొబ్బరి పుట్నాలను పొడిచేసి అన్నంతో కలుపుతారు. బియ్యపిండితోగాని జొన్నపిండితోగాని రొట్టెలుకాలుస్తారు. వేడివేడి రొట్టెలకుపంచదార లేదా బెల్లం కలిపి దంచుతారు. ఈ పొడిని ముద్దలు చేస్తారు. వీటిని మలిజముద్దలు అంటారు. మలిజముద్దలు, పొడుల సద్ది, పెరుగుసద్ది పులిహోరతో కలిపి మొత్తం ఐదు నుంచి తొమ్మిది రకాల సద్దులను నైవేద్యంగా ఇస్తారు.



తెలంగాణ ప్రాంతంలో చెప్పుకోదగ్గ ఆటపాటల పండుగ బతుకమ్మ తెలంగాణ సంస్కృతికి ప్రతిరూపంగా వెలుగొందే బతుకమ్మ పండుగ వేడుకలు ఆశ్వయుజ మహాలయ అమావాస్యంతో 'ఎంగిలి పూల రకరకాల పూలతో గమ్మిడి పువ్వులు, తంగేడు, బీర, గన్నేరు, గునుగు, బంతి వంటి పువ్వులతో బతుకమ్మను పేర్చి పైన పసుపు ముద్దతో గౌరమ్మను ఉంచి కుంకుమ పెట్టి పూజిస్తారు. పెళ్ళికాని అమ్మాయిలు అయితే మంచి భర్త రావాలని, పెళ్ళైన స్త్రీలు నిండు నూరేళ్లు తన భర్త ఆయురారోగ్యాలతో బాగుండాలని బతుకమ్మని పూజించడం ఈ పండుగ ప్రత్యేకత తొమ్మిది రోజులపాటు బతుకమ్మను రకరకాల పేర్లతో పూజించడం విశేషం. మొదటిరోజు ఎంగిలిపువ్వుల బతుకమ్మ, రెండోరోజు అటుకుల బతుకమ్మ. మూడువరోజు ముద్దపప్పు బతుకమ్మ, నాలుగోరోజు నానబియ్య బతుకమ్మ, ఏదోరోజు అట్ల బతుకమ్మ ఆరోరోజు అలిగిన బతుకమ్మ ఏడోరోజు వేపకాయల బతుకమ్మ, ఎనిమిదోరోజు వెన్నుముద్దల బతుకమ్మ, తొమ్మిదోరోజు సద్దుల బతుకమ్మ ఇలా తొమ్మిది రోజుల పాటు రకరకాల పూలతో, ప్రసాదాలతో పూలపండుగ చేసుకోవడం. తెలంగాణలోని సంస్కృతిలో ఒక ప్రత్యేకత అనే చెప్పవచ్చును. పూజాది కార్యక్రమాలు అయ్యాక బతుకమ్మలను చెరువులు, నదులలో నిమజ్జనం చేస్తారు. ప్రకృతికి, మనిషికి మధ్య అవినాభావ సంబంధం ఉంది అనడానికి బతుకమ్మ పూలపండుగే సాక్ష్యం. బతుకమ్మల పండుగకోసం సేకరించే పూలతో చేసిన బతుకమ్మను చెరువులు, నదులలో నిమజ్జనం చేయడం వలన కొత్తనీరు శుద్ధతను సంతరించుకొంటుంది. రోగకారక క్రిములు వంటివి కూడా నశిస్తాయి. అంతేకాకుండా ఈ తొమ్మిది రోజులపండుగ సందర్భంగా తయారుచేసే ప్రసాదాలు అన్నీ కూడా శారీరక ఆరోగ్యానిచ్చే వరప్రదాయినిగానే చెప్పవచ్చును.

బతుకమ్మ పండుగ పూలపండుగగా ప్రకృతితో మమేకమైన పండుగగా ప్రత్యేకత ఉన్నప్పటికీ పాటల పండుగ అని కూడా ప్రత్యేకంగా చెప్పవచ్చు. బతుకమ్మ పండుగకు స్త్రీలు అనేక రకాల పాటలు పాడుతారు. ఒక స్త్రీ పాట పాడగా మిగతా వాళ్ళంతా ఆ పాటకి వంతపాడుతారు. ఉయ్యాల, కోలో, వలలో, కోయిలా, తమ్మెద, రామచిలుకా ఓ రాచగుమ్మడి, చెలియా మొదలైన వంత పదాలు పాడి, ఆ పాటను రక్తి కట్టిస్తారు. చప్పట్లు లేదా కోలోటంతో స్త్రీలు సామూహిక స్వరాలతో వినసొంపుగా ఉంటుంది. ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ-ఏమేమి కాయొపన్పనే గౌరమ్మ గుమ్మడి పువ్వొప్పునే గౌరమ్మ-గుమ్మడి కాయొప్పనే గౌరమ్మ
గుమ్మడి చెట్టుకింద గౌరమ్మా - ఆట సిలకాలార గౌరమ్మ అంటూ..

పూల ప్రాధాన్యతను తెలిపే బతుకమ్మపాటు శ్రీగౌరి నీపూజ ఉయ్యాలో-చేయబూనితినమ్మా ఉయ్యాలో
కాపాడు ముమ్ములా ఉయ్యాలో-కైలాసరాణివి ఉయ్యాలో
శ్రీలలితవు నీవు ఉయ్యాలో-సరిలనిచ్చే తల్లినీ ఉయ్యాలో చదువుల
నిత్తుమా ఉయ్యాలో - శ్రీ సరస్వతివి నీవు ఉయ్యాలో అంటూ



బతుకమ్మను పార్వతీదేవిగా భావిస్తూ స్త్రీలు పాడే పాటలు బతుకమ్మ పండుగ విశిష్టతను ఇనుమడించేలా పాడడం విశేషం.
ఒక్కేసి పువ్వేసి సందమామ ఒక్క జాములయె సందమామ
రెండేసి పువ్వేసి సందమామ రెండు జాములయె సందమామ
మూడేసి పువ్వేసి సందమామ మూడు జాములయె సందమామా

అంటూ బతుకమ్మల చుట్టు తిరుగుతూ పాడడం వలన పండగ వైశిష్ట్యాన్ని మరింతగా ఇనుమడింపచేస్తుంది.
రామా రామా రామా ఉయ్యాలో
శ్రీరామరామ ఉయ్యాలో
శ్రీలక్ష్మిదేవియు ఉయ్యాలో సృష్టిబతుకమ్మయె
ఉయ్యాలో భరతుని దేశమున ఉయ్యాలో
ధర్మాంగుడనురాజు ఉయ్యాలో
ఆరాజు భార్యయూ ఉయ్యాలో, అతివ
సత్యవతి ఉయ్యాలో నూరు నోములనోచి
ఉయ్యాలో నూరుమందిని కనియె ఉయ్యాలో
అంటూ ప్రకృతిలోని పూలతో గౌరిదేవిని నిత్యం పూజించడం వలన మానవాళి బంగారు భవిష్యత్తును ఎటువంటి ఆపద రాకుండా నిండునూరేళ్ళు పచ్చని పంటలతో, ప్రకృతితో, బతుకు పండుగలా. సాగాలని గౌరీమాతను పూజిస్తూ పాటలు పాడుతారు. అంతేకాకుండా తెలంగాణలోని బతుకమ్మ పండుగ విశిష్టతను తెలిపే మరొక బతుకమ్మ పాటను పరికించి చూస్తే.. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో తంగేడు గునుగులో ఉయ్యాలో తరలివచ్చేను ఉయ్యాలో గౌరమ్మ రూపానివే ఉయ్యాలో బంగారు తేజానివే ఉయ్యాలో బీర ఆకులతోటి ఉయ్యాలో పూలపందిరివోలె ఉయ్యాలో ఎత్తయిన బుతకమ్మ ఉయ్యాలో తెలంగాణ సొగసమ్మ ఉయ్యాలో వీర తెలంగాణ ఉయ్యాలో .. అంటూ సాగే ఈ పాట బతుకమ్మ పండుగను, ప్రాధాన్యతను ఇనుమడించేలా చేసింది. ఎంతోగొప్ప చరిత్రను, ఘనతను కలిగిన భారతదేశం తరతరాలకు ఆస్తులను వారసత్వంగా ఇవ్వకుండా సంస్కృతి, సంప్రదాయాలను వారసత్వ సంపదగా ఇవ్వడం గొప్ప విషయం. తీరాలు మారినా సంస్కృతి, ఆచారాలు వన్నె తగ్గవన్నది సత్యం. ఆధునిక యుగంలో కూడా బతుకమ్మ పండుగను పల్లెపల్లెలోనే కాకుండా పట్టణాల్లో కూడా వీధివీధుల్లో పెద్దఎత్తున జరుపుకోవడం విశేషం. అంతేకాకుండా ప్రవాస భారతీయులు కూడా మాతృదేశాన్ని వదిలి వృత్తిరీత్య వెళ్ళినా అక్కడ కూడా బతుకమ్మ పండుగ సంబురాలు చేసుకోవడం ఎంతో గొప్పవిషయం. ఎంతో చారిత్రమైన ఘనతకు కలిగి, జానపదుల పండుగగా వెలిసిన బతుకమ్మ నేడు తెలంగాణాలో దశదిశలా బతుకమ్మ ఆటపాటలతో పల్లె, పట్నం, చిన్నా, పెద్దా, ఆడా, మగా తేడా లేకుండా అందరూ ఆనందోత్సాహాలతో జరుపుకునే పండుగ. ప్రకృతితో, పూలతో ఆట పాటలతో మమేకమై జరుపుకునే పండుగ బతుకమ్మపండుగ. పూలపండుగగా.. ప్రభుత్వం రాష్ట్రపండుగా అధికారికంగా నిర్వహించడం బతుకమ్మ పండుగ ఘనతను వినూతికెక్కించడమే కదా! ఒక తరం నుండి మరొక తరానికి వారసత్వంగా వెలుగొందుతున్న బతుకమ్మ పండుగను మరింతగా ఇనుమడించేలా జరుపుకుందాం.

- డా॥ఓరుగంటి సరస్వతి

నేటి అలంకరణ

## శ్రీ దుర్గాదేవి



అమ్మలగన్న అమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ !
చాలా పెద్దమ్మ సురారులమ్మ కడుపారడి బుచ్చినయమ్మ !!
తన్నులో నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడియమ్మ !
దుర్గ మాయమ్మ కృపాబ్ధి నిచ్చుత మహత్వ కవిత్వ పటుత్వ సంపదల్ !!
" విద్యుద్దామ సమప్రభాం మృగపతి స్కంధస్థితాం భీషణాం
కన్యాభిః కరవాలఖేట విలద్దస్తా భిరాసేవితాం!
హస్తైశ్చక్రగదాసిఖేట విసిఖాంశ్చాపం గుణం తర్జనీం
బిభ్రాణా మనలాత్మికాం శశిధరాం దుర్గాం త్రినేత్రాం భజే "

దుర్గమ్మ ఈ అవతారములోనే దుర్గముడనే రాక్షసుడ్ని సంహరించినట్లు పురాణాలు చెబుతున్నాయి. పంచప్రకృతి మహాస్వరూపాల్లో దుర్గ రూపం మొదటిది. భవబంధాలలో చిక్కుకున్న మానవుడిని ఈ మాత అనుగ్రహించి మోక్షాని న్ప్రసాదిస్తుంది. కోటి సూర్యప్రభలతో వెలుగొందే అమ్మను అర్చిస్తే అర్చిస్తే శత్రుబాధలు నశిస్తాయి. విజయం కలుగుతుంది. దుర్గతుల నుండి రక్షించే తల్లిగా దుర్గమ్మను వేదవిధులు కీర్తిస్తారు. సకల గ్రహ బాధలు దుర్గమ్మ నామాన్ని జపిస్తే తొలగిపోతాయి. ఆరాధకులకు దుర్గాదేవి శీఘ్ర అనుగ్రహకారిణి.

**అలంకారం :** అమ్మవారిని ఎరుపు వర్ణంతో కూడిన పట్టుచీరతో అలంకరిస్తారు.

**వస్త్రం :** ఎరుపు వస్త్రం, ఎరుపు అక్షతలు, పుష్పాలు : ఎర్రని పుష్ప ్పలు

**నివేదన :** అమ్మవారికి పులగాన్నం నివేదన చేయాలి.

**మంత్రం :** "ఓం దుం దుర్గాయైనమః" అనే మంత్రాన్ని 108 సార్లు పఠించాలి. దుర్గా, లలిత అష్టోత్తరాలు, దుర్గాసూక్తం పారాయణం చేస్తూ అమ్మవారిని పూజించాలి.

. - భట్టిప్రోలు నటరాజ కుమార్

## మీ డెస్క్ దగ్గర ఈ బోర్డ్ ఉందా!



పని ఏదైనా తమదైన శైలిలో దూసుకుపోతూ... ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆశించని ఉద్యోగినులు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. ఆయా సంస్థలూ ఇదే విధమైన మెరుగుదలని కోరుకుంటాయి. అందుకే ముందస్తు సమావేశాలు పెట్టి, ఉత్పాదకత పెంచాలని సూచించారు. అందుకు అనుగుణంగా ప్రణాళికల్ని వేసుకోమని సలహాలు ఇస్తుంటాయి. అయితే, పైవాళ్లు కోరుకునే మెరుగుదల మీకు భారం కాకూడదన్నా... ఒత్తిడీ ఆందోళనలకు దారితీయకూడదన్నా మనకంటూ ఓ వ్యూహం ఉండాల్సిందే. ఇందుకు ఏం చేయాలి అంటే.. మనం చేసిన, చేయాల్సిన పనులను బేరీజు వేసుకుని... ఓ చోట రాసుకుని డెస్క్ దగ్గర మీకు కనపడేలా అమర్చుకోండి. దాన్ని చూడటం వల్ల మనం చేస్తున్న పనిలో లోటుపాట్లు తెలుస్తాయి. ఎక్కడ ఏ విధంగా నైపుణ్యాలను పెంచుకోవచ్చో అవగాహన వస్తుంది. లక్ష్యాల గురించి ప్రస్తావిస్తే... బర్నవుట్ తప్పదు. అందుకే దీన్లో ఇంకోవైపు విజయాల్ని కూడా రాయాలి. డీలా పడిన సమయాల్లో అవి బూస్టర్స్ ఉపయోగపడతాయి. ఇలా ప్రతి విషయంలో మంచి చెడుల్ని ఉటంకిస్తూ తయారుచేసుకునే ఆ బోర్డు మీకు దిక్సూచిగా, ప్రేరణగా ఉంటుంది. నిరంతరం మీ లక్ష్యాలను గుర్తుచేస్తుంది. దానితో మీ మరింత మెరుగ్గా దినచర్యకు అవకాశం లభిస్తుంది. ప్రయత్నించారు కదూ!

## ఎక్కువగా స్పందించారట ..



కొన్ని రకాల కీటకాలకు అమ్మాయిలు భయపడుతుంటారుని తెలుసు. అయితే, ఈ భయాలు పెరిగి పెద్దయ్యాక ఏర్పడతాయన కుంటాం కానీ,పసి వయసులోనూ అలానే స్పందిస్తారట. 11 నెలల వయసున్న పాప, బాబులకు సాలీడు ఫొటోలను చూపించి స్టడీ చేశారట పెన్సిల్వేనియా లోని శాస్త్రవేత్తలు. పాప వాటిని చూసి భయపడగా, బాబు అంతగా స్పందించలేదట.

## మెరిసే సీతమ్మ పువ్వులు



పూలు మన సంస్కృతి లో ఓ భాగం. అవి లేనిదే ఏ పూజ, పండగా పూరన్తి కాదు. అందులోనూ బతుకమ్మ అంటేనే పూల సంబరం. దీన్ని పేరేనచందుకు వాడే పూలలో సీతమ్మ జడ గంటలు ముందు వరుసలో ఉంటాయి. వీటికే కోడిజుట్టు పువ్వులు, సీతమ్మ జడ బంతులు, ముఖమల్ పువ్వులు, మహారాణీ పువ్వులు.. అనే చాల పేర్లు ఉన్నాయి. ఆంగ్లంలో సెలోలసియా అని పిలిచే ఈ మొక్క ప్రతి కొమ్మకూ సన్నాయి ఆకృతిలో పూలు వికసిస్తాయి. వర్షాకాలంలో మొదలైన ఈ పూల సందడి..చలికాలం దాటేవరకూ ఉంటుంది. ఇక, సూర్య కాంతి వీటిపై ప్రసరించినప్పుడు ఈ పూలు మెరిసిపోతూ ఆకట్టుకకుంటాయి. వీటిల్లో ఎక్కువగా రాణీరంగు పుష్పాలే ఎక్కువగా కనిపించినా ఎరుపు, పసుపు, ఉదా.. వంటి మరెన్నో వర్ణాల్లోనూ దొరుకుతున్నాయి. సెలోసియా మొక్కను పాశ్చాత్య దేశాల్లో ఎండబెట్టి పూల అలంకరణల్లో వాడతారు.సంప్రదాయ ఆయుర్వే వైద్యంలో రక్తసావ సమస్యలకు, గ్యాస్ సంబంధిత ఇన్ఫెక్షన్ల నివారణకు, అతిసారం, తల నొప్పి చికిత్సల్లోనూ వాడతారు.

## పువ్వుల్లో ఆయుర్వేద గుణం

ఏమేమి పువ్వ పువ్వనే గౌరమ్మ.. ఏమేమి కాయప్పునే.. అంటూ పూలలో పూవుగా ప్రతిఒక్కరూ మెరిసిపోయే పండుగ బతుకమ్మ. పువ్వులోనూ ఒక ఆయుర్వేద గుణము తప్పకుండా ఉంటుంది. మన చర్మ ఆరోగ్యాన్ని చక్కగా సంరక్షించరుకోవచ్చు. అందాన్ని కూడా ద్విగుణీకృతం చేసుకోవచ్చు. బతుకమ్మలో ఉపయో గించే ప్రతి పువ్వులోనూ ఏడో ఒక ఆయు ర్వేద గుణం తప్ప కుండా ఉంటుంది. ఇవి మన శరీరాన్ని వివిధ ఆరోగ్య సమస్యల నుంచి దూరం చేయడమే కాదు.. చర్మాన్ని అందంగా మెరిపించడంలోనూ ఉపయోగపడతాయని చెబుతున్నారు నిపుణులు.



**తంగేడుతో తళతళ..** బతుకమ్మ అనగానే ముందుగా గుర్తొచ్చే పువ్వు తంగేడు పువ్వు. శాస్త్రానికి కనీసం ఒక్క తంగేడు పువ్వేవా లేకుండా బతుకమ్మను పేర్చకూడదంటారు పెద్దలు.. అంతటి ప్రాముఖ్యం ఉంటుంది. తంగేడు పువ్వుకు.. ఈ పువ్వు సౌందర్యాన్ని కాపాడడంలోనూ ఎంతో ఉపయోగపడుతుంది. దీన్ని ఎండబెట్టి, రేకలను పొడిచేసి, ఆ పొడిని ప్రతిరోజూ ఉపయోగిస్తే మంచి చర్మఛాయ సొంతమవుతుందట. దీనికోసం ఈ పూరేకల పొడిని మెత్తగా జల్లించుకొని అందులో శనగపిండి, రోజ్ వాటర్ కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని చర్మానికి పట్టించి, 15 నిమిషాల పాటు అలాగే ఉంచి, ఆ తర్వాత గోరువెచ్చటి నీళ్లతో కడిగేయాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తుంటే చక్కటి చర్మ ఛాయను సొంతం చేసుకోవ చ్చంటున్నారు నిపుణులు. అలాగే తంగేడు పూల పొడితో స్క్రాబ్ని కూడా తయా రు చేసుకోవచ్చు. దీనికోసం నిమ్మతొక్కల పొడి, పెసర పిండి, శెనగపిండి, గులాబీ రెక్కల పొడి సమాన మొత్తాల్లో తీసుకొని బాగా మెత్తగా చేసుకొని జల్లించుకోవాలి. దీన్ని రోజూ స్నానం చేస్తే ముందు శరీరానికి పట్టిస్తే చర్మం కాంతి మంత మయ్యే అవకాశం ఉంటుందని నిపుణులు అంటున్నారు.



**మెరిపించే మందార..** మందారం చర్మ ఆరోగ్యానికే కాదు.. జుట్టు పట్టులా మెరిసేం దుకు కూడా చక్కగా ఉపయోగపడు తుంది. దీనికోసం మందార పూలను ఎండబెట్టి ఆ పొడిని నూనెలో వేసుకొని తలకు పట్టించవచ్చు. దీనితో జుట్టు బాగా పెరిగే వీలుంటుంది. ఇక చర్మ సౌందర్యం కోసం కూడా మందారను ఉపయోగించవచ్చు. దీనికోసం మందార పూరేకులు పొడి, బియ్యప్పిండి సమాన మొత్తాల్లో తీసుకొని, దానికి విటమిన్ ఇ ఆయిల్ కలుపుకోవాలి. ఈ పేస్ట్ని రాసుకుని కొద్దిసేపు అలాగే ఉంచుకోవాలి. ఆ తర్వాత తడి గుడ్డతో తుడిచి, కడిగేసుకోవాలి, దీన్ని ఉపయోగించడం వల్లమొటిమలు, మచ్చలు తగ్గడంతో పాటు చర్మం కూడా కాంతిమంత మయ్యే అవకాశం ఉంటుందంటు న్నారు నిపుణులు. ప్రస్తుతం ఆయా పూలతో చేసిన ప్రత్యేకమైన పౌడర్లు, స్క్రాబ్స్, ప్యాక్.. తదితరాలు అందుబాటులో ఉన్నాయి. నిపుణుల సలహాతో వాటిని ఉపయోగించవచ్చు.

## వడ లాంటి ఇడ్లీ

వడ లాంటి ఇడ్లీ
ఇడ్లీ, వడ తరచుగా చేసుకునేవే కానీ, ఇడ్లీ లాంటి వడ లేదా వడ లాంటి ఇడ్లీ ఎప్పుడైనా తిన్నారా? అయితే ఇప్పుడు ప్రయత్నించి చూడండి. పసుపుకోసం.. అటుకులు కప్పు, పెరుగు, ఉప్మారవ్వ అర కప్పు చొప్పున, ఉప్పు రుచికి తగినంత, పచ్చిమిరపకాయలు 2, కొత్తిమీర తరుగు గుప్పెడు, అల్లంపచ్చిమిర్చి ముద్ద చెంచా, పుదీనా తరుగు 2 చెంచాలు, నూనె రెండు చెంచాలు, కరివేపాకు రెబ్బలు 2 చొప్పున తీసుకోవాలి. ఎలా చేయాలంటే. అటుకులను కడిగి, నీళ్ల లేకుండా గట్టిగా పిండేయాలి. అందులో పుదీనా తరుగు, రవ్వ, పెరుగు, ఉప్పు, అల్లంపచ్చిమిర్చి ముద్ద, కొత్తిమీర తరుగు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంతో గారెలు చేసి.. సిలికాన్ కోటెడ్ పేపర్ పరిచిన ఇడ్లీ పాత్రలో సుమారు పావుగంట ఉడికించాలి. కడాయిలో నూనె వేడయ్యాక.. ఆవాలు వేయాలి. అవి చిటపటలాడాక సాగానికి చీల్చిన పచ్చిమిరపకాయలను జోడించాలి. అవి వేగాక.. కరివేపాకు, పసుపు వేయాలి. అర తర్వాత నిమిషం ఉడికించిన గారెలను జతచేయాలి. వాటిని నాలుగైదు నిమిషాలు వేయించి.. పైన కొద్దిగా కొత్తిమీర చల్లాలి. అంతే వెరైటీ వంటకం తయారైపోతుంది. వీటిలోకి పల్లీ, కొబ్బరి, టొమాటో ఏ పచ్చడైనా బాగుంటుంది. టొమాటో లేదా చిల్లీ సాస్ నూ తినొచ్చు.



## మొక్కలకు చీమలా?

**చీమలు ఇంట్లో ఉండే** ఆహారపదార్థాల చుట్టూ చేరి చిరాకు పెడు తుంటాయి. ఇంతేకాకుండా తోటలో మొక్కలపై చేరి వాటికీ హాని చేస్తాయి. వీటి బెడద తగ్గించే చిట్కాలివి... బేకింగ్ సోడా... వంటగదిలో దొరికే బేకింగ్ సోడాతో చీమలను రాకుండా చేయొచ్చు. వేపనూనెలో స్పూన్ బేకింగ్ సోడా వేసి రెండింటినీ కలిపి చీమలు ఉండే ప్రదేశంలో రాయాలి. ఇలా చేయడం వల్ల మొక్కలకు పట్టిన చీమలు పోతాయి. వైట్ వెనిగర్ వైట్ వినెగర్, నీళ్ల సమాన పరిమాణంలో తీసుకుని సీసాలో పోసు కోవాలి. దీన్ని ఇంటి తోటలోని మొక్కల దగ్గర చేరిన చీమలపై పిచికారీ చేయాలి. ఇలా వారానికి రెండు సార్లు ఈ నటిని పిచికారీ చేయం వల్ల చీమలు పోతాయి. నిమ్మరసంలో.. సిట్రస్ వాసన చీమలను అరికట్టడానికి సాయ పడుతుంది. లీటరు నీటిలో రెండు చక్కల లవంగ నూనె, కాస్త నిమ్మరసం కలిపి మొక్కలపై స్ప్రే చేస్తే ఈ వాసనకు చీమలు పారిపోతాయి.



## బతుకమ్మ ఉయ్యాలో ..



ఉయ్యాల ఉయ్యాల ఉయ్యాలో
ఊరు వాడల ఉయ్యాలో
బంగారు బతుకమ్మ ఉయ్యాలో ॥ ఊ ॥
ఆకాశంలో చుక్కలు ఉయ్యాలో
పూవులై పొద్దు పొడిచే ఉయ్యాలో
వానలు కురియంగ ఉయ్యాలో
పూవులు పూయంగ ఉయ్యాలో
తీరొక్క పూలతో ఉయ్యాలో
వనమంత మెరిసింది ఉయ్యాలో ॥ఉ॥
రంగు రంగుల పూలు ఉయ్యాలో
భూదేవి సిగలో ఉయ్యాలో
సింగిడి రంగులతో ఉయ్యాలో
ముగ్గులే వేసిరి ఉయ్యాలో ॥ఉ॥
అమ్మలక్కలు చేరి ఉయ్యాలో
బతుకమ్మ పేర్చిరీ ఉయ్యాలో
బంగారు బతుకమ్మ ఉయ్యాలో
భాగ్యమై వచ్చింది ఉయ్యాలో. ॥ ఊ ॥
ఆడపడుచులంత ఉయ్యాలో
ఆడి పాడిరి ఉయ్యాలో
దేవ లోకం నుంచి ఉయ్యాలో
దేవతలు తిలకించిరి ఉయ్యాలో
దీవెనలెన్నో ఇచ్చిరి ఉయ్యాలో
ఒక్కొక్క బతుకమ్మ ఉయ్యాలో
ఒక్కొక్క రీతిగా ఉయ్యాలో
చిన్ని క్రిష్ణుడు ఎత్తిన ఉయ్యాలో
గోవర్ధన గిరియే ఉయ్యాలో. ॥ఉ॥
బతుకమ్మ సందడితో ఉయ్యాలో
ఊరువాడ బృందావనమే ఉయ్యాలో
గోపికలందరు వచ్చిరి ఉయ్యాలో
గౌరమ్మను కొలిచిరి ఉయ్యాలో ॥ఉ॥
నీళ్ళపై తేలేటి బతుకమ్మ ఉయ్యాలో
మందర పర్వతం ఉయ్యాలో
నీళ్ళన్నీ మారేను ఉయ్యాలో
అవనిపై అమృతంగ ఉయ్యాలో ॥ఉ॥
తొమ్మిది రోజుల పండుగ ఉయ్యాలో
మా వాళ్ళు వచ్చిరి ఉయ్యాలో
మీ వాళ్ళు వచ్చిరి ఉయ్యాలో
ఎనుకటి జ్ఞాపకాలు ఉయ్యాలో
ఎరుక జేసుకొంటిమి ఉయ్యాలో ॥ఉ॥
పొద్దు గూకే వేళాయె ఉయ్యాలో
గంగ దరి చేరాలి ఉయ్యాలో
ఏడాది కొకసారి సారి ఉయ్యాలో
వచ్చి పోవమ్మ ఉయ్యాలో ॥ఉ॥
ఉయ్యాల ఉయ్యాల ఉయ్యాలో
ఊరు వాడల ఉయ్యాలో
బంగారు బతుకమ్మ ఉయ్యాలో
బంగారు బతుకమ్మ ఉయ్యాలో
బంగారు బతుకమ్మ ఉయ్యాలో

-పట్లోళ్ళ బక్కారెడ్డి




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.